GradsUniverse
STUDY IN TOP GLOBAL DESTINATIONS
/GradsUniverse
+91 63017 26400
FREE IELTS Coaching
•Application Fee Waiver
•No GRE/GMAT Required
•Free Counselling

www.voodyam.com
Estd :1999

# వుదయం

DOMESTIC & INTERNATIONAL
FLIGHT TICKET
Easy Booking | Best Discounts | Get Your Tickets Now
CELL: +91 6301726400

గురువారం, అక్టోబర్ 16, 2025 | హైదరాబాద్ | సంపుటి : 26 | సంచిక :219| వెల : రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM TELUGU DAILY
/VOODAYAM Simultaneously published from Hyderabad, Adilabad, Khammam, Karimnagar, Guntur & Warangal

## భారత్ సహాయం కీలకం

- అమెరికా మంత్రి వ్యాఖ్యలు
- చైనా ప్రపంచాన్ని గురిపెట్టింది

రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో ఓవైపు భారత్‌పై సుంకాల మోత మోగించిన అమెరికా.. చైనా విషయంలో మాత్రం మన సాయం కోరుతోంది. అరుదైన ఖనిజాలపై బీజింగ్ నియంత్రణను ఎదుర్కొనేందుకు భారత్ ఐరోపా మద్దతు కావాలని ఆశిస్తోంది. ఈ మేరకు అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు.



ప్రపంచంలో ఎక్కడా దొరకని అరుదైన ఖనిజాల ఎగుమతిపై ఇటీవల చైనా నియంత్రణలు విధించింది. ఇకపై విదేశీ కంపెనీలు వాటిని దిగుమతి చేసుకోవాలంటే ప్రత్యేక అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టంచేసింది. దీనిపై తాజాగా స్కాట్ బెసెంట్ స్పందించారు. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రత్యక్ష సవాలేనని బీజింగ్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. "ఇది చైనాకు, ప్రపంచ దేశాలకు మధ్య నెలకొన్న పోటీ. ప్రపంచ పంపిణీ వ్యవస్థలపై చైనా గురిపెట్టింది. మేం అలా జరగనివ్వం. బీజింగ్ దూకుడును మేం అడ్డుకుంటాం. ఇందు కోసం ఇప్పటికే మిత్రదేశాలను సంప్రదిస్తున్నాం. చైనాను ఎదుర్కొనేందుకు మాకు భారత్, ఐరోపా దేశాల మద్దతు కావాలి" అని ఫాక్స్‌న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమెరికా మంత్రి వెల్లడించారు. అమెరికా ప్రపంచ శాంతిని కోరుకుంటుంటే.. చైనా ఆర్థిక యుద్ధం చేస్తోందని ఆయన దుయ్యబట్టారు. అరుదైన ఖనిజాలపై చైనా నియంత్రణ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నకు కోపం తెప్పించింది. దీంతో బీజింగ్‌పై 100శాతం అదనపు సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. అవి నవం బరు 1వ తేదీ నుంచి గానీ, అంతకుముందు నుంచి గానీ అమల్లోకి వస్తాయని తెలిపారు. దీంతో పాటు చైనాకు అమెరికా సంస్థలు ఎగు మతి చేసే కీలక సాఫ్ట్‌వేర్‌ల పైనా నియంత్రణ విధిస్తామని వెల్లడించారు. ఇక చైనాతో అమెరికా వాణిజ్య యుద్ధం నానాటికీ ముదురు తోంది. ఇప్పటికే ఇరుదేశాలు నౌకలపై పరస్పరం ప్రత్యేక ఫీజులను కూడా విధించాయి. ఈ నేపథ్యంలో తాజాగా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. బీజింగ్‌తో వంటనూనె సంబంధిత వ్యాపారాల రద్దుకు యోచిస్తున్నట్లు తెలిపారు.

### జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

## బిజెపి అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి



**హైదరాబాద్:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు అభ్యర్థిని బిజెపి ప్రకటిం చింది. లంకల దీపక్‌రెడ్డి పేరు ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ మేరకు పార్టీ వర్గాలు వెల్లడించాయి. 2023 ఎన్నికల్లోనూ దీపక్ రెడ్డి జూబ్లీహిల్స్ బిజెపి అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. అనారోగ్య కారణాలతో ఈ ఏడాది జూన్ 8న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూశారు. ఆయన మృతితో ఉప ఎన్నిక అనివార్యమైంది. నవంబర్ 11న పోలింగ్ నిర్వహించి 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.



## జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత

- త్వరలో అక్రిడిటేషన్ పాలసీ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్,అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పాత్రికేయుల కోసం ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన జర్నలిస్టులకు అందేలా విధి విధానాలను రూపొందిస్తున్నామని తెలిపారు.

బుధవారం నాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో మీడియా అకాడమీ ఛైర్మన్ .శ్రీనివాసరెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ కమీషనర్ సిహెచ్. ప్రియాంక, సిపిఆర్‌వో మల్సూర్ తో కలిసి అక్రిడిటేషన్ పాలసీపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టుల గౌరవాన్ని కాపాడేవిధంగా శాస్త్రీయ పద్దతిలో అక్రిడిటేషన్ పాలసీ ఉండాలని అధికారులను ఆదేశించారు. వీలైనంత త్వరగా అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయడానికి ఈనెల చివరినాటికి పాలసీ విధివిధానాలను కొలిక్కితీసుకురావాలని ఆదేశించారు.

## ధాన్యం దిగుబడిలో తెలంగాణా ఆల్ టైం రికార్డ్

హైదరాబాద్,అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి): ధాన్యం దిగుబడిలో తెలంగాణా ఆల్ టైం రికార్డ్ సృష్టించిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. యావత్ భారతదేశంలోని 29 రాష్ట్రాలలో,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ ఇంతటి దిగుబడి రాలేదని ఆయన అన్నారు. వ్యవసాయం పట్ల రైతాంగం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతోటే ఇంతటి ఉత్పత్తి సాధ్యపడిందని ఆయన చెప్పారు. వానాకాలం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పై బుధవారం ఉదయం డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయం నుండి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు ,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు,వ్యవసాయ శాఖా కార్యదర్శి సురేంద్ర మోహన్, రవాణాశాఖా కమిషనర్ రఘునందన్ రావు,పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆయా జిల్లాల కలెక్టర్లతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సునిశితమైన అంశమని,కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎక్కడ కుడా అసౌకర్యం కలుగ కుండా చూడాలని సూచించారు.



- 148.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించిన ఘనత ప్రభుత్వానిదే
- రైతాంగం పట్ల అనుసరించిన విధానాలతో అత్యదిక దిగుబడి
- ధాన్యం దిగుబడి లోనే కాదు కొనుగోలులోను రికార్డే
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

### నామినేషన్ దాఖలు చేసిన

## బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత



హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు భారత రాష్ట్ర సమితి అభ్యర్థిగా మాగంటి సునీత నామినేషన్ దాఖలు చేశారు. షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ఆమె నామపత్రాలు సమర్పించారు. ఆమె వెంట పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, నేతలు, కార్యకర్తలు ఉన్నారు. అనారోగ్య కారణాలతో ఈ ఏడాది జూన్ 8న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూశారు. ఆయన మృతితో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతకు భారత రాష్ట్ర సమితి బీఫామ్ ఇచ్చింది. నవంబర్ 11న పోలింగ్, 14న కౌంటింగ్ ఉండనుంది.

## దారులు వేరైనప్పుడు కేసీఆర్ ఫొటో వాడటం సరికాదు

**సామాజిక చైతన్యం కోసమే 'జాగృతి జనం బాట': కవిత**



**హైదరాబాద్:** సామాజిక చైతన్యం కోసమే 'జాగృతి జనం బాట' యాత్ర అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. హైదరాబాద్‌లో యాత్ర పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. పోస్టర్‌పై తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దారులు వేరైనప్పుడు కేసీఆర్ ఫొటో వాడటం సరికాదని భావించినట్లు తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే బాగుంటుందనే అనేక మంది ప్రాణత్యాగం చేశారన్నారు. నాలుగు నెలల పాటు యాత్ర ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా అందరి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు చాలా తెలివైన వాళ్లని.. వారికన్నీ తెలుసని చెప్పారు.

## నీతీశ్ మళ్లీ సీఎం కాలేరు

- ప్రశాంత్ కిశోర్
- పార్టీ కోసం ఎన్నికల్లో పనిచేస్తా..
- బిహార్ ఎన్నికల్లో పోటీ చేయను
- జన సురాజ్ పార్టీ అధినేత కీలక నిర్ణయం



**పట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ జన సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ ఎన్నికల్లో వ్యక్తిగతంగా పోటీకి దూరమయ్యారు. ఈ మేరకు పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. పార్టీ కోసం ఎన్నికల్లో పని చేస్తానని.. తాను మాత్రం పోటీ చేయనని పీకే తెలిపారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో నేను పోటీ చేయకూడదని పార్టీ నిర్ణయించింది. దానికి నేను కట్టుబడి ఉన్నాను. రాఘోపూర్‌లో తేజస్వీ యాదవ్‌పై పోటీకి మరో అభ్యర్థిని ప్రకటించాం. పార్టీ ప్రయోజనాల మేరకే నేను పోటీకి దూరంగా ఉంటున్నా. ఒకవేళ నేను పోటీలో ఉంటే.. పార్టీ సంస్థాగత కార్యకలాపాల నుంచి నా దృష్టి మళ్లే అవకాశం ఉంది" అని ప్రశాంత్ కిశోర్ వివరించారు. ఇక, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో జన సురాజ్ పార్టీ దాదాపు 150 సీట్లలో విజయం సాధిస్తుందని పీకే విశ్వాసం వ్యక్తంచేశారు. అప్పుడు తమ పార్టీ దేశవ్యాప్తంగా ప్రభావం చూపుతుందన్నారు. ఒక వేళ ఎన్నికల్లో హంగ్ ఏర్పడితే జన సురాజ్ పార్టీ ఏ కూటమికి మద్దతిస్తుందన్న ప్రశ్నకు.. పీకే బదులిస్తూ 'అది అసాధ్యం' అని పేర్కొన్నారు. బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్‌పై ప్రశాంత్ కిశోర్ విమర్శలు గుప్పించారు. "వచ్చే ఎన్నికల్లో జేడీయూకు కనీసం 25 సీట్లు కూడా వచ్చే అవకాశం లేదు. ఎన్డీయేకు ఓటమి తప్పదు. నీతీశ్ కుమార్ మళ్లీ సీఎం కాలేరు. అటు ఇండియా కూటమి పరిస్థితి కూడా అంతగా మెరుగ్గా లేదు. కాంగ్రెస్, ఆర్జేడీల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి" అని పీకే ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే మాఫియాపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన నెల రోజుల్లోనే 100 మంది అవినీతి రాజకీయ నేతలు, అధికారులను గుర్తించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బిహార్‌లో వచ్చే నెల 6, 11 తేదీల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. నవంబరు 14న ఫలితాలు వెల్లడి కానున్నాయి.



## రూ.139 కోట్ల భూమికి విముక్తి!

**రాజేంద్రనగర్‌లో ఆక్రమణలు తొలగించిన హైడ్రా**

**రాజేంద్రనగర్:** హైదరాబాద్ శివారు రాజేంద్రనగర్ పరిధిలో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. బద్వేల్-ఉప్పరపల్లి గ్రామాల్లో జనచైతన్య లేఔట్ ఫేజ్ 1, 2లో కబ్జాకు గురైన 4 పార్కులకు విముక్తి కల్పించింది. 19,878 గజాల భూమిని ఆక్రమణదా రుల నుంచి స్వాధీనం చేసుకుంది. దీని విలువ రూ.139 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. దాదాపు 120 ఎకరాల్లో ఫేజ్ 1, 2 హుడా అప్రూవల్ పేరుతో ఏర్పాటు చేసిన లేఔట్‌లో పార్కులు కబ్జాకు గురవుతున్నాయని హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులు అందాయి. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం కబ్జా జరిగినట్లు నిర్ధరించారు. ఈ క్రమంలో బుధవారం ఆక్రమణలను హైడ్రా సిబ్బంది తొలగించారు. ప్రహరీలు నిర్మించుకుని వేసిన షెడ్‌లు, రూమ్‌లను తొలగించారు. అనంతరం ఫెన్సింగ్ నిర్మాణ పనులు చేపట్టారు.

## ఖగోళ శాస్త్రవేత్తల ఆందోళన

- మానవాళికి పెద్ద సవాల్
- భూమిపై రాలిపోతున్న స్టార్‌లింక్ ఉపగ్రహాలు

ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ ఉపగ్రహాలు తరచూ భూవాతావరణంలోకి పడిపోతుండడంపై ఖగోళ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటివల్ల భూ కక్ష్య భద్రతకు ముప్పు కలిగించే ఖగోళ వ్యర్థాల చైన్ రియాక్షన్ ఉండే అవకాశం ఉందని స్మిత్సోనియన్ ఖగోళ శాస్త్రవేత్త జోనాథన్ మెక్‌డోవెల్ వెల్లడించారు. ప్రస్తుతం రోజుకు ఒకటి నుంచి రెండు స్టార్‌లింక్ ఉపగ్రహాలు భూ వాతావరణలోకి ప్రవేశిస్తున్నాయని.. ముందుముందు భూమిపై రాలిపోతున్న స్టార్‌లింక్ ఉపగ్రహాల సంఖ్య



రోజుకు 5 వరకు పెరగవచ్చని తెలిపారు. భవిష్యత్తులో స్పేస్‌ఎక్స్, అమెజాన్ చేపట్టిన ప్రాజెక్ట్ కైపర్, చైనాకు చెందిన మరిన్ని ఉపగ్రహాలు కక్ష్యలోకి ప్రవేశించడంతో వీటి సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం కక్ష్యలో 8 వేలకు పైగా స్టార్‌లింక్ ఉపగ్రహాలు ఉన్నాయని.. చైనా మరో 20 వేల ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెడుతుందనే అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

**నింగిలోకి దూసుకెళ్లి తిరిగొచ్చిన స్పేస్‌ఎక్స్ రాకెట్**

అయితే ఖగోళంలో ఇలాంటి ఉపగ్రహాలు, రాకెట్ శకలాల సంఖ్య పెరగడం వల్ల అంతరిక్ష వ్యర్థాలు ఎక్కువై.. కెస్లర్ సిండ్రోమ్ అనే చైన్ రియాక్షన్ వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్త జోనాథన్ మెక్‌డోవెల్ ఆందోళన వ్యక్తంచేశారు. కక్ష్యలో ఉన్న ఇతర ఉపగ్రహాలు ఢీకొనే అవకాశం ఉంటుందని.. ఖగోళ వ్యర్థాల చైన్ రియాక్షన్, సౌర కార్యకలాపాలపై ప్రభావం ఉంటుందన్నారు.

## వెంబడించి పట్టుకొని..



**సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు భారీగా గంజాయిని పట్టుకు న్నారు. మునిపల్లి ఎస్సై రాజేశ్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అం దింది. ఈమేరకు కంకోల్ టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. రెండు వాహనాల్లో తరలిస్తున్న 260 కిలోల గంజాయి పొట్లాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పారిపోయేందుకు యత్నించగా.. నలుగురిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.1.30 కోట్లు ఉంటుందని పోలీసులు అంచనా వేశా రు. వాహనాలను స్వాధీనం చేసుకొని, నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# సంపాదకీయం

## యంగ్ ఇండియా కలనెరవేరేనా?

ఉస్మానియా యూనివర్శిటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 200 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు రూ. 40 వేల కోట్లతో ఏర్పాటు చేస్తామని అన్నారు. ఢిల్లీలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశం అయిన సందర్భంలో కూడా 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు కడతాం 2.70 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుంది, కనుక నిధులు విడుదల చేయమని కోరారు. అరవింద్ కేజ్రీవాల్ మూడు సార్లు పాఠశాలలు మూలంగానే ఢిల్లీలో అధికారంలోకి వచ్చారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని పనిచేస్తానని అన్నారు. మంచిదే, యంగ్ ఇండియా పాఠశాలల గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలగనడంలో తప్పులేదు! కలలు సాకారం కావడానికి ఉన్న పునాది ఏమిటి అనేదే అసలు ప్రశ్న? ఈ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఆలోచన తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రట బుర్ర వెంకటేశం బుర్రలోనుంచి వచ్చిన సమగ్ర పాఠశాల విధానం. ఇప్పటికే జిల్లా కేంద్రాల వరకు విస్తరించిన కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన అంతర్జాతీయ ప్రమాణాల పేరుతో లక్షల రూపాయల్లో ఫీజులు వసూలుచేస్తున్న ప్రైవేటు పాఠశాలలకు ప్రత్యామ్నాయ ఆలోచన ఆయనచేసి ఉండవచ్చును,తప్పులేదు! పదేపదే పాలకులు ఈ పాఠశాలల గురించి మాట్లడడం వలన ప్రభుత్వ ప్రాధాన్యత చెప్పకనే చెప్పినట్లైంది. 28 ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం కోసం 2024 ఏప్రియల్‌లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. వాటిస్థితి ఇప్పుడు ఏమిటి? ప్రభుత్వం చెబుతున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలల అసలు స్వరూపం ఏమిటి? ఒక్కో పాఠశాలకు 25 ఎకరాల స్థలం, 2560 మంది విద్యార్థులు, 124 మంది ఉపాధ్యాయులు, విశాలమైన తరగతి గదులు నిర్మించాలి. ఒక్కో పాఠశాల నిర్మాణం కోసం 200 కోట్ల రూపాయలు ఖర్చు చొప్పున 200 పాఠశాలల నిర్మాణం కోసం రూ. 40 వేల కోట్లు నిధులు సమీకరించాలి. 5 వేల ఎకరాల స్థలం సేకరణ చేయాలి. 24,800 మంది ఉపాధ్యాయులను కొత్తగా రిక్రూట్‌మెంట్ చేసుకోవాలి. వేలకోట్ల రూపాయలతో తరగతి గదులు నిర్మించాలి. ఆధునిక వసతి సౌకర్యాలు కల్పించాలి. ముఖ్యమంత్రి కలమొత్తం సాకారం అయితే, రాష్ట్రంలో 5 లక్షలమంది విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలుతో నాణ్యమైన ఉచిత విద్య అందుతుంది. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న 27 లక్షల 69 వేల మంది విద్యార్థుల్లో మిగతా 22 లక్షల విద్యార్థుల భవితవ్యం ఏమవుతుంది? ఇక ఈ ఐదు లక్షల మంది విద్యార్థులు ఎక్కడనుండి వస్తారు. ఇప్పుడున్న ప్రభుత్వ పాఠశాల లో నుండే కదా? అంటే ఉన్న బడుల నమోదును, ఉనికిని దెబ్బ తీసి, దివాలాతీయించడమే కదా! ఇక ఇప్పటికే రాష్ట్రంలో 30,022 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఒక్కో పాఠశాలకు సరాసరి ఎకరం స్థలం వేసుకున్నా 30 వేల ఎకరాల విలువైన భూములు, గత 20 ఏళ్ళుగా సర్వశిక్షా అభియాన్ నిర్మించిన 2 లక్షల కోట్ల విలువైన తరగతి గదులు, 2 లక్షల 7 వేల మంది బోధనా సిబ్బంది ఉన్నారు. ఏటా వేతనాలకు రూ. 18 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. ప్రభుత్వ బడుల మనుగడ, భవిష్యత్తు, ఉనికి ఏమిటి? ఇప్పటికే ప్రభుత్వ బడులకు ఇన్నివేల ఎకరాలు ప్రభుత్వ స్థలాలు ఉండగా, మరో 5 వేల ఎకరాల పంట భూములు ఇంటిగ్రేటెడ్ పాఠశాలల కోసం సేకరించడం అవసరమా? ఇప్పటికే ప్రభుత్వ బడుల్లో పిల్లలు లేనిచోట బోధనా సిబ్బంది ఉండడం, పిల్లలు ఉన్న చోట మౌలిక సౌకర్యాలు, బోధనా సిబ్బంది లేకపోవడం, ప్రభుత్వ పాఠశాలల్లో అసమతౌల్య నిర్వాహణ అనేది ఎంతో బోధనాశక్తిని వృథా చేస్తున్నది. కాలక్రమంలో అనేక ప్రభుత్వబడులు మూతపడి ఉండడం, మరికొన్ని మూత దశకు చేరుకోవడం చూస్తున్నాము. ఇట్లాంటి స్థితిలో ఇప్పటికే ఏడాదిన్నర కాలంలో రెండు విద్యా కమిషన్‌లను ప్రభుత్వం నియమించింది. మాజీ ఐఎఎస్ అధికారి ఆకునూరి మురళి అధ్యక్షతన నియమించిన తెలంగాణ విద్యా కమిషన్ రాష్ట్రం అంతా పర్యటించి, అనేకమంది విద్యారంగం ప్రముఖుల అభిప్రాయాలు సేకరించి ఒక నివేదిక ఇచ్చింది. ఉన్న ప్రభుత్వ బడుల స్థానంలో మండలానికి నాలుగు తెలంగాణ ఫౌండేషన్ స్కూల్స్, మూడు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని, బడులు లేని క్యాచ్‌మెంట్ ఏరియా నుండి ఉచిత రవాణా సౌకర్యం పాఠశాల వరకు కల్పించాలని, ఒక్కో మండలానికి రూ. 50 కోట్లు చొప్పున, ప్రతి ఏటా వంద మండలాలకు రూ. 5 వేల కోట్లు వెరసి ఆరు సంవత్సరాలలో 634 మండలాల్లో ప్రభుత్వ బడుల పూర్తి సంస్కరణకు రూ. 31,700 కోట్లు ఆర్థిక ప్రణాళిక కూడా ఇచ్చింది. కానీ, ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో ఒక్క పైసా విద్యా సంస్కరణ కోసం కేటాయించలేదు. సరికదా! ప్రభుత్వ పెద్దలు ప్రస్తుతం వీటి గురించి ఎక్కడా మాట్లాడడం లేదు? అంటే, కమిషన్ సిఫార్సులు చెత్తబుట్టకు పరిమితం చేసినట్లే గదా? గత పదేళ్ళలో కెసిఆర్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు పట్టించుకోకుండా ఒక వెయ్యి రెసిడెన్షియల్ స్కూళ్లను స్థాపించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల నమోదును దారుణంగా దెబ్బతీసింది. ఆయా రెసిడెన్సియల్ పాఠశాలలు దివాలా తీసిన ఇంజనీరింగ్ కళాశాలల్లో అద్దె భవనాల్లో కునారిల్లుతున్నాయి. ఇప్పటికీ వాటి ప్రణాళిక లోపం వలన ఆయా రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఫుడ్ పాయిజనింగ్ కేసులు బయటపడడం, కొన్ని కూలిపోయిన సంఘటనలు వెలుగు చూశాయి. పదేళ్ళ తర్వాత కెసిఆర్ విద్యా ప్రణాళిక వల్ల విద్యా ప్రమాణాలు స్థాయి దేశంలో 31వ రాష్ట్రంగా తెలంగాణ స్థిరపడింది. పరోక్షంగా ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ ఈ అనాలోచిత రెసిడెన్షియల్ వ్యవస్థ వలన మరింత దెబ్బతిని ఉంది. తెలంగాణ రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాల పేరుతో కార్పొరేట్ సంస్థలు విచ్చలవిడిగా పాఠశాలలు ఏర్పాటు చేసి ఒకటో తరగతికే రూ. రెండు లక్షల ఫీజులు ఏ విద్యా హక్కు చట్టం ప్రకారం వసూలు చేస్తున్నారో? చర్యలు తీసుకోవాలి. ప్రైవేటు పాఠశాల వ్యవస్థ ఫీజులు నియంత్రణ గురించి ఆలోచన చేయాలి. ఇప్పుడున్న అవసరాల స్థాయికి ప్రభుత్వ విద్యావ్యవస్థలో ప్రణాళిక రూపొందించాలి. అందుకు ఇప్పటికే అందుబాటులో ఉన్న ప్రభుత్వ వనరులు వాడుకోవడం, సద్వినియోగం దిశగా ఆలోచన చేయడం ప్రభుత్వం ముందు ఉన్న తక్షణ కర్తవ్యం.సిఎం రేవంత్‌రెడ్డి ప్రపంచస్థాయి నాణ్యమైన ఉచిత విద్య ప్రజలకు అందచేయాలనే ఆలోచనకు రావడం చాలా గొప్ప విషయం, ఆశయం, ఆలోచన, ఆయన కల అభినందనీయమే! కానీ, కలను సాకారం చేయడంలోనే పాలకుల నైపుణ్యం ఆధారపడి ఉంటుంది. ఇది ఒక్క రోజులోనో, ఏడాదిలోనో నెరవేరే లక్ష్యం కాదు! సుదీర్ఘ ప్రణాళిక, చిత్తశుద్ధితో కూడిన కృషి, పట్టుదల అవసరం. ప్రభుత్వ ఆలోచనలు ఆచరణీయమైన ప్రణాళిక దిశగా తెలంగాణ విద్యా వ్యవస్థ మంచి సంస్కరణ దిశగా కొనసాగాలని ఆశిద్దాం.

# అప్రతిష్ట పాలవుతున్న భారత్!

2047 నాటికి అభివృద్ధిలో భారత్‌ను ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంచాలనే 'వికసిత్ భారత్' అంటూ నిత్యం పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటున్నాం. ఇప్పటికే ఆర్థికంగా నాలుగో స్థానానికి చేరుకున్నామని, త్వరలో మూడో స్థానంకు చేరుకోబోతున్నామని భావిస్తున్నాం. అయితే కుల వివక్ష, ముఖ్యంగా అణగారిన ప్రజలపట్ల ఈసడింపు, వేధింపులకు మాత్రం అంతులేకుండా పోతున్నది. ఎంతమందిని మొక్కుబడిగా ఉన్నత పదవులకు తీసుకొచ్చినా, రాజ్యాంగపరంగా ఎన్ని రక్షణలు కల్పిస్తున్నా అత్యున్నత స్థాయిలో ఉన్నవారు సైతం ఎటువంటి వేధింపులు ఎదుర్కోవాల్సి వస్తుందో హర్యానాలో సీనియర్ ఐపిఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్య స్పష్టం చేస్తున్నది. అటువంటి సీనియర్ అధికారి ఆత్మహత్య చేసుకుంటే, వెంటనే ఎందుకు చేసుకున్నానో వివరించిన 8- పేజీల నోట్ లభించినా దాని ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి, తగు చర్యలు చేపట్టేందుకు రోజుల తరబడి ప్రభుత్వం సంశయిస్తూ ఉందంటే మన వ్యవస్థలో వివక్ష ఎంత లోతుగా పాతుకు పోయిందో వెల్లడవుతున్నది. కేవలం పూరన్ కుమార్ భార్య అమ్నీత్ పి కుమార్ ఓ సీనియర్ ఐఎఎస్ అధికారిని కావడం, కీలక నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, తగు చర్యలు తీసుకోవాలని సాహసంతో పట్టుబట్టడంతో కొంతవరకైనా ప్రభుత్వం కదిలి రావాల్సి వచ్చింది. ఇదే సమయంలో పశ్చిమ బెంగాల్‌లో ఓ మెడికల్ కాలేజీలో ఓ వైద్య విద్యార్థిని సామూహిక అత్యాచారానికి గురైతే 24 గంటల లోగా, ఆ రాష్ట్ర ఉన్నత పోలీసు అధికారులకన్నా ముందుగా జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చన మజుందార్ అక్కడకు చేరుకొని, దర్యాప్తుపై ఆరాతీసారు. కానీ, పూరన్ కుమార్ విషయంలో జాతీయ ఎస్‌టి కమిషన్ వారం రోజులలోగా ఓ నివేదిక పంపమని కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపిలకు లేఖలు రాసి ఊరుకుంది. హక్కుల సంఘాలు అధికార పక్షాల ప్రచార విభాగాలుగా ఏ విధంగా దిగజారుతున్నాయో ఇటువంటి ఘటనలు వెల్లడి చేస్తున్నాయి. సూసైడ్ నోట్ చూస్తే గత ఐదేళ్లుగా కేవలం కులం కారణంగా ఏ విధంగా వేధింపులు ఎదుర్కొంటున్నారో, మానసిక వ్యథకు గురిచేసారో వెల్లడవుతుంది. అయినా కూడా రాష్ట్ర ప్రభుత్వం గాని, వ్యవస్థలు గాని జోక్యం చేసుకొనే ప్రయత్నం చేయలేదంటే దేశంలో ఎటువంటి దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి అర్థం అవుతుంది. 'ఐపిఎస్ అధికారి ఆత్మహత్య చేసుకోవడం చాలా తీవ్రమైన అంశం. దాదాపు 14-15 మంది పోలీసు ఉన్నతాధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు కావడం చూస్తేనే కేసు తీవ్రత అర్థమవుతోంది' అంటూ పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా ఆందోళన వ్యక్తం చేశారు. అయినా, ఎఫ్ఐఆర్ ను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు అత్యున్నత స్థాయిలో జరగడం దిగ్భ్రాంతి కలిగిస్తుంది. దళితులు, గిరిజనులకు రాజ్యాంగపరమైన ఉన్నత స్థానాలను కల్పిస్తున్నా, రాజ్యాంగం కల్పిస్తున్న అవకాశాల కారణంగా వారు ప్రభుత్వంలో ఉన్నత పదవులకు చేరుకుంటున్నప్పటికీ వివక్షకు గురవుతూనే ఉన్నారని అనేక ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. డా. బిఆర్ అంబేద్కర్ వంటి వారు అటువంటి వివక్ష, వేధింపులకు తిరగబడి పోరాటం చేసినా, అనేకమంది బలవుతూ వస్తున్నారు. దేశంలో తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య నుండి, బిజెపి జాతీయ అధ్యక్షులు బంగారు లక్ష్మణ్ వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అటువంటి వేధింపులకు గురయ్యారు. ఉన్నత పదవులు / స్థానాలు లభించినా స్వతంత్రంగా వ్యవహరింపలేని పరిస్థితులు దేశంలో నెలకొన్నాయి. చివరకు వారిని కలిసేందుకు ఎవ్వరైనా వస్తే కీలకమైన ప్రభుత్వంలోని పెద్దల అనుమతి తప్పనిసరి అవుతుంది. రాజకీయంగా నాడు అత్యంత శక్తివంతమైన నేతగా పేరొందిన ఇందిరా గాంధీ స్వయంగా ఎంపిక చేసి దామోదరం సంజీవయ్యను ముఖ్యమంత్రిగా చేస్తే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రాజకీయంగా ఆధిపత్యం వహిస్తున్న పెత్తందారీ వర్గం ఆయనకు అడుగడుగునా అడ్డుతగిలింది. ఆయనపై అనేక అవినీతి ఆరోపణలు ఢిల్లీకి చేరవేసి అప్రతిష్ఠకు గురిచేసే విఫల ప్రయత్నం చేసింది. నాడు ఆయనను ఆ పదవి నుండి దించేవరకు విశ్రమించనని శపథం చేసి కాసు బ్రహ్మానందరెడ్డి విజయం పొందారు. ఆ తర్వాత ఇందిరాగాంధీ పట్టుబట్టి జనరల్ సీటు అయిన కర్నూల్ నుండి లోక్‌సభ అభ్యర్థిగా నిలబెడితే కోట్ల విజయభాస్కరరెడ్డి ప్రతిష్ఠగా తీసుకొని ఓడించారు. కాంగ్రెస్ అధ్యక్షునిగా చేసినా నిలదొక్కుకోనీయలేదు. అయితే పాలన సామర్థ్యంలో తెలుగు రాష్ట్రాలను పాలించిన ఏ ముఖ్యమంత్రికీ సంజీవయ్య తీసిపోరని అందరికీ తెలిసిందే. అదే విధంగా బంగారు లక్ష్మణ్‌ను బిజెపి అధ్యక్షునిగా నాటి ప్రధాని వాజపేయి ఎంపిక చేస్తే మిగిలిన వారు తట్టుకోలేకపోయారు. ఓ కుట్రపూరితంగా ఆయనపై అవినీతి మరక చల్లి పదవి నుండి తొలగించారు. ఈ మొత్తం వ్యవహారంపై తెహల్కాకు ఓ ప్రముఖ బిజెపి నేత ఆర్థిక సహాయం చేయడం గమనార్హం. రికార్డు చేసిన టేపులో రక్షణ శాఖలో తనకు ఎవ్వరో తెలియదని, ఎటువంటి పనులు చేయలేనని లక్ష్మణ్ స్పష్టంగా చెప్పినట్లు వినిపిస్తుంది. ఇందులో కేసు ఏముందని ప్రశ్నించిన న్యాయమూర్తే ఆయనకు నాలుగేళ్లు శిక్ష విధించారు. అయితే, నాటి రక్షణ మంత్రి అధికార నివాసంలోనే రక్షణ ఒప్పందాల గురించి బేరాలు ఆడినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న జయ జైట్లీ వంటి వారిని కనీసం అరెస్ట్ కూడా చేయకపోవడం గమనార్హం. జైలులో తగిన వైద్య సదుపాయం లేకపోవడంతో అనారోగ్యానికి గురైతే కనీసం ఆయనను గాని, ఆయన కుటుంబ సభ్యులను గాని పరామర్శించే ప్రయత్నం నాటి ప్రముఖ బిజెపి నాయకులు ఎవ్వరూ చేయలేదు. కేవలం నాటి పార్టీ అధ్యక్షుడు నితిన్ గడ్కరీ మారు పేరుతో జైలుకు వెళ్లి పరామర్శించారు. కానీ అనారోగ్యంతో ఆయన మృతి చెందగానే హైదరాబాద్‌కు వచ్చిన అగ్రనేతలు ఆయనను ఓ మహోన్నత దళిత నేత అంటూ పొగడ్తలు కురిపించారు. బిజెపి అధ్యక్షునిగా నితిన్ గడ్కరీ రెండోసారి కొనసాగితే తమ ఆటలు సాగవని భయంతో కొందరు ప్రముఖులు నాటి యుపిఎ ప్రభుత్వంతో చేతులు కలిపి, ఆదాయ పన్ను నోటీసులు ఆయన కంపెనీలకు ఇప్పిస్తే, వెంటనే ఓ ప్రముఖుడితో విచారణ జరిపించి ఆయనకు 'క్లీన్ చిట్' ఇప్పించారు. కానీ అటువంటి అండదండలు బంగారు లక్ష్మణ్‌కు ఎందుకు లభించలేదు? గిరిజనుల అభ్యున్నతి కోసం జీవితం మొత్తం ఎన్నో పోరాటాలు చేసి, ప్రత్యేక రాష్ట్రం సాధించిన శిబూ సోరేన్‌ను పివి నరసింహారావు ప్రభుత్వం కాపాడేందుకు రూ. 50 లక్షలు ఇస్తే, ఆ డబ్బు దాచుకోవాలని తెలియక అమాయకంగా బ్యాంకులో వేసుకొని జైలు శిక్ష అనుభవించారు. కానీ ఆరుగురు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తులు అవినీతికి పాల్పడ్డారని నిర్దిష్టమైన సాక్ష్యాలతో మాజీ కేంద్ర న్యాయశాఖ మంత్రి శాంతిభూషణ్ పిటిషన్ దాఖలు చేస్తే, ఆయన చనిపోయి చాలాకాలమైనా ఇప్పటి వరకూ దానిపై విచారించే ప్రయత్నం చేయడం లేదు. దళితులు, గిరిజనులు అనగానే వారంతా రిజర్వేషన్ల ద్వారా వచ్చారని, ప్రతిభ లేనివారని, అవినీతిపరులని హేళనగా మాట్లాడటం అలవాటుగా మారింది. అయితే, దేశంలో దాదాపు అన్ని రాజకీయ పార్టీలు అగ్రవర్ణాల నాయకత్వంలో, ఆధిపత్యంలోనే కొనసాగుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగంలలో సైతం వారే కీలక పదవులలో ఉంటున్నారు. అయితే ప్రపంచంలోని దారుణమైన అవినీతి ప్రభుత్వాలలో ఒకటిగా భారత్ ఎందుకు అపఖ్యాతి మూటగట్టుకుంటున్నది? అందుకు ఎవ్వరు బాధ్యులు? ఉన్నత విద్యాసంస్థల్లో సైతం ఇటువంటి వివక్ష దశాబ్దాలుగా కొనసాగుతున్నది. చివరకు మెస్‌లలో వారి పక్కన కూర్చొని భోజనం చేసేందుకు సైతం వెనకాడే ధోరణులను మనం చూడవచ్చు. అసలు కేంద్ర విద్యా సంస్థలలో, ప్రభుత్వ విభాగాలలో వారికోసం ఉద్దేశించిన సీట్లు, ఉద్యోగాలను ఉద్దేశపూర్వకంగా భర్తీ చేయకుండా వారి అవకాశాలను కుట్రపూరితంగా వమ్ముచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. సిద్ధాంతాల గురించి ఘనంగా మాట్లాడే ఓ నాయకుడు వాజపేయి ప్రభుత్వ హయాంలో రాజస్థాన్‌కు చెందిన ఒక ఎస్‌సి నేతను రాజ్యసభకు పంపితే, ఆయనకు ప్రభుత్వం కేటాయించిన క్వార్టర్‌ను ఆక్రమించుకొని, చివరకు పనివారుండే గదిలో ఉండేందుకు కూడా ఆ ఎంపికి అనుమతి ఇవ్వలేదు. ఈ విషయాన్ని అప్పట్లో రవివార్ అనే ఆంగ్ల వారపత్రిక కవర్ పేజీ కథనంతో ప్రముఖంగా ప్రచురిస్తే బిజెపి సర్దుబాటు ప్రయత్నం చేసింది. ఆ విధంగా వేధించిన నేత ఆ తర్వాత రాజ్యసభకు కూడా వెళ్లారు. అసలు కులం, మతాలను గుర్తింపమని చెప్పుకొనే వామపక్షాలతో ఇప్పటివరకు ఈ వర్గాలకు చెందిన వారికి నాయకత్వ స్థాయికి అవకాశం ఇచ్చారా? చివరకు పిడబ్ల్యుజిలో సైతం కెజి సత్యమూర్తి వంటి వారు ఈ విషయమై చర్చలు లేవనెత్తారు. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు పలు ఆరోపణలు వస్తున్నాయి. పలు సందర్భాలలో వాస్తవం కావచ్చు. అనేక మంది దొంగ కుల సర్టిఫికెట్‌లతో ఈ రిజర్వేషన్ల ప్రయోజనాలు పొందుతూ, అత్యున్నత స్థానాలకు వెళ్లగలుగుతున్నారు కూడా. రిజర్వేషన్ ప్రయోజనాలు కేవలం అత్యంత అల్పమైన శాతం ప్రజలే పొందుతున్నారు. ఆ పేరుతో వారిపట్ల ద్వేషభావం పెంచుకోవడం నేరం కాగలదు. అసలు ఈ రిజర్వేషన్లు ఏ విధంగా అమలవుతున్నాయో ఇప్పటి వరకు సమీక్ష చేసి ప్రయత్నం, సాహసం ఎవ్వరూ చేయడం లేదు. ఓటు బ్యాంక్ రాజకీయాలు అడ్డువస్తున్నాయి. మరోవంక, ఈ వర్గాలకు చెందినవారు గ్రామాల నుండి అత్యున్నత స్థాయిల వరకు నిత్యం వేధింపులు, వివక్షలకు గురవుతున్నారు. బలమైన చట్టాలు ఉన్నప్పటికీ, వెంటనే ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయడం లేదని ఓ సీనియర్ ఐపిఎస్ అధికారి విషయంలోనే వెల్లడైతే ఇక సాధారణుల పరిస్థితి మరెంత దారుణంగా ఉంటుందో వేరే చెప్పనవసరం లేదు. ఈ వర్గాల ప్రజలు హింసకు, వివక్షకు గురైన సందర్భాలలో వెంటనే వాస్తవాలను వెలుగులోకి తెచ్చే ప్రయత్నం ప్రభుత్వాలు చేయడం లేదు. ప్రతిపక్షాలు సైతం ఓ రాజకీయ అవకాశంగా భావిస్తున్నాయి. కనీసం మీడియా వారిని స్వేచ్ఛగా అటువంటి ప్రదేశాలకు వెళ్లే అవకాశం పలు సందర్భాలలో ఉండటం లేదు. అటువంటి ప్రయత్నాలు చేసి పలువురు అరెస్టుకు గురైన సందర్భాలు సైతం ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లకు సైతం ఇటువంటి దారుణమైన పరిస్థితులు దేశంలో కొనసాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, వ్యవస్థలు అందుకు బాధ్యత వహించాల్సిన సంస్థలు కారణమని చెప్పాల్సిందే.

# పోషకాహార లోపం...వ్యాధులకు మూలం




ఈరోజుల్లో అన్నం విలువ కొంత మందికే తెలుస్తుంది. ఎందుకంటే అన్నం తినేవాడి కన్నా దానిని పండించే వారికే దాని యొక్క విలువ తెలుస్తుంది. ఆహారం పారేయడానికి ఒక్క నిమిషం చాలు, కాని ఆ ఆహారాన్ని పండించ డానికి కనీసం మూడు నెలలు పడుతుంది. ఆ విషయం తెలియక చాలా మంది దానిని వృధా చేస్తారు. దీనికి సంబందించే అంటే ఆహార భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈరోజున ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ ఆహార దినోత్సవం జరుపు కుంటారు. 1945 అక్టోబర్ 16న ఐరాస ఆహార మరియు వ్యవసాయక సంస్థ స్థాపించ బడింది. అయితే ఈ కార్యక్రమాన్ని మొదటిసారి 1981లో జరుపు కున్నారు. ఈ ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకొని మనం చెయ్యాల్సిందల్లా ఒక్కటే ఆహారాన్ని వృధా చేయరాదు. ప్రజల్లో ఈ విషయంలో చైతన్యం నింపాలనే ఉద్దేశంతో ఐక్యరాజ్య సమితి 1945 అక్టోబర్ 16న 'ఆహార, వ్యవసాయ సంస్థ' ను ప్రారంభించారు. ఈ సంస్థను ఆంగ్లంలో %ఖీూూ% అంటారు. అంటే ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్. ఈ సంస్థ గౌరవార్థం ఈ సంస్థ ఏర్పడిన అక్టోబరు 16 తేదిని ప్రపంచ ఆహార దినోత్సవంగా నిర్ణయించారు. అప్పటి నుంచి ఇదే రోజున ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రతి ఏటా 150 కంటే ఎక్కువ దేశాలలో ఆహార దినం పాటిస్తున్నారు. ఒకరు రోజంతా కష్టపడి కూలి పనులు చేసి డబ్బు సంపాదిస్తారు. ఇంకొకరు రోజంతా ఏసీ గదుల్లో కంప్యూటర్ల ముందు కూర్చొని కుస్తీ పడతారు. ఎవరు ఎలా కష్టపడినా... కడుపు నింపు కోవడానికే. కోటి విద్యలు కూటి కోరకే... అని మన పెద్దలు ఎప్పుడో చెప్పారు. ముందు కడుపు నిండాకే మనిషి మరో దాని గురించి ఆలోచిస్తున్నాడు. ప్రస్తుతం కనీస అవసరాల కిందకి చాలా వచ్చాయి. ఎన్ని ఆ జాబితాలో చేరినా మొదటి స్థానంలో ఆహారమే ఉంటుంది. ఎందుకుంటే... ఆహారం లేకుండా సృష్టిలో ఏ ప్రాణి జీవించలేదు కాబట్టి. కానీ ప్రస్తుత రోజుల్లో మనుషులు లక్షల రూపాయలు సంపాదిస్తున్నా కూడా కడుపు నిండా భోజనం చేయడం లేదు. బరువు పెరుగు తామనో, లావు అయి పోతామనో ఇలా కారణాలు చెబుతున్నారు. కొందరేమో తినడానికి తిండి లేక అవస్తలు పడుతున్నారు. ఈ రెండు కారణాల వల్ల పోషకాహార లోపాన్ని ఎదురు కుంటున్న వారు చాలా మంది ఉన్నారు. ఈ రోజు ప్రపంచ ఆహార దినోత్సవం. ఈ సందర్భంగా ఎలాంటి ఆహారం తినాలనే విషయాలపై అవగాహన అవసరం. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఈ ఆహార దినోత్సవం సందర్భంగా ఎలాంటి జబ్బుల బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలతో పాటు గింజలు, విత్తనాలు, పల్లీలు, శనగలు, ఉలవలు, బొబ్బర్లు, జీడిపప్పు, బాదం పప్పు, వాల్ నట్స్ వంటిని ప్రతి రోజూ తీసుకోవాలి. భారతీయులు రోజూ కనీసం 400గ్రాముల కూరగాయలు, పండ్లు తీసుకోవాలని భారత పోషకాహార సంస్థ చెబుతోంది. రాగులు, జొన్నలు, వరి, గోధుమ వంటి ధాన్యాన్ని కూడా ఎక్కువగా తీసుకోవాలి. మరీ ప్రత్యేకంగా కొవ్వులు, చెక్కర, ఉప్పు వాడకాన్ని చాలా తక్కువగా వాడటం ఉత్తమం. 50శాతం కేలరీలు అందిస్తున్న పంటలు 8 రకాలు ఉన్నాయి. బార్లీ, బీన్స్, వేరుశెనగ, మొక్కజొన్న, వరి, జొన్న, గోధుమలు వీలైనంత ఎక్కువగా ఆహారంలో భాగం చేసుకోవాలి. బయట లభించే ఆహారాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఫాస్ట్ ఫుడ్ అసలు తినకపోవడం చాలా మంచిది. చిన్నారులకు కనీసం 9నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలి. పుట్టగానే డబ్బా పాలను అలవాటు చేస్తే.. అప్పటి నుంచే వారిలో పోషకాహార లోపం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. పోషకాహారం తీసుకోవడంతో పాటు తగినంత వ్యాయామం చేయడం కూడా చాలా అవసరం. మన భూమి మీద మనిషి తినగలిగే మొక్కల జాతుల సంఖ్య దాదాపు 30వేలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 852 మిలియన్ల మంది దీర్ఘకాలంగా అతి పేదరికం కారణంగా ఆకలితో అలమటిస్తున్నారు. ఈ సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. అందుకు కారణాలు అనేకం. విపరీతమైన జనాభా పెరుగుదల, వాతావరణ మార్పు, ఆహార ధాన్యాలను జీవ ఇంధనాల కోసం ఉపయోగించడం, మౌలిక ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గించి లాభదాయకమైన వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపడం... ఇలా ఎన్నో కారణాలు. వీటి పర్యవసానంగా ఆహార ధాన్యాల ధరలు అందుబాటు లోకి లేనంతగా పెరగడం మరో సమస్య. ప్రపంచ జనాభాలో దాదాపు సగం పట్టణాలు, నగరాలలో జీవిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో 70 శాతం కంటే ఎక్కువ మంది పల్లెల్లో నివసిస్తున్నారు. అయినా అనేక కారణాలవల్ల వ్యవసాయం కుంటుపడింది. ఆఫ్రికాలో కొన్ని దేశాలలో కరువు నిత్యం తాండవిస్తూనే ఉంది. ఆసియాలో దాదాపు 60 శాతం జనాభా పోషకాహార లోపంతో బాధ పడుతున్నారు. అదే ఆఫ్రికాలో ఆ శాతం 75 దాటింది. దాదాపు 22 దేశాలలో (వాటిలో 16 ఆఫ్రికాలోవే) పోషకాహార లోపం 35 శాతం దాటిందని తేలింది. భారతావనిలో విస్తారమైన కోట్లాది ఎకరాల భూములుండి, లక్షలాది ఎకరాల పంట భూములలో పప్పు ధాన్యాలు, తదితర ఆహార ధాన్యాలతో విలసిల్లింది. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచిన మనదేశం స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా, పాలకుల పేదరిక నిర్మూలనా పథకాలు, లక్షల, కోట్ల పంచ వర్ష ప్రణాళికలు ఈ ఏడు దశాబ్దాల్లో పేదరికం ఆకలి తీర్చలేదు. పేదలు దరిద్రులుగా, ధనికులు బిలియనీర్లు, ట్రిలియనీర్లు కావటానికి ఉపయోగపడ్డాయి తప్ప, సగటు మనిషి ఆకలి తీర్చటంలో విఫలమయ్యాయి. దేశ స్థూల జాతీయాదాయం చూపి చంకలు గుద్దుకుంటున్న పాలకులు జాతీయాదాయంతో పాటు, జాతులకు ఆహార భద్రత కల్పించటంలో విఫలమయ్యారు. దీనికి ఉదాహరణ పనికి ఆహార పథకంలో అవినీతి, పేదలకిచ్చే సబ్సిడి ఆహార భద్రత కార్డుల్లో అవినీతి, ఆహార అవసరాలు తీర్చుట గురించి అవకాశం కల్పించినా రైస్‌మిల్లర్ల మాయాజాలం వెరసి అవినీతి ఎందెందు వెతికినా అందందు కలదన్నట్టు అవినీతి బీజాలు మహా వృక్షాలై పాలకుల ప్రజాస్వామ్య వ్యవస్థను వెక్కిరిస్తున్నాయి. వ్యవసాయ రంగానికి ఒక సమ్రగ విధానమంటూ లేకపోవటంతో వ్యవసాయాన్ని సమాధిచేసి, ఉన్న వ్యవసాయంలో వాణిజ్య పంటలను ప్రోత్సహించింది. ప్రపంచ వేదికల్లో గొప్పలకు పోయే మన పాలకుల ఏలికలు వాస్తవ పునాదులపై నిలబడి, మాటల్లో కాకుండా ఆచరణతో కూడిన ఆహార భద్రత పరిష్కారానికి పూనుకోవాలి. అదే జాతీయ ప్రయోజనాలకు,జాతి ప్రయోజనాలకు శ్రేయస్కారం.

## తెలుగు సాహిత్యంపై తెన్నేటి చెరగని సంతకం

తెలుగులో ప్రముఖ కవులు, రచయితలలో ఒకరు తెన్నేటి సూరి. అభ్యుదయ కవి. నవలాకారుడు, అనువాదకుడు. తన భావజాలాన్ని ఆవిష్కరించడానికి ఆయన... కథ, వ్యాసం, కవిత, గేయం, నాటకం, నవల, అన్ని సాహిత్య ప్రక్రియలను ప్రజల గుండె తలుపులను తట్టే సాధనాలుగా వాడుకున్నాడాయన. అలనాటి మేటి పత్రికలు భారతి, ఆంధ్ర పత్రికల సహాయ సంపాదకునిగా బాధ్యతలు నిర్వహిస్తూనే తన సాహితీ క్షేత్రం సుసంపన్నం చేయ గలిగిగారు.తెన్నేటి సూరి పేరుతో మొట్టమొదట స్ఫురించేది ఆయన చారిత్రక నవల...ఛంఘిజ్‌ఖాన్. 12, 13 శతాబ్దాలలో మంగోల్‌లో జన్మస్థలంగా, ఎడారిలో ఒక మహా సామ్రాజ్యాన్నే నిర్మించిన విజేత చంఘిజ్‌ఖాన్. అది కత్తి మీద సాములాంటి రచనలో చరిత్రలో జరిగిన సంఘటనలను వక్రీకరించకుండా, హెన్రీ హొవర్త్ దంపతులు రచించిన మంగోల్ చరిత్రను ఆధారంగా చేసుకొని, లోతుగా అధ్యయనం చేసి, చేయి తిరిగిన నవలాకారునిగా అద్భుత రచనతనదైన శైలిలో రచించారు. ఆ ప్రచురణ విశేష ప్రజాదరణ పొందింది. తెన్నేటి సూరి చెంఘిజ్ ఖాన్ తొలిగా ఆంధ్రపత్రిక, 1950 సెప్టెంబరు నుంచి ధారావాహికంగా ప్రచురింప బడింది. సెప్టెంబరు 1998) రేడియో నాటకంగా శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ అనుసరించి ప్రసారం చేశారు. ఆంధ్ర పత్రికలో ఆయన వ్రాసిన ధారావాహికను నవలా రూపంలో విశాలాంధ్ర వారు ప్రచురించగా, 1956 లో ప్రచురించబడిన ఒక నవల ఎనిమిది పునర్ముద్రణలు జరుపుకోవడం రచయిత గొప్పతనమే.తెన్నేటి సూరి (1911 - 1958 అక్టోబరు 16) తెలుగు రచయిత. అభ్యుదయ కవి, కథారచయిత, నాటకకర్త. ఛంఘిజ్ ఖాన్ నవలా రచయితగా సుప్రసిద్ధుడు. భారతి, ఆంధ్ర పత్రికలలో 1945-1957లలో పత్రికా రచయితగా పనిచేశాడు. సూరి 1911లో కృష్ణా జిల్లా తెన్నేరులో వెంకట లక్ష్మమ్మ, తండ్రి తిరుమలరావు దంపతులకు జన్మించాడు. పుట్టిన ఊళ్లోనే ప్రాథమిక విద్య పూర్తిచేసి, పై చదువులకి బందరు వెళ్లాడు. అక్కడే సాహిత్య రచనా వ్యాసంగానికి అంకురార్పణ జరిగింది. కొందరు పత్రికాధిపతులతో పరిచయం ఏర్పడింది.

వారి మద్దతుతో ఓ ప్రెస్ లో ఉగ్యోగం లభించింది. 1940 దశకంలో స్వాంతంత్ర ఉద్యమం వువ్వెత్తున ఎగసిపడుతున్న సమయంలో , తెలంగాణలో నిజాం నిరంకుశ పాలనలో, భుస్వామ్య వ్యవస్థలో, అణచివేతల నేపథ్యంలో చెలరేగిన రైతాంగ పోరాటం చోటు చేసుకున్న తరుణంలో , తన సొంత ఇంట్లో అందరూ కాంగ్రెస్ వాదులుగానే ఉన్నా, నిరంకుశత్వం ఎక్కడ ఉన్నా దానికి వ్యతిరేకంగా తన కలాన్ని ఝుళిపించడం తక్షణ కర్తవ్యమని భావించారయన. ఇతర పత్రికల రచనలకు భిన్నంగా, తమ కుటుంబ సభ్యుల అభీష్టానికి వ్యతిరేకంగా రచన ప్రారంభించాడు. తాను పనిచేసే ప్రెస్సే ఒక సాహిత్య వేదికగా, ఒక చర్చా వేదికగా మలుచు కున్నారు.

# పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలి

## : మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్ ,అక్టోబర్ 15 (వృదయం ప్రతినిధి): జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడికి పూర్తి అధికారం ఇవ్వాలని కొత్త విధానాన్ని కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం తిరుమల గార్డెన్‌లో జరిగింది. ఈ సమావేశంలో ఏఐసీసీ పరిశీలకురాలు జ్యోతి రాథోడ్, చొప్పదండి ఎమ్మెల్యే సత్యం పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, “కాంగ్రెస్ పదవులు బలోపేతంగా ఉండాలంటే ప్రతి కార్యకర్త పార్టీ కోసం శ్రమించాలి. పదవిలో ఉండటం గొప్ప విషయం కాదుబీ ఆ పదవిలో ఉన్న నాయకుడు తన బూత్‌లో గెలవగలిగితేనే తన బలం నిరూపితమవుతుంది” అని అన్నారు.రాబోయే మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ శక్తి, సత్తా ఏంటో నిరూపించాల్సిన సమయం వచ్చిందని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ పునరుత్థానం ఖాయమని మంత్రి ధీమా వ్యక్తం చేశారు

# గురుకుల విద్యార్థి వివేక్ మృతి దురదృష్టకరం

## : మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్ ,అక్టోబర్ 15 (వృదయం ప్రతినిధి): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం జిల్లెల్లగడ్డ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థి వివేక్ ప్రమాదవశాత్తు మృతి చెందడం దురదృష్టకరమని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.గత వారం తోటి విద్యార్థులతో ఆడుకుంటూ వివేక్ దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై మంత్రి మంగళవారం గురుకుల పాఠశాలను సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఆయనతోపాటు సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ఉన్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులను అడిగి ఘటన వివరాలు ఆరా తీశారు. ప్రాథమిక విచారణలో ప్రమాదవశాత్తు మృతి జరిగినట్టు తేలిందని, అయితే మరేదైనా కోణం ఉందా అన్నదానిపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారని మంత్రి తెలిపారు.విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వపరంగా అందే సహాయం తప్పకుండా అందజేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థి మరణంపై ఎవరూ రాజకీయాలు చేయకూడదని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా గురుకులాల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులను పర్యవేక్షించాలని మంత్రి సూచించారు

# కొత్తగా ఎంపికైన డిఎస్పీలకు అభినందనలు...

## జిల్లా సూపరెండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్



జగిత్యాల అక్టోబర్ 15 (వృదయం ప్రతినిధి) జగిత్యాల జిల్లాకు చెందిన అభ్యర్థులు ఇటీవల వెలువడిన గ్రూప్ వన్ ఫలితాల్లో డిఎస్పి హోదాకు ఎంపికైన విష్ణువర్ధన్ రెడ్డి ప్రతిభ లు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా సూపరెండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఎస్పీ వారిని శాలువాతో సన్మానించి అభినందించారు అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సేవ ఒక మహత్తరమైన బాధ్యత అని ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడమే నిజమైన విజయమని పేర్కొన్నారు విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా ఉంటూ క్రమశిక్షణతో సేవాభావంతో ప్రజలకు సేవ చేస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు విధుల్లో అప్రమత్తంగా రాణించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు ఈ కార్యక్రమంలో డిఎస్పి రఘు చందర్ ఎస్పీ ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్ నూతనంగా ఎంపికైన డిఎస్పీల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# మత్స్యకారుని వలకు చిక్కిన అరుదైన చేప

మక్తల్, అక్టోబర్ 15 (వృదయం ప్రతినిధి): సంగంబండ్ గ్రావిటీ కెనాల్‌లో మత్స్యకారుడు మామిళ్ల బాలస్వామి వలకు అరుదైన రెడ్ బెల్లిడ్ ప్యాకు పిరానా చేప చిక్కింది. దక్షిణ అమెరికా అమెజాన్ జలాల్లో కనిపించే ఈ చేప దంతాలతో మొక్కలు, పండ్లు, చనిపోయిన జంతువుల అవశేషాలను ఆహారంగా తీసుకుంటుంది. ఇతర చేపలకు ముప్పుగా ఉండటంతో వీటిని జలాశయాల్లో పెంచడాన్ని నిషేధించారు. సుమారు కిలో బరువున్న ఈ అరుదైన చేప మార్కెట్లో అధిక విలువ కలిగినదిగా మత్స్యకారులు తెలిపారు.

# నాణ్యమైన ధాన్యాన్ని 24 గంటలలో రైస్ మిల్లులకు తరలించాలి

## : జిల్లా కలెక్టర్



పెద్దపల్లి ,అక్టోబర్ 15 (వృదయం ప్రతినిధి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముందుగానే ప్రారంభించేలా ప్రణాళిక ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని 24 గంటలలో మద్దతు ధరకు కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సమావేశ మందిరంలో వానాకాలం పంట కొనుగోలు పై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష , అదనపు కలెక్టర్ డి. వేణు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముందుగానే ఓపెన్ చేయాలని, ఒకేసారి ధాన్యం భారీగా రాకుండా క్రమ పద్ధతిలో వచ్చేలా చూడాలని అన్నారు. మన కేంద్రాలకు వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే మద్దతు ధరకు కొనుగోలు చేసి 24 గంటల లోగా రైస్ మిల్లులకు తరలించి ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని అన్నారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి వేగవంతంగా జరిగేలా పటిష్ట వ్యవస్థను పౌరసరఫరాల సంస్థ సిద్ధం చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రం, రైస్ మిల్లుల వద్ద హమాలీల కొరత రాకుండా చూడాలని అన్నారు. ప్రతి మండలంలో హార్వెస్టర్లతో వ్యవసాయ విస్తరణ అధికారులు సమావేశం నిర్వహించి వరి కోతల సమయంలో పాటించాల్సిన నిబంధనల గురించి అవగాహన కల్పించాలని అన్నారు. నవంబర్ చివరి వరకు పెద్దపల్లి జిల్లాలో 2 లక్షల పైగా మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసేలా కార్యాచరణ ఉండాలని అన్నారు.నవంబర్ నెలలో ప్రతిరోజు మన పెద్దపల్లి జిల్లాలో 10 నుంచి 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అకాల వర్షాలు కురిసే సమయంలో టార్పాలిన్ కవర్లతో ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను నియమించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీధర్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల ధ్వంసం

## రాగితీగ, ఆయిల్ అపహరణ



బెల్లంపల్లి, అక్టోబర్15 (వృదయం ప్రతినిధి) :మంచిర్యాల జిల్లా తాండూరు మండలంలోని కాసిపేట గ్రామ శివారులోని గోపాల్ నగర్ వెళ్లే రోడ్డులో పంట చెళ్ళల్లో ఉన్న రెండు వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను గుర్తు తెలియని దుండగులు మంగళవారం రాత్రి ధ్వంసం చేసి అందులోని రాగితీగ, ఆయిల్ అపహరించుకోపోయారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. కాసి పేట శివారులోని రెండు 25 కేవీ ట్రాన్స్ ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. బుధవారం ఉదయం గమనించి ఎస్ఐ కిరణ్కుమార్, విద్యుత్ శాఖ ఏఈ జాన్, లైన్ ఇన్స్పెక్టర్ చంద్రయ్య లకు ఫోనులో సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, పంచనామా నిర్వహించారు. రైతులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నాట్లు ఎస్ ఐ కిరణ్కుమార్, ఏ ఈ జాన్ తెలిపారు.

విద్యుత్ సరఫరాలో కీలకమైన నియంత్రికలను తాండూరు మండలంలో కొన్నాళ్లుగా గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేస్తున్నారు. రూ. లక్షల విలువైన నియంత్రికలు చెడిపోవడంతో సంస్థపై పెనుభారం పడుతోంది. దీంతో మరో పక్క రైతులకు కరెంటు సరఫరాలో అంతరాయం చోటు చేసుకుంటోంది. ఇలాంటి ఘటనలు నెలల వ్యవధిలో చోటు చేసుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

25 కేవీ విద్యుత్తు నియంత్రిక విలువ సుమారు రూ.1.03 లక్షలు ఉంది. అందులో ఐదు కిలోలకు పైగా రాగి తీగతో పాటు 25 లీటర్లకు పైగా ఆయిల్ నింపి ఉంటుంది. సదరు దొంగలు మాత్రం రాగి తీగ, ఆయిల్ను లక్ష్యంగా చేసుకొని దొంగతననానికి పాల్పడుతున్నారు. రైతులు నియాత్రికల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# తల్లి,సోదరులపై దాడి చేసిన కేసులో నిందితుడికి 3 సంవత్సరాల జైలు శిక్ష

## రూ.1,000/- జరిమానా



ధర్మపురి, అక్టోబర్ 15(వృదయం విలేకరి):కన్నతల్లి,సోదరుల పై దాడి చేసిన కేసులో నిందితుడు ఎర్ర అక్షయ్ కుమార్‌కు 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.1,000/- జరిమానా విధిస్తూ, ధర్మపురి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీమతి ఏగి జానకి బుధవారం తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళ్తే ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని దొంతపూర్ గ్రామానికి చెందిన ఎర్ర కళావతి అనే మహిళ, భర్త మరణించిన తర్వాత తన పెద్ద కుమారుడు అక్షయ్ కుమార్ తరచుగా డబ్బులు అడుగుతూ గొడవలు పెట్టడం,తల్లి,తమ్ముళ్లపై దాడి చేయడం కొనసాగించేవాడని తెలిపింది.అతని వేధింపులు భరించలేక కళావతి తన తల్లి ఇంటికి వెళ్లింది. ఈ సందర్భంలో, అక్టోబర్ 4 న రాత్రి సమయంలో అక్షయ్ కుమార్ తన స్నేహితులతో కలిసి అక్కడికి వెళ్లి,తన తల్లిని, తమ్ముళ్లైన సంజయ్, ఉదయ్ కుమార్‌లను దూషిస్తూ, దాడి చేయడం జరిగింది.

ఈ ఘటనపై బాధితురాలు కళావతి ధర్మపురి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా,కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరిపి నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానానికి హాజరుపరి చారు. విచారణ అనంతరం కోర్టు నిందితుడు ఎర్ర అక్షయ్ కుమార్ (21) కు 3 సంవత్సరాల జైలు శిక్ష మరియు రూ.1,000/- జరిమానా విధిస్తూ తీర్పు ప్రకటించింది.ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటానికి కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేష్ ,ఎస్ఐ ఉదయ్ కుమార్ ను,కోర్టు కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

# ఘనంగా మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి

నిర్మల్, అక్టోబర్ 15 (వృదయం ప్రతినిధి): నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఈదిగాం చౌరస్తాలో బుధవారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమాన్ని అబ్దుల్ కలాం ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు మహమ్మద్ అజరుద్దీన్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం భారతదేశానికి నిస్వార్థ సేవ చేశారని కొనియాడారు..

## భారీ వర్షంతో రైతుల ఆవేదన, పంట నష్టం

బోథ్, అక్టోబర్ 15 (వృదయం ప్రతినిధి): గుడిహత్నూర్ మండల కేంద్రంతో పాటు లింగపూర్, కోల్హరి, మచ్చపూర్ గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మెరుపులు, గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షం కారణంగా పంటలు నీటమునిగి, చేతికి వచ్చిన దిగుబడులు నష్టపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం తీవ్రతకు కొన్ని ప్రాంతాలు జలమయమయ్యాయి. అధికారులు నష్టాన్ని అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు.

# విశాఖ ఉక్కు నగరమే కాదు గూగుల్ నగరం కూడా మంత్రి సుభాష్



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాన్సన్లాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ,అక్టోబర్ 15 (వృదయం ప్రతినిధి): విశాఖ ఇకపై ఉక్కు నగరమే కాదు గూగుల్ నగరం కూడా అని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు విశాఖపట్నం విశ్వనగరంగా ఎదిగేందుకు మరో అడుగు ముందుకు పడిందని రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ల కృషి వల్లే ఇది సాధ్యమైందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్యానికి ఈ కొత్త సాంకేతికత ఉపయోగపడుతుందన్న ఆశా భావాన్ని సుభాష్ వ్యక్తం చేశారు. గూగుల్ సంస్థ విశాఖలో హైపర్ స్కిల్ డేటా సెంటర్ ఏర్పాటుతో విశాఖపట్నం గేమ్ చేంజర్ గా మారబోతోందని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు అంటే ఐటీ.. ఐటీ అనేలా విశాఖనగరం రూపుదిద్దుకోబోతోందని ఆయన తెలియజేశారు. ఏఐ టెక్నాలజీని సైతం విశాఖకు నిలయంగా మలిచే ప్రయత్నం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ బలమైన పునాదులు వేస్తున్నారని మంత్రి సుభాష్ కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల పాలనలో ఏకంగా దాదాపు 11లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని, ఒక్కగూగుల్ సంస్థే లక్ష 33 వేల కోట్ల రూపాయలను పెట్టుబడి పెడుతోందంటే అది బాబు గ్యారెంటీకి దిక్సూచిగా నిలుస్తుందని వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఇప్పటికే అభివృద్ధి పథంలో సాగుతున్న విశాఖ రూపురేఖలు ఈ డేటా సెంటర్ తో పూర్తిగా మారిపోతాయన్న ఆకాంక్షను సుభాష్ వ్యక్తం చేశారు.

అటు ఉత్తరాంధ్ర వారికే కాకుండా కోస్తా జిల్లాలోని ఐటి నిపుణులకు ఈ సెంటర్ ద్వారా ఉపాధి లభిస్తుందన్నారు. భారత డిజిటల్ ఎకానమీని సమూలంగా మార్చేందుకు ఈ కేంద్రం ప్రేరకం అవుతుందని మంత్రి తెలియజేశారు.

# 2 లక్షల 50వేల రూపాయల ఎల్ఓసి అందజేత...

## ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్



జగిత్యాల అక్టోబర్ 15 (వృదయం ప్రతినిధి) జగిత్యాల మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన బెరిగేడి నర్సయ్య నరాల సంబంధిత వ్యాధితో భాదపడుతుండగా నర్సయ్య ఆరోగ్య పరిస్థితి ని జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ దృష్టికి తీసుకురాగా తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే నిమ్స్ లో శస్త్ర చికిత్స నిమిత్తం 2 లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసిని మంజూరు చేయించి అట్టి ఎల్ఓసి ని గురువారం బాధిత కుటుంబ సభ్యులకు జగిత్యాలలో అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ 2 లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ కు నర్సయ్య కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ లు గిరి నాగభూషణం అడువాల జ్యోతి లక్ష్మణ్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# మహమ్మదాబాద్ వాసికి జాతీయ స్థాయి యోగ రిఫరీ అవార్డు




అవార్డు అందుకుంటున్న వినోద్ కుమార్

జన్నారం, అక్టోబర్ 15(వృదయం విలేఖరి) జన్నారం మండలంలోని మహ్మదాబాద్ గ్రామ వాసి దుర్గం వినోద్ కుమార్ జాతీయ స్థాయి యోగా రిఫరీ అవార్డును అందుకున్నారు.అమెచ్యూర్ యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 50వ గోల్డెన్ జూబ్లీ సీనియర్ నేషనల్ యోగ స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ ను కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్ లో శ్రీ గణపతి సచ్చితానంద ఆశ్రమం వేదికగా అక్టోబర్ 9 నుండి 12 వరకు నిర్వహించారు.ఈ యోగ పోటీలలో తెలంగాణ నుండి వినోద్ కుమార్ నేషనల్ యోగ రిఫరీగా సేవలందించినందుకుగాను యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రెటరీ అభినవ్ జోషి, వైస్ ప్రెసిడెంట్ జాల మనోహర్, ఇందు అగర్వాల్ లు శాలువాతో ఘనంగా సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ ను గ్రామస్తులతో పాటు పలువురు అభినందించారు.

# రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది..

## : మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి






వేడ్చల్, అక్టోబర్ 15,(వృదయం ప్రతినిధి),తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగుళ్ళను ప్రతిష్టత్మాకంగా తీసుకుంటుందని అందుకు అవసరమైన చర్యలన్ని సకాలంలో తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.డాక్టర్ బి. ఆర్. అంబెద్కర్ సచివాలయంలో వానాకాలం ధాన్యం కొనుగోళ్ల పై కలెక్టర్లతో వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, వ్యవసాయ శాఖా కార్యదర్శి రఘునందన్ రావు, పౌర సరఫరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం దిగుబడిలో తెలంగాణా ఆల్ టైం రికార్డ్ సాధించిందన్నారు. స్వతంత్ర భారతదేశంలోనే ఈ వానాకాలంలో అత్యధికంగా 148.03 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి ధాన్యం కొనుగోలు లోనూ సరికొత్త రికార్డ్, అధిక దిగుబడి, అధిక కొనుగోళ్ల నేపద్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పర్యవేక్షించాలన్నారు.ధాన్యం కొనుగోలులో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని క్షేత్ర స్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కనీస సౌకార్యాలు కలిపించచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు ఏర్పాటు చేసుకున్న రవాణా వసతి పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతులు ఎక్కడ కుడా నిరీక్షించకుండా చర్యలు తీసుకోవాలని, మౌలిక సదుపాయాల కల్పన అంశంలో అత్యవసరం అనుకుంటే అదనపు ఖర్చులకు వెనకాడ వద్దని మంత్రి సూచించారు. ధాన్యం కొనుగోలు వివరాలను సత్వరమే నమోదు చేయాలని, నమోదు అయిన కొనుగోళ్లకు 48 గంటలలో చెల్లింపులు జరిగేలా చూడాలని, ధాన్యం కొనుగోళ్ల విషయంలో మిల్లర్లతో సమన్వయం చేసుకోవాలని మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లింపులకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేసారు. త్వరితగతిన ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణా ముందుందని, ఇది రైతుపక్ష పాత ప్రభుత్వ మని రైతులకు ఎక్కడ కుడా అసౌకర్యం కలుగ కుండా ఆయా జిల్లాల కలెక్టర్లు,పౌర సరఫరా శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మా ప్రభుత్వం ఏర్పడ్డాక ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేశామని, గడిచిన యాసంగి ధాన్యం కొనుగోళ్లలో అధికారుల సమన్వయంతో సత్ఫలితలు సాధించామన్నారు. అధిక దిగుబడి దృష్ట ఈ వానాకాలం కొనుగోళ్లలోనూ అధికారులు మరింత అప్రమత్తంగా ఉంటూ, ఏవైన సమస్యలు ఎదురైతే సత్వరం తనను, పౌరసరఫరాల కమిషనర్ ను సంప్రదించాలని తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్సులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా సివిల్ సప్లై డిఎం సుగుణబాయి, అధికారి శ్రీనివస్ రెడ్డి,

జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, జిల్లా కో ఆపరేటివ్ అధికారి వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సి పి ఆర్ పై వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగికి అవగాహన ఉండాలి...

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి - డాక్టర్ గోపాలరావు..



ములుగు అక్టోబర్ 15 (హృదయం ప్రతినిధి)ములుగు జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు కార్డియో పల్మనరి రెసుసిటేషన్ ( సిపి ఆర్) ట్రైనింగు ఇవ్వడం జరిగింది అనంతరం ఆయన మాట్లాడుతూ, వైద్య ఆరోగ్యశాఖలో ప్రతి ఒక్క ఉద్యోగి సి పి ఆర్ పై అవగాహన ఉండాలని, మనిషి మానసిక ఒత్తిడికి ,గుండె జబ్బుల ద్వారా మెదడుకు రక్తప్రసరణ ఆగిపోయి, గుండె కొట్టుకోవడం ఆగిపోతుందని అప్పుడు సి . పి .ఆర్ ప్రక్రియ చేయాలని, దీని ద్వారా గుండె కొట్టుకోవడం తోపాటు, ఐదు ప్రధాన అంతర్గత ప్రాణాలను కాపాడుట గాయం తీవ్ర తరం కాకుండా నిరోధించుట, మనిషి కోలుకోవడానికి సహాయ పడుట, అపస్మారక స్థితి నుండి రక్షించుట వంటి విషయాలలో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం సి.పి. ఆర్ పై ప్రతి ఉద్యోగితో ప్రతిజ్ఞను చేయించి, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పై సమీక్షను నిర్వహించి సిబ్బందితో మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు మరియు సూపర్వైజర్లు పర్యవేక్షించాలని, వారంలో ఒకసారి ఆరోగ్య కేంద్రాల వారిగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై నమీక్షించుకోవాలని, కార్యక్రమాలపై పున సమీక్ష చేసిన తర్వాత పటిష్టమైన ప్రణాళికలను కాల పరిమితితో తయారు చేసుకోవాలని వివరించారు. జాతీయ టీబి నియంత్రణ కార్యక్రమము లో నోటిఫికేషన్ 100% చేయాలని, టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వేతర సంస్థలతో న్యూట్రిషన్ కిట్స్ అందజేయాలని ,జాతీయ తల్లి ఆరోగ్యము , పోషకాహార కార్యక్రమంలో ప్రభుత్వ ప్రసూతులను 100% చేయాలని, సరైన కాలంలో పిల్లలందరికీ టీకాలు ఇచ్చి వివరాలను ఈవిన్ పోర్టల్ నమోదు చేయాలని అసంక్రమిక వ్యాధులైన రక్తపోటు మధుమేహము క్యాన్సర్ నాలుగో విడత స్క్రీనింగ్ పరీక్షలు ముమ్మరం చేయాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం ఐటీడీఏ డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ క్రాంతి కుమార్ ,జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ చంద్రకాంత్ డాక్టర్ పవన్ కుమార్ డాక్టర్ శ్రీకాంత్ డాక్టర్ రణధీర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ,డెమో సంపత్ ఏ ఎం ఓ దుర్గారావు డిపి హెచ్ఎన్ శకుంతల మానిటరింగ్ సూపర్వైజర్లు వెంకట్ రెడ్డి సురేష్ బాబు భూపాల్ రెడ్డి, ఆర్బిఎస్ కె ప్రోగ్రాం డాక్టర్లు డాక్టర్లు నేషనల్ హెల్త్ ప్రొవైడర్స్ సూపర్వైజర్లు, టీబి ప్రోగ్రాం సిబ్బంది మరియు ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# విలేఖరి శ్రీనివాసచారి కి పరామర్శ.

- బీసీ సంఘం, బిజెపి, సిపిఐ పార్టీల నాయకులు.



బూర్గంపహాడ్ ,అక్టోబర్ 15 (హృదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల "జనంసాక్షి" విలేకరి శ్రీనివాస చారి కి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆయనను జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు మహంకాళి రామారావు, జిల్లా ఉపాధ్యక్షులు మేడే చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి బెల్లంకి కనకాచారి, బిజెపి జిల్లా కార్యదర్శి కేశగాని శ్రీనివాస గౌడ్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మరియు సారపాక పట్టణ కార్యదర్శి పేరాల శ్రీనివాసరావు, బీసీ సంఘం కార్యదర్శి భీమవరపు కోటేశ్వర రావు లు బుధవారం పరామర్శించారు. వైద్య చికిత్స అనంతరం ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన విలేకరి శ్రీనివాసచారి విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలిసి వారి నివాసానికి వెళ్లి పరామర్శించి, యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో బిసి సంఘం విద్యార్థి సంఘం అధ్యక్షులు జమ్మి సాయిరాం, బీసీ సంఘం నాయకులు ఆకుల రఘు, విలేఖరి రాంప్రసాద్, మైనారిటీ విభాగం షేక్ మీరా లు తదితరులు ఉన్నారు. ఆయన గాయాల నుండి త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

# గవర్నర్ చేతుల మీదుగా కలాం అవార్డు అందుకున్న అబ్దుల్ అజీజ్

-రవీంద్రభారతిలో లీడ్ ఇండియా వారి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రదాన కార్యక్రమం...



రామకృష్ణాపూర్/అక్టోబర్ 15(హృదయం ప్రతినిధి) :లీడ్ ఇండియా వారి ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి భారతదేశ సైన్స్ పితా మహుడు అబ్దుల్ కలాం 94వ జన్మదిన సందర్భంగా ఈ రోజు హైదరాబాద్ లోని రవీంద్రభారతి లో కలాం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కార్యక్రమం నిర్వహించారు. ఈ అవార్డ్ కు రామకృష్ణాపూర్ పట్టణంలో గత 25 సంవత్సరాల నుంచి విద్యా రంగంలో చేసిన నిస్వార్థ సేవలకు గాను తవక్కల్ విద్యా సంస్థల ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ ఎంపికయ్యారుతెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అబ్దుల్ అజీజ్ కు ఈ అవార్డ్ ను అందుకున్నారు. ఈ సందర్భంగా తవక్కల్ విద్యా సంస్థల ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లితండ్రులు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ కు శుభాకాంక్షలు తెలియచేశారు.

# యూట్యూబర్ వెంకటేష్‌కు 14 రోజుల రిమాండ్.



ఆసిఫాబాద్ ,అక్టోబర్ 15 (హృదయం ప్రతినిధి): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండలంలోని మంగి పాతగూడకు చెందిన యూట్యూబర్ వెంకటేష్‌పై ఆసిఫాబాద్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. తిర్యాని ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం మూడు రోజుల క్రితం యూట్యూబర్ వెంకటేష్ ఓ సామాజిక వర్గాన్ని అవమానించే విధంగా సోషల్ మీడియాలో పోస్టు చేయగా, ఆ పోస్టు వైరల్ అయింది. దీనితో ఆ సామాజిక వర్గానికి చెందిన ముఖ్య నాయకులు తిర్యాని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా తిర్యాని పోలీసులు యూట్యూబర్ వెంకటేష్‌ను రెబ్బెన సీఐ సంజయ్, తిర్యాని ఎస్.ఐ వెంకటేష్ అరెస్ట్ చేసి విచారణ జరిపారు. అనంతరం నేడు ఆసిఫాబాద్ కోర్టులో హాజరుపరచగా, కోర్టు అతనికి 14 రోజుల రిమాండ్ కు పంపించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేష్ మాట్లాడుతూ, "సోషల్ మీడియా వేదికలను సమాజానికి మేలు చేకూర్చే విధంగా వాడుకోవాలి. సామాజిక విభేదాలు రేపే, చట్టాన్ని ఉల్లంఘించే విధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. యువత మంచి కార్యక్రమాలు, ప్రజాసేవా కార్యక్రమాలు చేస్తే పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు.

# నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం



లక్షెట్టిపేట, అక్టోబర్ 15 (హృదయం ప్రతినిధి): రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమని ఏ డి ఈ ప్రభాకర్ రావు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ఉత్కూర్లో విద్యుత్ అధికారులు పొలం బాట నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ సిబ్బంది రైతులతో కలిసి వంగిన పోల్స్ సరి చేయడం ట్రాన్స్ఫార్మర్ల వద్ద ఎర్తింగ్, లూస్ లైన్స్ సరిచేశారు. అనంతరం ఏడీఈ మాట్లాడుతూ... రైతులకు విద్యుత్ అంతరాయం కలగకుండా పలు చర్యలను చేపట్టామన్నారు. రైతులు పొలాలలోని మోటార్లకు అమర్చుకోవాలని దాని ద్వారా నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. రైతులకు ఏమైనా సమస్య ఉంటే విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ గణేష్, ఎఫ్ఎం నాగేశ్వరరావు, లైన్ ఇన్స్పెక్టర్లు సత్యనారాయణ, రవికుమార్, లైన్మెన్ రాజమౌళి, విద్యుత్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ టెక్నికల్ అఫీషియల్ గా సంతోష్ యాదవ్



బెల్లంపల్లి, సెప్టెంబర్ 15 (హృదయం ప్రతినిధి) : బెల్లంపల్లి పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో పీ.ఈ.టి గా విధులు నిర్వర్తిస్తున్న సల్లాల సంతోష్ యాదవ్ హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో అక్టోబర్ 16 నుండి 18 వరకు జరగనున్న 5వ ఇండియన్ ఓపెన్ అండర్ 23 నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ కు టెక్నికల్ అఫీషియల్ గా నియమితులైనారు. ఈ విషయాన్ని తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి మంచిర్యాల జిల్లా కార్యదర్శి ఈ. మారయ్య తెలిపారు. ఈ సందర్భంగా నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ కు టెక్నికల్ అఫీషియల్ గా సంతోష్ నియామకం పట్ల కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్ రవి ప్రసాద్ ప్రధానోపాధ్యాయులు రాజా రమేష్ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, బెల్లంపల్లి పట్టణ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

# యాంటి రాగింగ్ పై మెడికల్ కాలేజ్ విద్యార్థులకు అవగాహన

- ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ చట్టం యాక్ట్ 1997 నుండి అమల్లోకి వచ్చింది



సిద్దిపేట ,అక్టోబర్ 15 (హృదయం ప్రతినిధి): సిద్దిపేట జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థులకు బుధవారం ఓరియంటేషన్ ప్రోగ్రాం ద్వారా పోలీస్ కమిషనర్ ఆదేశాలమేరకు ర్యాగింగ్ చట్టాల పై త్రీటౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ విద్యాసాగర్ విద్యార్థులతో మాట్లాడుతూ జూనియర్లను ర్యాగింగ్ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు రాగింగ్ పేరుతో వారు ఉన్నతమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటూ... సమాజంలో వారికున్న గౌరవాలు దిగదార్చుకుంటూ ఉన్నారు. రాగింగ్ అనేది అభ్యంతరమైనదిభవిష్య తరాలకు అందించాల్సింది ఉన్నతమైన క్రమశిక్షణ మాత్రమే అన్నారు. కాలేజ్ అంటే ఆహ్లాదకరమైన వాతావరణంలో స్నేహశీలత్వాన్ని పెంపొందించుకునే భవిష్యత్తును తీర్చిదిద్దేది అన్నారు. విద్యార్థి దశ నుండి మన జీవితం కోసం ఎన్ని ఆశ్రమలు పొంది కష్టాలను ఓర్చి ఉన్నత స్థాయిలో ఎదగాలని మన తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకొని కలలు కన్నారు. వారి ఆశయాలను నిర్వీర్యం చేయకుండా తల్లిదండ్రుల కోరికలు నెరవేర్చేలా మీ లక్ష్య సాధన ఒకటే మార్గదర్శకంగా ముందుకు అడుగులు వేయాలని కొనియాడారు.ర్యాగింగ్ పేరుతో వ్యక్తులను, వ్యక్తిని అవమానపరచుట, భయపెట్ట, భయం కలిగేటట్లు చేయుట వారి పట్ల అమర్యాదగా ప్రవర్తించిన, కొట్టడం తదితర అంశాలు ర్యాగింగ్ చట్టంలోకి వస్తాయని తెలిపారు. తెలిసీ తెలియని వయస్సులో సిగరెట్, గుట్కా, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు లోనై బంగారు జీవితాలు నాశనం చేసుకోవద్దు అన్నారు. చట్టప్రకారం ర్యాగింగ్ రెండు విధాలుగా అమలు చేయవచ్చని మొదట కాలేజీ యాజమాన్యం కాలేజీ నుండి సస్పెండ్ మరియు రిమూవ్ చేసే అధికారం ప్రిన్సిపల్ కి ఉంటుందని తెలిపారు. రెండవది ర్యాగింగ్ చేసిన వ్యక్తుల పై ఒకసారి కేసు నమోదైతే 6 నెలల నుండి 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష ఉంటుంది. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ చేస్తూ దోషులుగా వుండరాదు. ర్యాగింగ్ కు పాల్పడే వారి వివరాలను డయల్ 100 కు తెలియజేసి పోలీసు సహాయం పొందవచ్చు సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ విమల థామస్, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, అల్ డిపార్ట్మెంట్ హెచ్ఓడీస్, ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, మెడికల్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో జాన్సన్ నాయక్.



ఖానాపూర్, అక్టోబర్ 15(హృదయం విలేకరి) జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా రహమత్ నగర్ డివిజన్‌లోని కార్మిక నగర్, బ్రహ్మ శంకర్ నగర్ ప్రాంతంలో బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ ప్రచారం చేశారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ గోపినాథ్ సేవలను స్మరించుకుంటూ వారి చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకుని కారు గుర్తుకు ఓటు వేసి సునీతమ్మను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# బ్యాడ్మింటన్ పోటీలలో సత్తా చాటిన స్లేట్ విద్యార్థులు



జన్నారం, అక్టోబర్ 15(హృదయం విలేకరి) జన్నారం పట్టణంలోని స్లేట్ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో తమ సత్తా చాటి జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ఛైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం రోజున మంచిర్యాల క్లబ్ నందు నిర్వహించిన అండర్ 17, 14 బాల,బాలికల విభాగాలలో మణికంఠ, సహస్ర, గౌతమి, గీతిక,శ్రద్ధ శర్మ లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులను డైరెక్టర్ ఏనుగు రజిత రెడ్డి, ప్రిన్సిపల్ షీరీన్ ఖాన్ పి ఈ టి లు సంతోష్,నగేష్,జోష్న, ఉపాధ్యాయులు అభినందించారు.

# 18న బంద్‌ను విజయవంతం చేయాలి

లక్షెట్టిపేట, అక్టోబర్ 15(హృదయం ప్రతినిధి): 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా 18న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో బీసీ సంఘం నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ...స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ శాతాన్ని పెంచుతూ విడుదలైన జీవోను న్యాయస్థానం నిలిపివేయడం విచారకరమని బీసీ సంఘాల నాయకులు అన్నారు. బీసీల రిజర్వేషన్ పెంపునకు సంబంధించి ఎదురవుతున్న సవాళ్లను సంఘటిత పోరాటంతో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అగ్ర కులాల వారు ఒక్కలేక హైకోర్టులో కేసు వేసి రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో బిసి ప్రజాసంఘాల కన్వీనర్ కళ్యాణం రవి, కుల సంఘాల నాయకులు అంకతి కిషన్, సడిమెట్ల రాజన్న, రాజగురు, కొమ్మాకుల రవి, బండి రాజలింగు, చెరుకు వెంకన్న, తిప్పని మల్లేష్, ముత్తె ఆనంద్, చెరుకు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ సిపిఆర్ పై అవగాహన ఉండాలి

గుండెపోటు సమయంలో గోల్డెన్ సెకండ్లు వృథా చేయొద్దు

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్,అక్టోబర్(హృదయం ప్రతినిధి) గుండెపోటు సమయంలో అవలంబించవలసిన సిపిఆర్ (కార్డియో పల్మనరీ రెసిసిటేషన్) పద్ధతిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.

ఈనెల 13 నుండి 17 వరకు సిపిఆర్ అవగాహన వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య సిబ్బందికి సిపిఆర్ పై శిక్షణ నిర్వహిస్తున్నారు. బుధవారం ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గుండెపోటు సంభవించిన సమయంలో మొదటి కొన్ని గోల్డెన్ సెకండ్లు వృథా చేయొద్దని అన్నారు. ఈ సమయంలో సిపిఆర్ చేసినట్లయితే ప్రాణాన్ని రక్షించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఈ మధ్యకాలంలో వయసుతో నిమిత్తం లేకుండా గుండెపోటు సంభవిస్తుందని, అందువల్ల ప్రతి ఇంట్లోనూ కుటుంబ సభ్యులకు కూడా సిపిఆర్ పై అవగాహన ఎంతో అవసరమని అన్నారు. ప్రతి వ్యక్తికి సరైన పద్ధతిలో సిపిఆర్ విధానం తెలియాలని అన్నారు. ఈ సందర్భంగా సిపిఆర్ సమయంలో చేయవలసిన, చేయకూడని పనులను గురించి వైద్యులు డెమో ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల అడిషనల్ డీఎంఈ తక్యుద్దీన్ ఖాన్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఆర్ఎంవో నవీన, ప్రోగ్రామ్ ఆఫీసర్ సనా, డాక్టర్ నరేష్ పాల్గొన్నారు.


# బ్యాడ్మింటన్ పోటీలలో సత్తా చాటిన స్లేట్ విద్యార్థులు





జన్నారం, అక్టోబర్ 15(హృదయం విలేకరి) జన్నారం పట్టణంలోని స్లేట్ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో తమ సత్తా చాటి జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ఛైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం రోజున మంచిర్యాల క్లబ్ నందు నిర్వహించిన అండర్ 17, 14 బాల,బాలికల విభాగాలలో మణికంఠ, సహస్ర, గౌతమి, గీతిక,శ్రద్ధ శర్మ లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులను డైరెక్టర్ ఏనుగు రజిత రెడ్డి, ప్రిన్సిపల్ షీరీన్ ఖాన్ పి ఈ టి లు సంతోష్,నగేష్,జోష్న, ఉపాధ్యాయులు అభినందించారు.


# డాక్టర్ బంగారి స్వామిని సన్మానించిన హాఫీజ్ యూసుఫ్



కరీంనగర్ అక్టోబర్15(హృదయం ప్రతినిధి)యూరప్ లోని ప్రముఖ దేశమైన స్విట్జర్లాండ్ బెర్న్ లో...డాక్టర్ గ్రెనిన్ ఆధ్వర్యంలో రోబోటిక్ మోకాలి కీలు మార్పిడి సర్జరీ ట్రైనింగ్ విజయవంతం గా పూర్తి చేసుకొని కరీంనగర్ కు తిరిగివచ్చిన రేనే గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అధినేత, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, జయింట్ రీప్లేస్ మెంట్, స్పైన్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ బండారి స్వామిని, ఎంఐఎం పార్టీ జాయింట్ సెక్రెటరీ, సున్నీ మరకజి మీలాద్ కమిటీ అధ్యక్షుడు హాఫీజ్ సయ్యద్ మొయినుద్దీన్ ఖాద్రి యూసుఫ్ బుధవారం నగరంలోని రేనే ఆసుపత్రిలో మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయంగా సన్మానించారు. ప్రపంచస్థాయి రోబోటిక్ ఆర్థోపెడిక్ సేవలు కరీంనగర్ వేదికగా ఉత్తర తెలంగాణ ప్రజలకు అందించాలనే సంకల్పంతో స్విట్జర్లాండ్ లో విజయవంతంగా శిక్షణను పూర్తి చేసుకున్నందుకు బంగారు స్వామికి శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ బంగారి స్వామి మంచి మనసున్న డాక్టర్ అని పేద మధ్యతరగతి ప్రజల పట్ల ఆత్మీయత దయ ప్రేమానురాగాలను చూపించే మంచి మనిషి అని కొనియాడారు.

ఆయన భవిష్యత్తులో ఇంతింతై వటుడింతై మరింత ఉ న్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రేనే ఆసుపత్రి సేవలను ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి గడిచేలా ముందుకు తీసుకెళ్లేలా ఆ భగవంతుడు డాక్టర్ బంగారి స్వామికి మరో ధైర్యాన్ని కల్పించాలని కోరారు.

# చివరి గింజ వరకు నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు..

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిజిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ఖమ్మం, వుదయం ప్రతినిధి అక్టోబర్ 15** జిల్లాలో రైతులు పండించిన చివరి గింజ వరకు నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి బుధవారం వానాకాలం పంటల కనీస మద్దతు ధరపై గోడప్రతులు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన పంటలకు సంబంధించిన మద్దతు ధరలను ప్రకటించిందని అన్నారు. ప్రతి క్వింటాల్ గ్రేడ్ ఏ రకం ధాన్యానికి 2389 రూపాయలతో పాటు 500 బోనస్, సాధారణ రకం ధాన్యానికి 2369, పత్తి (పొడవు గింజ) 8110, పత్తి (మధ్యస్థ గింజ) 7710 రూపాయలు, మొక్కజొన్నకు 2400 రూపాయలు, కందులకు 8 వేలు, పెసలకు 8768, వేరుశనగ కాయలకు 7263, మినుములు 7800 రూపాయలకు, పొద్దు తిరుగుడుకు 7721, సోయాబీన్ కు 5328, నువ్వులకు 9846, సజ్జలు 2775, రాగులకు 4886 రూపాయలు మద్దతు ధర నిర్ణయించారని అన్నారు. రైతులు స్థానిక మార్కెట్ యార్డులో తమ పంటను కనీస మద్దతు ధరకు విక్రయించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నామని, సన్న రకం ధాన్యంకు రాష్ట్ర ప్రభుత్వం 500 రూపా యల బోనస్ కూడా అందిస్తుందని అన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొని రావాలని కలెక్టర్ తెలిపారు. సీసీఐ కేంద్రాల ద్వారా పత్తిని విక్రయించి మద్దతు ధరను రైతులు పొందాలని అన్నారు. రైతులు కపాస్ కిసాన్ యాప్ డౌన్ లోడ్ చేసుకొని పత్తి విక్రయానికి నేరుగా స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని అన్నారు. పత్తి కొనుగోలు సంబంధిత సేవలకై 1800 599 5779 టోల్ ఫ్రీ నెంబర్ నందు సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సన్యాసయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, జిల్లా రవాణా అధికారి వెంకటరమణ, జిల్లా సహకార అధికారి గంగాధర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడుగా మారిన జిల్లా కలెక్టర్



**గద్వాల అక్టోబర్ 15 వుదయం ప్రతినిధి** బుధవారం రోజు జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బురదపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా వారికి అర్థమయ్యే రీతిలో బోధించాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో పాఠాలు చదివించారు ప్రత్యేక తరగతులను ప్రతిరోజు కచ్చితంగా నిర్వహించాలని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు పదవ తరగతి ఫలితాల్లో జోగులాంబ గద్వాల జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉండేలా చదవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఎఫ్ ఆర్ ఎస్ (ఫేస్ రికగ్నైజింగ్ సిస్టం) లో హాజరు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారా అని ఉపాధ్యాయులను అడిగారు. విద్యార్థుల హాజరు శాతం పెరగాలని, ఏమైనా సమస్యలు ఉంటే పేరెంట్స్ సమావేశాల్లో చర్చించి అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో మరుగుదొడ్ల కొరత ఉందని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఎలాంటి సమస్యలున్న పరిష్కరిస్తామని కలెక్టర్ తెలియజేశారు

# గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయాలి

**జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



**నాగర్ కర్నూల్ అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి)** గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, చదువుతోపాటు క్రీడలను సమానంగా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. క్రీడలలో విజయం సాధించడం మాత్రమే కాదు, క్రీడా విలువలను ఆచరించడం కూడా విద్యార్థుల జీవితానికి ప్రేరణ కావాలి, అని కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు. ఇటీవల జడ్చర్ల బాదేపల్లి వేదికగా జరిగిన ఉమ్మడి జిల్లా అండర్-17 వాలీబాల్ క్రీడల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికైన నాగర్‌కర్నూల్ జిల్లా విద్యార్థులను బుధవారం సాయంత్రం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ శాలువాలు కప్పి, మెమెంటోలు అందజేస్తూ సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతో పాటు క్రీడలు కూడా సమాన ప్రాధాన్యత పొందాలని అన్నారు. విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధి కోసం క్రీడలు అత్యంత అవసరమని ఆయన తెలిపారు. క్రీడల ద్వపోష కాహారంతోనే ఆరోగ్యం మేలు అందోల్, ప్రతి ఒక్కరు పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని మెదక్ జిల్లా అల్లాదుర్గం సిడిపిఓ పద్మలత అన్నారు. పోషణ మాసం సందర్భంగా మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని గాంధీ భవనంలో మంగళవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన టేక్మాల్ అల్లాదుర్గం పెద్ద శంకరంపేట్ రేగోడు మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు తయారు చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. అనంతరం 9 మంది అంగన్వాడీ కార్యకర్తలను ఉత్తమ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన అంగన్వాడి టీచర్లు గ్రామ ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

**జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి)** బుధవారం నాడు ఆకస్మికంగా ఆర్డీవో కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. జిల్లా పరిపాలనలో సమర్థతను పెంపొందించడమే కాకుండా, ప్రభుత్వ సేవలు ప్రజలకు వేగవంతంగా అందేలా చూడాలనే అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఉద్యోగులను హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఉద్యోగుల హాజరు, సమయపాలనపై ఆరా తీశారు. విధి సమయానికి కార్యాలయానికి హాజరుకాని ఉద్యోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ బాధ్యతలను అర్థం చేసుకుని, ప్రజల సేవలో నిబద్ధతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా లేదా ఆలస్యంగా హాజరైన వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టంచేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని అన్ని విభాగాలను సందర్శించి, బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం సక్రమంగా అమలవుతోందా లేదా అన్నది పరిశీల గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయాలి.



# పశువులకు సకాలంలో గాలికుంట వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

**జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**



**నారాయణపేట అక్టోబర్ 15( వుదయం ప్రతినిధి)** నారాయణపేట జిల్లాలోని అన్ని గ్రామాలలో నిర్ణీత షెడ్యూలు ప్రకారం పశువులకు సకాలంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. జిల్లా కేంద్రంలోని బాహర్ పేటలో బుధవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. పశువులకు వేసే టీకాల కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం ఇటీవలే ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని ప్రారంభించిందని, ఆ పథకం కింద రాష్ట్రంలోనీ నాలుగు జిల్లాలు జనగామా,నాగర్ కర్నూల్, గద్వాలతో పాటు నారాయణపేట జిల్లాను కూడా ఎంపిక చేసిందని గుర్తు చేశారు. అయితే ఆ పథకంలో వ్యవసాయ అనుబంధ శాఖలతో పాటు పశుసంవర్ధక, డైరీ, ఫిషరీస్, 11 అనుబంధ శాఖలలోని పారా మీటర్స్ ల అభివృద్ధి చేయడం జరుగుతుందని, అందులో భాగంగానే పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. దాదాపు లక్ష టీకాల డోసులు అందుబాటులో ఉన్నాయని, జిల్లాలోని అన్ని గ్రామాల్లో పశువులకు టీకాలు వేయించాలని కలెక్టర్ పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, పశువైద్యాధికారి అనిరుద్ చారి, భారతీయ కిసాన్ సన్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి గుముడాల వెంకోబా తదితరులు పాల్గొన్నారు.

# సి పి ఆర్ పై వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగికి అవగాహన ఉండాలి..

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు**



**ములుగు అక్టోబర్ 15 (వుదయం ప్రతినిది)** ములుగు జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు కార్డియో పల్మనరి రెసిసిటేషన్ ( సిపి ఆర్) ట్రైనింగను ఇచ్చి మాట్లాడుతూ, వైద్య ఆరోగ్యశాఖలో ప్రతి ఒక్క ఉద్యోగి సి పి ఆర్ పై అవగాహన ఉండాలని, మనిషి మానసిక ఒత్తిడికి ,గుండె జబ్బుల ద్వారా మెదడుకు రక్తప్రసరణ ఆగిపోయి గుండె కొట్టుకోవడం ఆగిపోతుందని అప్పుడు సి . పి .ఆర్ ప్రక్రియ చేయాలని, దీని ద్వారా గుండె కొట్టుకోవడం తోపాటు, ఐదు ప్రధాన అంశాలైన -ప్రాణాలను కాపాడుట' గాయం తీవ్ర తరం కాకుండా నిరోధించుట, మనిషి కోలువడానికి సహాయ బడుట, అపస్మారక స్థితి నుండి రక్షించుట వంటి విషయాలలో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం సి.పి. ఆర్ పై ప్రతి ఉద్యోగితొ ప్రతిజ్ఞను చేయించి, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పై సమీక్షను నిర్వహించి సిబ్బందితో మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు , సూపర్వైజర్స్ పర్యవేక్షించాలని, వారంలో ఒకసారి ఆరోగ్య కేంద్రాల వారిగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించుకోవాలని, కార్యక్రమాలపై పున సమీక్ష చేసిన తర్వాత పటిష్టమైన ప్రణాళికలను కాల పరిమితితో తయారు చేసుకోవాలని వివరించారు. జాతీయ టీబి నియంత్రణ కార్యక్రమము లో నోటిఫికేషన్ 100% చేయాలని, టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వేతర సంస్థలతో న్యూట్రిషన్ కిట్స్ అందజేయాలని ,జాతీయ తల్లి ఆరోగ్యము మరియు పోషకాహార కార్యక్రమాలంలో ప్రభుత్వ ప్రసూతులను 100% చేయాలని, సరైన కాలంలో పిల్లలందరికీ టీకాలు ఇచ్చి వివరాలను ఈవిన్ పోర్టల్ నమోదు చేయాలని అసంక్రమిక వ్యాధులైన రక్తపోటు మధుమేహము క్యాన్సర్ నాలుగో విడత స్క్రీనింగ్ పరీక్షలు ముమ్మరం చేయాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం ఐటిడిఏ డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ క్రాంతి కుమార్ ,జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ చంద్రకాంత్ డాక్టర్ పవన్ కుమార్ డాక్టర్ శ్రీకాంత్ డాక్టర్ రణధీర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ,డెమో సంపత్ ఏ ఎం ఓ దుర్గారావు డిపి హెచ్యన్ శకుంతల మానిటరింగ్ సూపర్వైజర్స్ వెంకట్ రెడ్డి సురేష్ బాబు భూపాల్ రెడ్డి, ఆర్బిఎస్ కి ప్రోగ్రాం డాక్టర్లు డాక్టర్లు నెడ్లేవల్ హెల్త్ ప్రొవైడర్స్ సూపర్వైజర్లు, టీబి ప్రోగ్రాం సిబ్బంది మరియు ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# అయిజ పట్టణ పోలీస్ స్టేషన్ తనిఖీ

## జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు



**(అలంపూర్ అక్టోబర్ 15 వుదయం ప్రతినిధి)** పిర్యాదుదారుల నుండి వచ్చే పాజిటివ్ స్పందనే పోలీస్ పని తీరుకు నిదర్శనంగా నిలుస్తుందని ఆ దిశగా పోలీస్ అధికారులు, సిబ్బంది మరింత బాధ్యత తో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు అధికారులకు, సిబ్బందికి సూచించారు. అలాగే పోగొట్టుకున్న 10 సెల్ ఫోన్లు జిల్లా ఎస్పీ చేతుల మీదుగా బాధితులకు అందజేసి, అయిజ పట్టణంలో ఏర్పాటు చేసిన 15 సి.సి. కెమెరాలను ప్రారంభించారు. వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు అయిజ పోలీసు స్టేషన్ ను సందర్శించి సిబ్బంది యూనిఫామ్ టర్న్ ఔట్, స్టేషన్ రికార్డ్స్, పరిసరాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అయిజ పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం స్టేషన్ పరిసరాల శుభ్రత, సిబ్బంది బ్యారక్స్, స్టేషన్ రికార్డుల మెంటేనేన్స్ ను పరిశీలించారు. సిబ్బంది కిట్ ఆర్టికల్స్ తనిఖీ చేస్తూ కిట్ ఆర్టికల్స్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న స్వాధీనం చేసుకున్న, కేసులో ఉన్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డులను తనఖీ చేస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును చేయాలని, ఆస్థి సంబంధిత నేరాలకు సంబంధించి, అధిక నేరాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పార్ట్స్‌లుగా గుర్తించి, పగలు, రాత్రి బీట్ డ్యూటీల ద్వారా నిఘా కట్టుదిట్టం చేయాలని అన్నారు. కర్ణాటక, ఆంధ్ర సరిహద్దు పోలీస్ స్టేషన్ గా ఉన్నందున ఎలాంటి ఇల్లీగల్ రవాణా జరుగకుండా చెక్ పోస్ట్‌ల దగ్గర పటిష్ట నిఘా ఉండాలని ఎస్సై శ్రీనివాస్ కు సూచించారు. రిసెప్షన్ సిబ్బంది స్టేషన్ కు వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్లైన్ లో నమోదు చేయాలని, ఫిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడాలని తెలిపారు. వి పి ఓ.అధికారులుగ్రామాలపై పూర్తి అవగాహనా ఉండాలని, రౌడీ షిటర్స్, సస్పెక్ట్‌ల పై నిఘా ఉంచాలని, గ్రామాలలో తిరుగుతూ ప్రజలతో మమేకం అవ్వాలని, తద్వారా గ్రామాలలో ఎలాంటి సమాచారం కావాల్లన్న ముందస్తుగా తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. గ్రామాలలో అనుమానిత వ్యక్తులను పాపిలోన్ డివైస్ ను వినియోగించి, వేలిముద్రాలను చెక్ చేస్తూ పాత నేరస్తులను గుర్తించాలని అన్నారు. నేరాల అదుపులో, జరిగిన నేరాలను ఛేదించడంలో ఉపయోగపడే సిసి కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ ప్రజలే స్వచ్ఛందంగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. స్టేషన్ రికార్డులైన పార్ట్ 1 - 5 పెండింగ్ లేకుండా చూడాలని, సిబ్బందికి వర్టికల్ వారీగా విధులను కేటాయించాలని ఎస్.హెచ్.ఓ కు సూచించడం జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణకు, సైబర్ నేరాల నివారణకు వివిధ స్కూల్స్ కళాశాలలు, పని ప్రదేశాలలో కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా అవగాహన కల్పించాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ప్రతి రోజు వాహానాల తనిఖీ నిర్వహిస్తూ, ట్రాఫిక్ నియమాలు పాటించని వాహణదారులపై చర్యలు తీసుకోవాలని, అనుమానిత వాహానాలను అదుపులోకి తీసుకోవాలని అన్నారు. బ్లూ కోల్ట్స్ సిబ్బంది ప్రతి పాయింట్ ను తనిఖీ చేయాలని, డైల్ -100 కాల్స్ కు త్వరితగతిన స్పందించాలని సూచించారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర పోలీసుశాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన సీసీటీఎన్ఎస్ - 2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణ, సీడీఆర్, సిఇఐఆర్ పోర్టల్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్, బాడీ ఓన్ కెమెరాల వంటి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు నేరాల అదుపునకు, జరిగిన నేరాలను ఛేదించడానికి ఉపయోగకరంగా ఉన్నాయని, అన్ని అప్లికేషన్లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, నేరాల నియంత్రణలో కీలకంగా వ్యవహించాలని సిబ్బందికి సూచించడం జరిగింది, ఇప్పుడు నేర్చుకున్న పని మీ సర్వీస్ మొత్తం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం సిబ్బందితో వారు మాట్లాడుతూ.విధి నిర్వాహణలో అంకిత భావంతో పని చేయాలని. ఎవరికీ కేటాయించిన విధులను వారు సక్రమంగా నిర్వర్తించినప్పుడే పోలీసు శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. డ్యూటీ పరంగా లేదా వ్యకిగతంగా ఎలాంటి సమస్య ఉన్న నేరుగా నా దృష్టికి తీసుకురావొచ్చు అన్నారు. ఒకే చోట పని చేస్తున్నప్పుడు ఫ్రెండ్స్ లాగా కలిసి మెలసి ఉండాలని, పాజిటివ్ ఆలోచనలతో పని చెయ్యాలని అన్నారు. ప్రజలు పోలీస్ యూనిఫామ్ కు ఎంతో గౌరవం ఇస్తారో అంతే గౌరవం తో బాధ్యతగా విధులు నిర్వహించాలని అన్నారు. విధులను, పర్సనల్ లైఫ్ ను బాలన్స్ చేసుకొని ముందుకెళ్లాలని సూచించారు. ఈ తనిఖీ లలో అదనపు. ఎస్పీ కె శంకర్, డి.ఎస్పీ మొగిలయ్య, శాంతినగర్ సీఐ టాటా బాబు, ఎస్సై శ్రీనివాసులు, తరుణ్ కుమార్ రెడ్డి ఉన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్ కాపీలను అందజేసిన ఎమ్మెల్యే రేవూరి



**పరకాల అక్టోబర్ 15 (వుదయం ప్రతినిది):** హనుమకొండ భవాని నగర్ లోని తన నివాసం నందు 17 వ డివిజన్ పరిధిలోని అర్హులైన 43 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీలను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేద ప్రజల సొంతింటి కల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో నెరవేరుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని అన్నారు.పారదర్శకంగా ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక జరిగిందని ప్రలోభాలకు, పైరవీలకి తావు ఉండదు అని అన్నారు. ప్రభుత్వం సూచించిన నిబంధన మేరకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవాలని,ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకోవచ్చని అన్నారు.గత ప్రభుత్వ పాలకుల నిర్వాహకం వల్ల ధనిక రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఎవరికి ఒక్క రూపాయి ఇవ్వద్దని, ఎవరైనా తీసుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీలను అందుకున్న లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణ పనులు చేపట్టాలని అన్నారు.

# రెవెన్యూ శాఖకు జి.పి.ఓలు కళ్ళు లాంటి వారు

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 15(వుదయం ప్రతినిధి):** రెవెన్యూ శాఖకు జి.పి.ఓ లు కళ్ళు లాంటి వారని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు బుధవారం ఐడిఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నూతనంగా నియమితులైన జి.పి.ఓ లకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూ భారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై విధుల పట్ల జి.పి.ఓ లకు మార్గదర్శక సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ విధులు అత్యంత కీలకమని, చాలా బాధ్యతాయుతమైనటువంటి జి.పి.ఓ లు గ్రామాల్లో ప్రభుత్వానికి కళ్లు, చెవులు లాంటి వారని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండటం వారి ప్రధాన బాధ్యతని తెలిపారు. భూముల సమస్యలు, రైతుల ఇబ్బందులు, ప్రజల అభ్యర్థనలను మొదటగా గుర్తించేది జి.పి.ఓ లేనని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టంను ప్రవేశపెట్టిందని, ప్రతి జి.పి.ఓ ఈ చట్టంపై పూర్తి అవగాహనతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 54 వేల దరఖాస్తులు వచ్చాయని, వాటి పరిశీలనలో జి.పి.ఓ లు కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా పరిష్కరించాలన్నారు.గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరైనా అవినీతి లేదా అక్రమాలకు పాల్పడితే, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం మన కర్తవ్యమని గుర్తుంచుకోవాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.జి.పి.ఓ లు తమ పనిని సేవా దృక్పథంతో, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వర్తిస్తే, భూ భారతి కార్యక్రమం విజయవంతమవుతుందని కలెక్టర్ రాహుల్ శర్మ విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ రవి, ట్రైని డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, భూపాలపల్లి తహసిల్దార్ శ్రీనివాసులు, జిపిఓలు తదితరులు పాల్గొన్నారు.



# మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించిన జిల్లా అధికార ప్రతినిధి తక్కలపల్లి



మృతదేహంపై పూలమాల వేస్తున్న జిల్లా అధికార ప్రతినిధి తక్కలపల్లి

**ఖానాపురం, అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి):** మండలంలోని అశోక్ నగర్ గ్రామానికి చెందిన గాదరి మల్లమ్మ(73) అనారోగ్యంతో మృతి చెందిగ మృతదేహాన్ని జిల్లా అధికార ప్రతినిధి తక్కెళ్ళపెల్లి రవీందర్ రావు సందర్శించి మృతదేహంపై పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జాడి అచ్యుతం, గోనెల మురళి, కూస మునెందర్,కదురు సారయ్య, జాడి వెంకటేష్, గుండ్ల యాకయ్య, బానోత్ మల్లేష్, బానోత్ విజయ్,బుర్ర మురళి, నడిపెల్లి భరత్, జక్కుల భాను, కదురు సమ్మయ్య, దుస్స కుమార్, కర్రె దేవేందర్, ఆలువాలా రమేష్, శీలం, దేవేందర్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

# తాడిచర్ల అటవీ ప్రాంతంలో పేకాట స్థావరాలపై దాడి



**జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 15(వుదయం ప్రతినిధి):** భూపాలపల్లి టాస్క్ ఫోర్స్ పోలీస్‌లు పేకాట స్థావరలపై దాడి నిర్వహించనట్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు నమ్మదగిన సమాచారం ఆధారంగా టాస్క్ ఫోర్స్ సీఐ రమేష్ బృందంతో కొయ్యూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తాడిచర్ల అటవీ ప్రాంతంలో దాడిని నిర్వహించి పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.50,500/-నగదు, 10 మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం, ఒక షిఫ్ట్ డిజైర్ కారు, తోపాటు 52 ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు నిందితులను స్వాధీనం చేసుకున్న వస్తువులు కొయ్యూరు పోలీస్ స్టేషన్‌కు అప్పగించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో చట్టవ్యతిరేక కార్య కలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేదని పేకాట, బెట్టింగ్ వంటి కార్యకలాపాల వలన అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతింటున్నాయి. అని ముఖ్యంగా యువత తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో చెడు మార్గాలను ఎంచుకోవడం ఆందోళనకరం అని కష్టపడి సంపాదించినదే నిలుస్తుందని తెలిపారు ప్రజలు ఇలాంటి సమాచారాన్ని పోలీసులకు అందించి సహకరించాలని కోరారు.

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ను మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



దమ్మపేట అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి): జిల్లాలో మాదక ద్రవ్యాల సమూల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు భాద్యతను నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ తెలిపారు.చైతన్యం పేరుతో ఈ రోజు నుండి నవంబర్ 15వ తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసుల ఆధ్వర్యంలో గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మాలన కోసం వివిధ రకాల అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.ఇందులో భాగంగానే జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ చైతన్యం పోస్టర్లను విడుదల చేశారు.ఈ నెల రోజుల పాటు జిల్లా పోలీసులు చేపట్టే కార్యక్రమాలలో ప్రజలు కూడా భాగస్వాములై తమ వంతు భాద్యతగా సహకారం అందించాలని కోరారు.మత్తుకు బానిసలుగా మారిన యువత తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని,వారిలో చైతన్యం నింపేందుకే ప్రత్యేకంగా ఈ కార్యమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు.జిల్లాలోని గంజాయి హాట్స్పాట్స్ లో నిత్యం తనిఖీలు చేపట్టడం,ఎవరైనా మత్తు పదార్ధాలను సేవిస్తూ పట్టుబడితే వారికి కౌన్సిలింగ్ నిర్వహించడం,వాహన తనిఖీలు వంటి కార్యక్రమాలను ఒక ప్రణాళిక ప్రకారం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.ఎవరైనా నిషేదిత గంజాయిని రవాణా చేస్తున్నట్లు గానీ,విక్రయిస్తున్నట్లు గానీ,సేవిస్తున్నట్లు గానీ సమాచారం తెలిస్తే పోలీసు వారికి వెంటనే సమాచారం అందించాలని కోరారు.

చైతన్యం పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పీ చంద్రభాను,కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి,పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,సీసిఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్,ఎస్సైలు ప్రవీణ్,రామారావు మరియు తదితరులు పాల్గొన్నారు.

# న్యూఢిల్లీలో 16వ అంతర్జాతీయ రైల్వే పరికరాల ప్రదర్శన ,సదస్సు

**న్యూఢిల్లీలో 16వ అంతర్జాతీయ రైల్వే పరికరాల ప్రదర్శన (ఐ.ఆర్.ఇ.ఇ ) మరియు అంతర్జాతీయ రైల్వే సదస్సు (ఐ.ఆర్.సి) 2025ను ప్రారంభించిన :గౌరవ కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్**





హైదరాబాద్,అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి): రైల్వే మంత్రిత్వ శాఖ సహకారంతో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సి.ఐ.ఐ) న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన 16వ అంతర్జాతీయ రైలు పరికరాల ప్రదర్శన (ఐ.ఆర్.ఇ.ఇ ) 2025 మరియు అంతర్జాతీయ రైల్వే సదస్సు(ఐ.ఆర్.సి) 2025ను కేంద్ర రైల్వే, సమాచార %డ% ప్రసార శాఖ, ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ ప్రారంభించారు. ఐ.ఆర్.ఇ.ఇ అనేది రైల్వేలు మరియు రవాణా రంగంలో ఆసియాలో అతిపెద్ద మరియు ప్రపంచంలో రెండవ అతిపెద్ద ప్రదర్శన. ఈ సదస్సు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశ్రమ నాయకులను , ఆవిష్కర్తలను మరియు వాటాదారులను ఒకచోట చేర్చింది. ఈ సందర్భంగా గౌరవ రైల్వే మంత్రి మాట్లాడుతూ, గత 11 సంవత్సరాలుగా మన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ రైల్వేల ఆధునీకరణపై బలమైన దృష్టి సారించారని, దాని ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. ఈ 11 సంవత్సరాల కాలంలో దాదాపు 35,000 కిలోమీటర్ల కొత్త ట్రాక్‌లు నిర్మించబడ్డాయని, 46,000 కిలోమీటర్ల రైల్వే లైన్లు విద్యుదీకరించబడ్డాయని ఆయన హైలైట్ చేశారు. ప్రస్తుతానికి భారతీయ రైల్వేలు 156 వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లు, 30 అమృత్ భారత్, మరియు 4 నమో భారత్ సర్వీసులు నడుపుతుందని , ఇవి దేశవ్యాప్తంగా బాగా ప్రాచుర్యం పొందాయని మరియు ప్రతి సంవత్సరం 7,000 కోచ్‌లు తయారు చేయబడుతుండటంతో మన ఉత్పత్తి స్థాయిలు కూడా గణనీయంగా పెరిగిందని ఆయన పేర్కొన్నారు.ఈ ప్రదర్శన గురించి గౌరవ మంత్రి మాట్లాడుతూ, రైల్వే టెక్నాలజీ, తయారీ మరియు ఆవిష్కరణలలో భారతదేశం యొక్క పురోగతిని ప్రదర్శించడానికి ఇది ఒక గొప్ప ప్రధాన వేదికగా పనిచేస్తుందని, అదే సమయంలో భాగస్వామ్యాలు, పెట్టుబడులు మరియు అభివృద్ధికి నూతన మార్గాలను తెరుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా భారత పరిశ్రమల సమాఖ్య (సి.ఐ.ఐ) మరియు గతి శక్తి విశ్వవిద్యాలయ మధ్య ఒక అవగాహన ఒప్పందం (ఎమ్.ఓ.యూ)పై సంతకం చేయడం జరిగింది. ఈ అవగాహన ఒప్పందం పరిశ్రమ-విద్యా సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుంది. ఈ ప్రదర్శన మరియు సమావేశం మూడు రోజుల పాటు కొనసాగుతుంది. ఇందులో పరిశ్రమ చర్చలు, అంతర్జాతీయ భాగస్వామ్యం, వ్యాపార సమావేశాలు మరియు సాంకేతిక ప్రదర్శనలు ఉంటాయి తద్వారా రైలు రవాణా భవిష్యత్తును రూపొందించడంలో భారతదేశం పాత్రను మరింత బలోపేతం చేస్తాయి.ఐ.ఆర్.ఇ.ఇ 2025 ఆస్ట్రియా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, నెదర్లాండ్స్, దక్షిణ కొరియా, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్ మరియు ఇతర దేశాలతో సహా 14ం దేశాల నుండి 20,000కు పైగా పరిశ్రమ నిపుణులను మరియు 450 కంటే ఎక్కువ ప్రదర్శనకారులను ఒకచోటకు చేర్చుతోంది. ఆధునీకరణ, డిజిటల్ చొరవలు మరియు భవిష్యత్తు అవసరాలను హైలైట్ చేస్తూ భారతీయ రైల్వేలు గతంలో లేని విధంగా అతిపెద్ద పెవిలియన్‌ను ప్రదర్శిస్తోంది. సాంకేతిక పురోగతి, సహకారం మరియు ప్రపంచ అనుసంధానంపై దృష్టి సారించి, “భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న రైల్వే: ఆవిష్కరణ, ఏకీకృతం మరియు ప్రపంచ భాగస్వామ్యాలు” అనే అంశంపై చర్చించడానికి ఐ.ఆర్.సి 2025 దాదాపు 500 మంది ప్రతినిధులకు ఆతిథ్యం ఇస్తోంది. నూతన భాగస్వామ్యాలు మరియు వ్యాపార అవకాశాలను ప్రోత్సహించడానికి కొనుగోలుదారు-విక్రేతలు మరియు పరిశ్రమ-ప్రభుత్వం మధ్య పరస్పర చర్యలు చేపట్టడానికి ఈ సమావేశం దోహదపడుతుంది

# ప్రజాస్వామ్య పద్ధతిలో డిసిసి ఎన్నిక కాంగ్రెస్ బలోపేతం దిశగా ముందడుగు



పెద్దపల్లి జిల్లా (వుదయం) ప్రతినిధి:పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్కే గార్డెన్స్‌లో తమిళనాడు మాజీ ఎంపీ డా. జయ కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే విజయరమణ రావు, ఆర్%డ%అలి గెస్ట్‌హౌస్‌లో ఏఐసీసీ పరిశీలకుడు జయ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ పరిశీలకుడు జయ కుమార్ మాట్లాడుతూ, ఏఐసీసీ నిర్ణయం ప్రజాస్వామ్యానికి బలాన్నిస్తుందని, డిసిసి ఎన్నికల ద్వారా సమర్థులైన నాయకులను ముందుకు తీసుకురావడమే లక్ష్యమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ నాయకత్వంలో అమలవుతున్న పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. పెద్దపల్లి, రామగుండం, మంథని, ధర్మపురి నియోజకవర్గాల్లో అభిప్రాయ సేకరణ జరుపుతామని తెలిపారు. డిసిసి ఎన్నికల్లో ప్రతి కార్యకర్త స్వేచ్ఛగా పోటీ చేయవచ్చని, అభిప్రాయ సేకరణ అనంతరం అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. డిసిసి అధ్యక్షుని ఎంపిక కోసం దరఖాస్తులు ఈ నెల 22వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చే నిర్ణయం తీసుకుని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించిందని తెలిపారు. కానీ కేంద్రం ఇప్పటివరకు స్పందించకపోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. అసెంబ్లీలో ఆమోదించిన బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్రం ఆమోదం చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు రాష్ట్రాన్ని తప్పుపట్టడానికి ముందు తమ పార్టీ నాయకత్వంలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీని ప్రశ్నించాలన్నారు. డిసిసి ఎన్నికలు పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో జరగనున్నాయని తెలిపారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రతో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తిరిగి వస్తోందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి గ్రామీణ స్థాయి వరకు కార్యకర్తలు చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ నేషనల్ కోఆర్డినేటర్ కేతూరి వెంకటేష్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ రాజేష్, ప్రోటోకాల్ సెక్రటరీ అజిత్, జనరల్ సెక్రటరీ కాశీపాక రాజేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దాన్నాయక దామోదర్ రావు, ఆరే సంతోష్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, ఈర్ల స్వరూప, గండు సంజీవ్, మండల పార్టీ అధ్యక్షులు కాద్గ శ్రీనివాస్, చిలుక సతీష్, మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సామ రాజేశ్వర్ రెడ్డి, బొజ్జ శ్రీనివాస్, సదయ్య, పట్టణ అధ్యక్షులు భూషనవేణి సురేష్ గౌడ్, వేగోలపు అబ్బయ్య గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంకూరి అవినాష్, అసెంబ్లీ అధ్యక్షుడు ముత్యాల నరేష్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో - మంత్రులు

## - జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ మరియు సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం





సిద్దిపేట, 15 అక్టోబర్ (వుదయం ప్రతినిధి)రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ, మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఇరిగేషన్ మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమకుమార్ రెడ్డి, మత్స్య మరియు క్రీడల శాఖ మంత్రి వాకాటి శ్రీహరి, సిఎస్ రామకృష్ణా రావు ఇతర ఉన్నతాధికారులతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై బుధవారం ఉదయం హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ మరియు సంబంధిత శాఖల అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్యాడి వినియోగం తెలంగాణలో ఎక్కువగా ఉందని, భారత దేశంలో ఎక్కువ ఖరీఫ్ ప్రొక్యూర్మెంట్ ఉంటుందని అన్నారు. ఇందుకొరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కొరకు ఏర్పాట్లు చేసుకోవాలని, ట్రాన్స్పోర్ట్ సమస్యలు తలెత్తకుండా కలెక్టర్, ఎస్పీలు జాగ్రత్తలు తీసుకోవాలని, జిల్లాలో అవసరం మేర ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అలాగే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో గన్నీ, ప్యాడీ క్లీనర్లు, మాయిచర్ మిషన్లు, ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లు తదితరాలు అందుబాటులో ఉండేలా చూడాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కొనుగోలులో ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైతే పై అధికారులను గాని సంబంధిత మంత్రులను గాని సంప్రదించాలని సూచించారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, దేశంలో పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని, ఇప్పటి వరకు పద్ధతి ప్రకారం, ఎలాటి సమస్యలు లేకుండా ధాన్యం కొనుగోలు చేసామన్నారు. దీపావళి పండుగ తరువాత మొక్క జొన్న, సోయా పంటలను కూడా వస్తాయి కాబట్టి అధికారులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రతినిధులతో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి, కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించడంతో పాటుగా తరచు తనిఖీలు నిర్వహించాలని, ఎక్కడ ట్రాన్స్పోర్ట్ సమస్యలు లేకుండా చూడాలని, గన్ని బ్యాగులు అన్ని చోట్ల అందుబాటులో ఉండేలా చూడాలని, ధాన్యం సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా, అవరాన్ని బట్టి ట్రాక్టర్లను కూడా వినియోగించుకోవాలని, ఈ అనుమతి కొరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. హమాలీ సమస్యలు లేకుండా చూడాలని, మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి చేసుకోవడంలో ఆలస్యం జరగకుండా మిల్లర్లకు ఇచ్చినమైన ఆదేశాలు జారీ చేయాలని, మిల్లులను తరచు తనిఖీలు చేయాలని, రైతుల బ్యాంకు ఖాతా, మొబైల్ నెంబర్, ఆధార్ నెంబర్ వివరాలు మరోసారి సరిచూసుకోవాలని, కేంద్రాల్లో స్పేస్ సమస్య లేకుండా చూడాలని, జిల్లాలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులతో ప్రాంభించేలా చూడాలని సూచించారు. జిల్లాలో ప్యాడీ కొనుగోలులో సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయడానికి 7995050809 నంబర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ, డిఎం సివిల్ సప్లై ప్రవీణ్, జిల్లా వ్యవసాయ అధికారి సోమవారం స్వరూప రాణి, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ భవ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జంగంపేటలో గాలికుంటు వ్యాధి నివారణ ఉచిత టీకాల పంపిణీ ప్రారంభం



జిన్నారం,అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి): మున్సిపాలిటీలో పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా పాడి రైతులు శ్రద్ధ వహించాలని జిన్నారం పశు వైద్యాధికారి విశ్వచైతన్య అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని జంగంపేట గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... 15వ తేదీ నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేయడం జరుగుతుందన్నారు. పిటా ప్రభుత్వం పశువులకు రెండుసార్లు ఈ టీకాలు ఉచితంగా వేస్తుందని వివరించారు. గ్రామాల్లోకి వచ్చే పశు వైద్య సిబ్బందికి సహకరించి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది అశోక్, బాబులాల్, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్ఫూర్తినిచ్చిన మహోన్నత వ్యక్తి

ఆదిలాబాద్, అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి): అదిలాబాద్ లోని బర్ని పాఠశాలలో, ఉపాధ్యాయుడు కుమ్ర అనిల్ కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని, ప్రపంచ విద్యార్థి దినోత్సవంగా ఘనంగా నిర్వహించారు. భారతదేశానికి గర్వకారణమైన మేధావి, శాస్త్రవేత్త, మిస్సైల్ మ్యాన్, మానవతావాది అయిన కలాం, ఓటమిలో విజయం చూడటం, స్వయంకృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలు అధిరోహించడం వంటివి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచాయని ఉపాధ్యాయుడు తెలిపారు. “పది తరాల పేదరికాన్ని ఒకే తరంలో మార్చగల శక్తి ఉన్న ఏకైక ఆయుధం విద్య” అని కలాం చెప్పిన మాటలను గుర్తుచేస్తూ, విద్య ద్వారా ఆకాశమంత ఎత్తుకు ఎదగాలని విద్యార్థులకు సూచించారు.

# శ్రీలక్ష్మీ నరసింహుని హుండీ ఆదాయం లెక్కింపు

**మొత్తం ఆదాయం 46లక్షల 84వేల46రూ.**



ధర్మపురి అక్టోబర్15(వుదయం విలేకరి):ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానం ఆవరణలో బుధవారం 112 రోజులకు సంబంధించిన హుండీ విప్పి ఆదాయం లెక్కిం చగా మొత్తం 46 లక్షల84వేల 46 రూ ఆదాయం వచ్చిందని,మిశ్రమ బంగారం27 గ్రా,మిశ్రమ వెండి 4కిలోల 700 గ్రా,విదేశీ నోట్లు 26 వచ్చినవని ఈఓ సంకటాల. శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్ర మంలో దేవాదాయశాఖ జగిత్యాల డివిజన్ పరిశీలకులు ఎం.రాజ మౌళి,ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు,సీనియర్ అసిస్టెంట్ ఆల్వాల్ శ్రీనివాస్, ధర్మకర్తల మండలి సభ్యులు,ఆర్య వైశ్య సంఘం కోశాధికారి జక్కు దేవేందర్,మాజీ ధర్మకర్త గునిశెట్టి. రవీందర్, తిరుమల సేవా గ్రూప్ ఇంచార్జి రవీందర్, సభ్యులు, కరీంనగర్, ధర్మపురి,లక్షెట్టిపేట్ సేవకులు,ఇతరులు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్, సిబ్బంది,పోలీస్ సిబ్బంది, దేవస్థానం అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# పశువులకు ఉచిత గాలికుంటు టీకాలు

దోర్నకల్, అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి):మహబూబాబాద్ జిల్లాలో, జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా, 15 అక్టోబర్ 2025 నుండి 14 నవంబర్ 2025 వరకు నెలరోజుల పాటు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం చేపట్టబడుతుందని జిల్లా పశు వైద్య మరియు పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి. కిరణ్ కుమార్ తెలిపారు. గాలికుంటు వ్యాధి పికార్నో వైరస్ వలన సోకుతుందని, ఇది పశువులలో ఉత్పాదక శక్తి, పునరుత్పత్తి సామర్థ్యాన్ని తగ్గిస్తుందని, రైతులు ఆర్థికంగా నష్టపోతారని ఆయన పేర్కొన్నారు.

# దివంగత ఏపీజే అబ్దుల్ కలాం పాత్ర గొప్పది

ముథోల్, అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి): క్షిపణి వ్యవస్థ అభివృద్ధిలో దివంగత ఏపీజే అబ్దుల్ కలాం పాత్ర గొప్పదని ఏపీజే అబ్దుల్ కలాం ఎడ్యుకేషనల్, వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు మొహమ్మద్ అజహర్ ఓద్దీన్ తెలిపారు. బుధవారం ఆయన వర్ధంతి సందర్భంగా ఈద్గాం చౌరస్తాలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కలాం స్మారకార్థం స్థానికంగా క్షిపణి రూపాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎ మసూద్, షేక్ ఇంతియాజ్, షేక్ ఖలీల్, రైయిస్ ఓద్దీన్, జరీఫ్, విక్కి పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని పరామర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలతో కలిసి దొంతి మాధవరెడ్డిని పరామర్శించిన ముఖ్యమంత్రి**



పిజిఆర్ గార్డెన్‌లో ఎమ్మెల్యే మాధవరెడ్డి మాతృమూర్తి కాంతమ్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హనుమకొండ, అక్టోబర్ 15(వుదయం జిల్లా ప్రతినిధి):** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని బుధవారం పరామర్శించారు. దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి దొంతి కాంతమ్మ ఇటీవల మరణించగా కాజీపేట ప్రశాంత్ నగర్ సమీపం లోని పిజిఆర్ గార్డెన్ లో మాతృ యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు డాక్టర్ కడియం కావ్య, పోరిక బలరాం నాయక్, రఘువీర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కేఆర్ నాగరాజు, యశస్విని రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, ఇతర ప్రముఖులు హాజరు కాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తదితరులు ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. హెలికాప్టర్ లో హైదరాబాద్ నుండి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ని పరామర్శించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి హైదరాబాద్ నుండి హెలికాప్టర్ ద్వారా హనుమకొండ సుబేదారి లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద దిగారు. దొంతి మాధవ రెడ్డి ని పరామర్శించేందుకు హెలికాప్టర్ ద్వారా ఆర్ట్స్ కళాశాల మైదానానికి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి కి రాష్ట్ర మంత్రి అనసూయ సీతక్క, ఎంపీలు పోరిక బలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, యశస్విని రెడ్డి, కే ఆర్. నాగరాజు, గండ్ర సత్యనారాయణ, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, గ్రేటర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, పలువురు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పుష్ప గుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ఆర్ట్స్ కళాశాల మైదానం నుండి రోడ్డు మార్గం లో పీజీఆర్ గార్డెన్ లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాతృ మూర్తి దొంతి కాంతమ్మ మాతృ యజ్ఞం కార్యక్రమం లో పాల్గొన్న ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే లు దొంతి కాంతమ్మ చిత్రపటం వద్ద పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు మాట్లాడారు. ఎమ్మెల్యే మాధవ రెడ్డి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్ట్స్ కళాశాల మైదానానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు చేరుకున్నారు.

### తిరిగి హైదరాబాద్‌కు హెలికాప్టర్‌లో బయలుదేరిన సీఎం, తదితరులు

వరంగల్ పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ని పరామర్శించిన అనంతరం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ నుండి హెలికాప్టర్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి బయలుదేరారు. హెలిపాడ్ వద్ద మంత్రులు అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు పోరిక బలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే లు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్. నాగరాజు, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, ఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, తదితరులు ఘనంగా వీడ్కోలు పలికారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**దమ్మపేట అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి):** జిల్లాలో మాదక ద్రవ్యాల సమూల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు భాధ్యతను నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్



తెలిపారు. చైతన్యం పేరుతో ఈ రోజు నుండి నవంబర్ 15వ తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసుల ఆధ్వర్యంలో గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మాలన కోసం వివిధ రకాల అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.ఇందులో భాగంగానే జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ చైతన్యం పోస్టర్లను విడుదల చేశారు.ఈ నెల రోజుల పాటు జిల్లా పోలీసులు చేపట్టే కార్యక్రమాలలో ప్రజలు కూడా భాగస్వాములై తమ వంతు భాధ్యతగా సహకారం అందించాలని కోరారు.మత్తుకు బానిసలుగా మారిన యువత తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని,వారిలో చైతన్యం నింపేందుకే ప్రత్యేకంగా ఈ కార్యమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు.జిల్లాలోని గంజాయి హాట్స్పాట్స్ లో నిత్యం తనిఖీలు చేపట్టడం,ఎవరైనా మత్తు పదార్థాలను సేవిస్తూ పట్టుబడితే వారికి కౌన్సిలింగ్ నిర్వహించడం, వాహన తనిఖీలు వంటి కార్యక్రమాలను ఒక ప్రణాళిక ప్రకారం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.ఎవరైనా నిషేదిత గంజాయిని రవాణా చేస్తున్నట్లు గానీ,విక్రయిస్తున్నట్లు గానీ,సేవిస్తున్నట్లు గానీ సమాచారం తెలిస్తే పోలీసు వారికి వెంటనే సమాచారం అందించాలని కోరారు. చైతన్యం పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పీ చంద్రభాను, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,సీసిఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు మరియు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెటింగ్, మార్క్ ఫెడ్, హెచ్ ఏ సి ఏ, రైస్ సంస్థల ఎండీలతో

### వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల సమీక్ష



**దమ్మపేట అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి):** వివిధ పంటల కోతలు ప్రారంభమైన సందర్భంగా వాటి సేకరణ, మరియు మార్కెటింగ్ డిపార్ట్ మెంట్ ద్వారా వరి ధాన్య సేకరణలో అవసరమయ్యే క్లీనర్లు, టార్పలిన్లు, మున్నగు వాటి జిల్లాల వారి లభ్యతపై సమీక్షించారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం మేరకు గురువారం నుండి మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఆరంభిస్తున్నట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోయాబీన్ కొనుగోలు కేంద్రాలు ఆరంభించేందుకు చర్యలు సీసీఐ టెండర్ల ప్రక్రియ పూర్తి అయిందని, కావున వెంటనే కలెక్టర్లు జిన్నింగ్ సెంటర్లు రేపటిలోగా నోటిఫై చేసి పత్తి కొనుగోళ్లు కూడా ఆరంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతీ ఉమ్మడి జిల్లాకు ఒక హెూదాలో ను అన్ని పంటల కొనుగోళ్లకు సమన్వయ అధికారిగా నియమించడం జరిగిందని, వీరు ఉమ్మడి జిల్లా పరిధిలోని కలెక్టర్లతో సమన్వయం చేసుకొని రైతులకు కొనుగోలు కేంద్రాలలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలకు ఎండి, వేర్ హౌజ్ వరంగల్ జిల్లాకు డైరెక్టర్, హార్టీకల్చర్ నల్లగొండ జిల్లాకు డైరెక్టర్, అగ్రికల్చర్ మహబూబ్ నగర్ జిల్లాకు ఎండి, హాకా ఖమ్మం జిల్లాకు డైరెక్టర్ మార్కెటింగ్ ఆదిలాబాద్ జిల్లాకు డైరెక్టర్, సీడ్ సర్టిఫికేషన్ కరీంనగర్ జిల్లాకు ఎండి, ఆగ్రోస్ మెదక్ జిల్లాకు ఎండి, మార్క్ ఫెడ్ రంగారెడ్డి జిల్లాకు ఎండి, ఆయిల్ ఫెడ్ స్పెషల్ ఆఫీసర్లుగా నియమించడం జరిగింది. అని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, హెచ్ ఎ సి ఎ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, మార్క్ ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి తదితరులుతదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ కుమ్మర సంఘం (టి ఆర్ కె ఎస్) జిల్లా నూతన కమిటీ ఎన్నిక

**జిల్లా కన్వీనర్‌గా రధారపు బిక్షపతి, కో-కన్వీనర్‌గా గంగాధర వెంకటేశ్వర్లు ఎన్నిక తెలంగాణ కుమ్మర సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడిగా కంభంపాటి సతీష్**



**నల్గొండ అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం టి ఆర్ కె ఎస్ నల్గొండ జిల్లా కార్యవర్గ సభ్యుడుగా కంభంపాటి సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం టి ఆర్ కె ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి నల్గొండ జిల్లా ఎన్నికల ఇంచార్జ్ ఏడుకొండల వెంకటేశం ఆధ్వర్యంలో మంగళవారం నాటికి పాత జిల్లా కమిటీని 6 నియోజక వర్గాలు 33 మండలాల కుమ్మర్ల సమక్షంలో రద్దు చేసుకొని నూతన కన్వీనర్ రాధారపు బిక్షపతి, కో కన్వీనర్ గంగాధరి వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులుగా కంభంపాటి సతీష్, నిదానంపల్లి వెంకటస్వామి, చిట్టిమల్ల దశరథ, కంచర్ల రాము, మహిళా జిల్లా అధ్యక్షురాలుగా ఎగిరిశెట్టి అనిత ను ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎన్నికల ఇంచార్జ్ ఏడుకొండల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ కుమ్మర సంఘం టి ఆర్ కె ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నడికుడి జయంతి రావు ఆధ్వర్యంలో కుమ్మరి కుల ఆశయ సాధన కోసం ముందుకు సాగుతుందని అన్నారు. రాష్ట్ర కుమ్మరులందరూ ఐక్యమత్యం తో ముందుకు సాగుతూ రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. సంగం అభివృద్ధి కోసం యువత ముందుకు వచ్చి సహకరించాలని అన్నారు. కంభంపాటి సతీష్ మాట్లాడుతూ నా ఎన్నికకు సహకరించినటువంటి రాష్ట్ర నాయకులకు ఆమంచి రాజలింగం, ఏడుకొండల వెంకటేశ్వర్లు, రాధారపు బిక్షపతి, గంగాధర వెంకటేశ్వర్లు, నిమ్మనగోటి లింగయ్య కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లాలో కుమ్మరి కుల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసి సంఘ అభివృద్ధికి సహకరిస్తానని తెలియజేశారు.

## ఆరోగ్యవంతమైన మహిళ కోసం కుటుంబ సభ్యులు భాధ్యత తీసుకోవాలి జిల్లా కలెక్టర్



పోషణ మాసంలో భాగంగా సూర్యాపేట పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాలులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పోషణ లోపం లేని సమాజాన్ని నిర్మించడమే పోషణ మాసం లక్ష్యమని, అందుకు క్రింది స్థాయిలో కృషి చేస్తున్న అంగన్వాడీ టీచర్లకు అభినందనలు తెలిపారు. గర్భిణీల పోషణలో ప్రతి గడపలోని అత్త, మామ, అమ్మ , నాన్న, భర్త, పిల్లల పాత్ర, ఉంటుందని ప్రతి సమావేశంలో వీరందరినీ భాగస్వాములను చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సుబ్బలక్ష్మి, సూపర్వైజర్లు, పోషణ అభియాన్ జిల్లా బ్లాక్ కోఆర్డినేటర్లు, అంగన్వాడి కార్యకర్తలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## కపాస్ కిసాన్ మొబైల్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించాలి

**జిల్లా కలెక్టర్ విజయేందిరా బోయ**



పోస్టర్ విడుదల చేస్తున్న మహబూబ్నగర్ జిల్లా కలెక్టర్

**మహబూబ్ నగర్ అక్టోబర్ 15(వుదయం ప్రతినిధి)** పత్తి కొనుగోళ్లకు సంబంధించి సీ సీ ఐ కొత్తగా తీసుకువచ్చిన కపాస్ కిసాన్ యాప్ గురించి జిల్లా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కు సంబంధించి వరి ధాన్యం, పత్తి కొనుగోళ్ల మద్దతు ధరలను తెలిపే గోడ ప్రతులను మంగళ వారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పత్తి కొనుగోళ్ల లో కొత్త యాప్ విధానాన్ని అమలు చేయడం ద్వారా మిల్లుల వద్ద పత్తి రైతులు నిరీక్షించే పరిస్థితి ఉండదని తెలిపారు. కపాస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుక్ చేసుకున్న రైతులు వారం రోజుల లోపు ఎప్పుడైనా పత్తిని మిల్లులకు తీసుకెళ్ళి విక్రయించుకోవచ్చని ఆమె చెప్పారు. జిల్లాలో ఈ సారి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వరి ధాన్యం, పత్తి కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి బాలామణి, సివిల్ సప్లై డీ.ఎం. రవి నాయక్, డి.ఎస్.ఓ గంప శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అధిక వర్షాలకు నష్టపోయిన పంటలను పరిశీలించిన బిజెపి నాయకులు



**మధిర,అక్టోబర్ 15(వుదయం ప్రతినిధి)** అధిక వర్షాలతో చేతికి వచ్చిన పంటలు నష్టపోయి రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్న పరిస్థితుల్లో నష్టపోయిన పంటలను భారతీయ జనతా పార్టీ మధిర మండల అధ్యక్షులు గడ్డం శ్రీహరి చౌదరి ఆధ్వర్యంలో పరిశీలించడం జరిగింది. నిదానపురం గ్రామానికి చెందిన గోరక నర్సిరెడ్డికి చెందిన మిరప పంటను, తిప్పారెడ్డి శ్రీనివాస్ రెడ్డికి చెందిన ప్రతి పంటలతో పాటు అనేక పంటలను పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది.వ్యవసాయ అధికారులు తక్షణమే స్పందించి పంట నష్టానికి సంబంధించిన నివేదికలు రూపొందించాలని బిజెపి డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు,జిల్లా కౌన్సిల్ సభ్యులు గుండా చంద్రశేఖర్ రెడ్డి, బూత్ అధ్యక్షులు బొల్లారెడ్డి,నాయకులు అమరవాది రవీందర్ రెడ్డి,జీ నర్సిరెడ్డి, చల్లా నర్సిరెడ్డి రైతులు గుండా నారపరెడ్డి,పాశం కృష్ణారెడ్డి,గోరక నర్సిరెడ్డి, తిప్పారెడ్డి శ్రీనివాస్ రెడ్డి,కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రూరల్ సీఐ ప్రతాప్ లింగం ఆధ్వర్యంలో నఖాబంది




కోదాడ రూరల్ :సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం ఆంధ్ర తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన రామాపురం క్రాస్ రోడ్ లో కోదాడ రూరల్ సిఐ ప్రతాప లింగం ఆధ్వర్యంలో నాఖాబంది తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని ప్రజలకు రక్షణ కల్పించనున్నట్లు సీఐ ప్రతాప లింగం తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై గోపాల్ రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ కలాం సేవలు చిరస్మరణీయం



కోదాడ: భారత దేశ మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఏ పీ జే అబ్దుల్ కలాం జయంతినీ బుధవారం కోదాడ పట్టణంలోనీ ఎన్ ఆర్ ఎస్ జూనియర్ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్ర పటానికి కాలేజ్ ఛైర్మన్ వడ్డే రాజేష్ చౌదరి, డైరెక్టర్ మనోహర్ రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాలలో దేశాభివృద్ధి కోసం విశేష కృషి చేసిన మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం అని అన్నారు. కలాం ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ కరస్పాండెంట్ వేణుగోపాల్ రావు, అకడమిక్ అడ్వైజర్ మైనం రామయ్య, వైస్ ప్రిన్సిపాల్ జీ వీ, పలువురు లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మందుల సామేల్



**తుంగతుర్తి/ శాలిగౌరారం, అక్టోబర్ 15, (వుదయం ప్రతినిధి):** తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని శాలిగౌరారం మండలంలో ఐకెపి ఆధ్వర్యంలో "చిత్తలూరు", "తుడిమిడి" గ్రామాలలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ గురువారం రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో వడ్ల ఉత్పత్తి పెరిగిందని, రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రా లలో గిట్టుబాటు ధర పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి,డిపిఎం మోహన్ రెడ్డి, ఏపీఎం శంకర్, సీసీ చంద్రయ్య, ప్యాక్స్ చైర్మన్ తాళ్లూరి మురళి, కాంగ్రెస్ మహిళ మండల అధ్యక్షురాలు ఎర్ర చైతన్య – రాజు, ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి, ఇన్చార్జ్ తహసిల్దార్ వరప్రసాద్, ఆర్ ఐ అజారుద్దీన్, సివిల్ సప్లై డిటి జ్యోతి, చిత్తలూరు సంఘ బంధం అధ్యక్షురాలు పీర్నాయకం కరుణ, కార్యదర్శి రాచమల్ల సైదమ్మ, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు ఎర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

## బనక చర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకుంటాం..మంత్రి ఉత్తమ్




కోదాడ పట్టణం లోని స్థానిక కాశీనాథం ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కోదాడ హుజూర్నగర్ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ నేతలు అపోహలు సృష్టిస్తున్నారని అన్నారు. నమస్తే అని మాటలతో ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు టిఆర్ఎస్ కుట్రకు తెర లేపిందన్నారు. బనకచర్ల విషయంలో రాజీ పడి ప్రసక్తే లేదని నిర్మాణాన్ని అడ్డుకునేందుకు న్యాయపోరాటం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఆధ్వర్యంలో చేస్తున్నామని అన్నారు. కేంద్ర జలశక్తిమంత్రికి స్వయంగా లేఖల ద్వారా తెలంగాణ రాష్ట్ర అభ్యంతరాలను తెలిపామన్నారు. ఆల్మట్టి ఎత్తు పెంచడానికి ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించమని తెలిపారు. కృష్ణా గోదావరి నది జల విషయాలలో తెలంగాణ హక్కులను రాష్ట్ర ప్రభుత్వం పరిరక్షిస్తుందని కృష్ణ జలాలలో 70% వాటా కోసం రాష్ట్ర ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తుందన్నారు. కృష్ణా జలాశయాలలో తెలంగాణ వాటా సాధించేందుకు రిగ్నల్కు మంత్రి హెూదాలో స్వయంగా సాని హాజరయ్యానన్నారు. మంత్రి హెూదాలో రిబ్బినలకు హాజరైన మొట్టమొదటి వ్యక్తిని తానేనని తెలిపారు. కృష్ణా జలాశయాలలో ఆంధ్రప్రదేశ్ కు 811 టిఎంసిలు తెలంగాణకు 2009 టిఎంసి లంటూ ఒప్పుకున్న చరిత్ర టిఆర్ఎస్ పాలకులదని అన్నారు. టిఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం తో సాగులోకి వచ్చింది నామమాత్రపు ఆయకట్టేనని పాలమూరు రంగారెడ్డి సీతారాములతో ఒరిగిన ప్రయోజనం ఏమీ లేదన్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఎస్ఎల్బీసీని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సూర్యాపేట జిల్లాకు దేవాదుల నీరు పారించాలన్నదే ప్రభుత్వ సంకల్పం అన్నారు. ధాన్యం దిగుబడిలో తెలంగాణ దేశంలో సంచలన రికార్డు నమోదు చేస్తుందని తెలంగాణ ఏర్పడ్డాక పదేళ్లపాటు రాని దిగుబడి ఈ రెండేళ్లలో రికార్డు స్థాయిలో వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి పరిశీలకులు సారత్ రౌత్, కోదాడ ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, పీసీసీ డెలిగేట్ లక్ష్మీనారాయణ రెడ్డి దొంగరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయం - అంతర్జాతీయం

## బోల్సొనారో గృహ నిర్బంధం సముచితం



బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సనారోకి గృహనిర్బంధం విధించినట్లు సుప్రీంకోర్టు జడ్జి అలెగ్జాండ్రే మోరేస్ సోమవారం తీర్పు ఇచ్చారు. 2022లో తిరిగి అధ్యక్షుడిగా ఎన్నికవడంలో విఫలమైన తర్వాత కుట్ర పన్నేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఒప్పించడానికి చేసిన ప్రయత్నాలకు సంబంధించి నిషేధ ఉత్తర్వులను పాటించడంలో విఫలమైనందుకు బోల్సనారో ఈ ఏడాది ఆగస్టు నుండి గృహనిర్బంధంలో ఉన్న సంగతి తెలిసిందే. మరో కేసులో బోల్సనారో దోషిగా నిర్ధారణకావడంతో పాటు గత నెలలో 27 సంవత్సరాల మూడు నెలల జైలుశిక్ష విధించబడింది. బోల్సనారోను గృహనిర్బంధం నుండి విడుదల చేయాలని ఆయన న్యాయవాదుల బృందం అభ్యర్థించింది. నిర్బంధానికి దారితీసన దర్యాప్తులో ఆయనపై ఎటువంటి అభియోగం నమోదు కాలేదని పేర్కొంది. అయితే ప్రతివాదుల వాదనలను జస్టిస్ మోరేస్ తోసిపుచ్చారు. బోల్సనారో గృహనిర్బంధం "ఆవశ్యకం మరియు సముచితం" అని జస్టిస్ మోరేస్ పేర్కొన్నారు.

## నౌకా నిర్మాణ సంస్థ హన్వాపై ఆంక్షలను ప్రకటించిన చైనా




దక్షిణ కొరియా నౌకా నిర్మాణ సంస్థ హన్వా ఓషన్‌కి చెందిన ఐదు అమెరికా సంబంధిత అనుబంధ సంస్థలపై చైనా మంగళవారం ఆంక్షలను ప్రకటించింది. దీంతో ఆ కంపెనీ షేర్లు మంగళవారం కుప్పకూలాయి. అమెరికా అదనపు పోర్ట్ ఫీజులకు ప్రతిగా చైనా ఫీజులను ప్రకటించిన తర్వాత హన్వా ఓషన్ షేర్లు 5.3శాతం పడిపోయాయి. హెచ్‌డి హుందారు హెవీ షేర్లు 4.4శాతానికి పడిపోయాయి. చైనాలోని సంస్థలు, వ్యక్తులు ఈ హన్వాతో ఎటువంటి లావాదేవీలు, సహకారం లేదా సంబంధిత కార్యకలాపాలలో పాల్గొనకుండా నిషేధం విధించినట్లు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. హన్వా ఓషన్ అమెరికా సంబంధిత అనుబంధ సంస్థలు అమెరికా దర్యాప్తు కార్యకలాపాలకు మద్దతు, సాయం అందించాయని పేర్కొంది. దీంతో చైనా సార్వభౌమాధికారం, భద్రత మరియు అభివృద్ధి ప్రయోజనాలను ప్రమాదంలో పడేశాయని ప్రకటన పేర్కొంది. తమ సముద్ర, లాజిస్టిక్స్, నౌకానిర్మాణ పరిశ్రమలను లక్ష్యంగా చేసుకుని అమెరికా తీసుకున్న చర్యలను అంతర్జాతీయ చట్టం మరియు అంతర్జాతీయ సంబంధాల ప్రాథమిక నిబంధనల తీవ్ర ఉల్లంఘనగా చైనా పేర్కొంది. ఆగస్టులో, హన్వా ఫిల్లీ షిప్‌యార్డ్‌లో 5బిలియన్ డాలర్ల అదనపు పెట్టుబడిని ప్రయోగించింది. దక్షిణ కొరియా తన దేశీయ పరిశ్రమను పునరుద్ధరించేందుకు అమెరికాకు 150 బిలియన్ డాలర్ల వరకు సాయం అందిస్తామని ప్రకటించిన తర్వాత 2024లో 100 మిలియన్ డాలర్లకు దానిని కొనుగోలు చేసింది. యుద్ధ నౌకల తయారీ కోసం చైనా కంటే వెనుకబడి ఉన్న ఫిల్లీ షిప్‌యార్డ్‌ను పునరుద్ధరించేందుకు జపాన్, దక్షిణ కొరియాల సాయం అవసమని ట్రంప్ యంత్రాంగం ప్రకటించిన తర్వాత హన్వా ఈ నిర్ణయం తీసుకుంది.

## బంగారం ధరల పెరుగుదలపై ఆర్పీజీ గ్రూప్ చైర్మన్ హర్ష్ గోయెంకా పోస్ట్



న్యూఢిల్లీ: సోషల్ మీడియాలో ప్రముఖ పారిశ్రామికవేత్త హర్ష్ గోయెంకా చేసిన ఒక పోస్ట్ ఇప్పుడు పెట్టుబడులపై ఆసక్తికరమైన చర్చకు దారి తీసింది. బంగారం ధరల పెరుగుదలను ఉద్దేశించి ఆయన చేసిన ట్వీట్‌కు ఒక నెటిజన్ ఇచ్చిన కౌంటర్ అందరినీ ఆలోచింపజేస్తోంది. బంగారం కంటే సరైన షేర్లలో పెట్టుబడి పెట్టడమే ఉత్తమమనే వాదనకు బలం చేకూర్చుతోంది. సియెట్ టైర్ల సంస్థతో పాటు పలు కంపెనీలకు అధిపతి అయిన ఆర్పీజీ గ్రూప్ చైర్మన్ హర్ష్ గోయెంకా, ఇటీవల 'ఎక్స్' వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. రోజురోజుకూ పెరుగుతున్న బంగారం ధరలను ప్రస్తావిస్తూ, 1980ల నుంచి ఇప్పటివరకు కిలో బంగారం విలువతో ఏయే కార్లు కొనవచ్చోపోల్చారు. ఇదేఒరవడి కొనసాగితే, 2030 నాటికి కిలో బంగారంతో రోల్స్ రాయిస్ కారు, 2040 నాటికి ఏకంగా ఒక ప్రైవేట్ జెట్ కూడా కొనుగోలు చేయవచ్చని చమత్కరించారు. "ఒక కిలోబంగారం దాచుకోండి" అంటూ ఆయన సరదాగా సలహా ఇచ్చారు. గోయెంకా పోస్ట్‌కు చాలా మంది నుంచి సానుకూల స్పందన వచ్చింది. అయితే, ఒక నెటిజన్ మాత్రం భిన్నమైన కోణంలో స్పందించి అందరి దృష్టిని ఆకర్షించారు. బంగారం పెట్టుబడి కన్నా, గోయెంకాకు చెందిన సియెట్ కంపెనీ షేర్లలో పెట్టుబడి పెడితే ఎంత లాభం వచ్చేదో లెక్కలతో సహా వివరించారు."2000 సంవత్సరంలో కిలో బంగారం ధర సుమారు రూ. 4.4 లక్షలు. ప్రస్తుతం దాని విలువ కోటి రూపాయలు దాటింది. అదే సమయంలో, ఆ రూ. 4.4 లక్షలను సియెట్ కంపెనీ షేర్లలో పెట్టుబడిగా పెట్టి ఉంటే, వాటి విలువ ఇప్పుడు సుమారు రూ. 4.5 కోట్లకు చేరేది" అని ఆ నెటిజన్ తన రిప్లైలో పేర్కొన్నారు.

## గాజా డిక్లరేషన్‌పై సంతకం చేసిన అమెరికా అధ్యక్షుడు




గాజాలో కాల్పుల విరమణను పటిష్టం చేయడానికి ఉద్దేశించిన డిక్లరేషన్‌పై తనతో పాటు ప్రాంతీయ నాయకులు సోమవారం సంతకం చేసినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఇది పశ్చిమాసియాకి ఒక అద్భుతమైన రోజని ప్రశంసించారు. ఇజ్రాయిల్ మరియు హమాస్ బందీలు మరియు ఖైదీల మార్పిడిని ప్రారంభించిన కొన్ని గంటల తర్వాత ట్రంప్ నుండి ఈ ప్రకటన వెలువడింది. ముందుగా ఇజ్రాయిల్ బందీలకు ఆయన స్వాగతం పలికారు. ఇది గొప్పరోజని, ఇది కొత్త ప్రారంభమని అన్నారు. రెండేళ్ల గాజా యుద్ధం ముగిసిందా అని మీడియా ప్రశ్నించగా.. అవును అని సమాధానమిచ్చారు. గాజా శాంతి ఒప్పందంపై చర్చించడానికి ట్రంప్ షర్మ్ ఎల్-షేక్‌లోని ఒక రిసార్ట్‌లో పలువురు ప్రపంచ నేతలతో సోమవారం సమావేశమైన సంగతి తెలిసిందే. చర్చల అనంతరం ట్రంప్, ఈజిప్ట్, ఖతార్ మరియు టర్కీ నేతలతో కలిసి గాజా ఒప్పందానికి హామీ దారులుగా ప్రకటనపై సంతకం చేశారు. ఈ ప్రకటన నియమాలు, నిబం ధనలను మరియు పలు అంశాలను వివరిస్తుందని సంతకం చేయడానికి ముందు ట్రంప్ అన్నారు. గాజా శాంతి ప్రణాళికలో రెండవ దశ ప్రారంభ మైదనది అన్నారు. దశలన్నీ ఒకదానితో ఒకటి కొద్దిగా మిశ్రమంగా ఉన్నాయని అన్నారు. హమాస్‌తో చర్చల్లో ఈజిప్ట్ అధ్యక్షుడు చాలా కీలక పాత్ర పోషించారని ట్రంప్ ప్రశంసలు కురిపించారు. అయితే ఈ శిఖరాగ్ర సమావేశానికి ఇజ్రాయిల్, హమాస్ ప్రతినిధులు హాజరుకాలేదు. పాలస్తీనా అధ్యక్షుడు మహమ్మూద్ అబ్బాసతో కూడా ట్రంప్ కొన్ని నిమిషాల పాటు సమావేశమయ్యారు. మొదటి దశలో భాగంగా ఇజ్రాయిల్, హమాస్‌ల మధ్య ఖైదీల, బందీల మార్పిడి ప్రారంభమైంది. ఇజ్రాయిల్ విడుదల చేసిన ఖైదీల్లో సుమారు 250 మంది భద్రతా ఖైదీలు ఉన్నారు. ఇజ్రాయిలీలను హత్య చేశారన్న ఆరోపణలపై వారిని నిర్బంధించింది. యుద్ధ సమయంలోనూ గాజాలో సుమారు 1700 మందిని ఇజ్రాయిల్ సైన్యం అదుపులోకి తీసుకుంది.

## అయోధ్యలో కొత్తగా ఎన్ఎస్‌జీ హబ్ ఏర్పాటు చేయనున్నట్లు అమిత్ షా ప్రకటన



న్యూఢిల్లీ: ఉగ్రవాదం, వ్యవస్థీకృత నేరాలకు వ్యతిరేకంగా నేషనల్ సెక్యూరిటీ గార్డ్ దేశానికి ఒక బలమైన రక్షణ కవచం లా పనిచేస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశం సించారు. హర్యానాలోని మానేసర్‌లో మంగళవారం జరిగిన ఎన్ఎస్‌జీ 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ భద్రత కోసం ప్రాణాలు అర్పించిన భద్రతా సిబ్బందికి ఆయన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అమిత్ షా కీలక ప్రకటన చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఎన్ఎస్‌జీ కొత్త హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ముంబై, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్, అహ్మదాబాద్, జమ్మూలలో హబ్‌లు ఉండగా, అయోధ్యతో వాటి సంఖ్య ఏడుకు చేరుకుంటుందని వివరించారు. దీనివల్ల ఉగ్రవాద ముప్పును వేగంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని ఆయన అన్నారు.అక్షరధామ్ ఆల యంపై దాడి, 26/11 ముంబై దాడులు, పలు బందీల విముక్తి ఆపరేషన్ల వంటి క్లిష్టమైన సమయాల్లో ఎన్ఎస్‌జీ చూపిన ధైర్యసాహసాలను ఆయన గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం 'జీరో టెర్రరిజం' విధానాన్ని అనుసరిస్తోందని అమిత్ షా స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు 2019 నుంచి యూఏపీఏ, ఎన్ఐఏ చట్టా లకు సవరణలు, టెర్రర్ ఫండింగ్‌ను అరికట్టేందుకు ఈడీ, పీఎంఎల్‌ఏకు అధి కారాలు, పీఎఫ్ఐపై నిషేధం వంటి అనేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్, ఆర్టికల్ 370 రద్దు వంటి చర్యలతో ఉగ్రవాదుల వెన్ను విరిచామని ఆయన పేర్కొన్నారు. 'ఆపరేషన్ సిందూర్', 'ఆపరేషన్ మహాదేవ్' వంటి ప్రత్యేక ఆపరేషన్ల ద్వారా ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామని, ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా తప్పించుకోలేరని హెచ్చరించారు. ఈ పర్యటనలో భాగంగా, రూ. 141 కోట్ల వ్యయంతో 8 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ప్రత్యేక శిక్షణా కేంద్రానికి అమిత్ షా శంకుస్థాపన చేశారు. ఇది కమాండోలకు అత్యాధునిక శిక్షణ అందించనుందని తెలిపారు. అలాగే, 2019 నుంచి సీఏపీఎఫ్ సిబ్బంది 6.50 కోట్ల మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడ్డారని ఆయన కొనియాడారు.

## పహల్గాం తరహాలో పాకిస్థాన్ మరో దాడి చేయొచ్చు



న్యూఢిల్లీ: భారత సైన్యానికి చెందిన పశ్చిమ కమాండ్ అధిపతి, లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ కుమార్ కటియార్ దాయాది దేశం పాకిస్థాన్‌కు తీవ్ర హెచ్చరిక చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీన జమ్మూ కాశ్మీర్ పహల్గాంలోని 26 మంది అమాయక పౌరుల ప్రాణాలు తీసిన ఉగ్రదాడి తరహా దుశ్చర్యకు పాకిస్థాన్ మరోసారి ప్రయత్నించే అవకాశం ఉందని చెబుతూనే.. ఆ పని చేస్తే ఆపరేషన్ సిందూర్ 2. అమలు చేస్తామని వివరించారు. అంతేకాకుండా సరిహద్దుల్లో ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడ్డా.. భారత్ నుంచి మరింత శక్తివంతమైన ప్రతీకారం ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పశ్చిమ సరిహద్దుల్లో ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టడానికి భారత్ చేపట్టిన భారీ కౌంటర్ టెర్రర్ ఆపరేషన్ అయిన 'ఆపరేషన్ సిందూర్' గురించి లెఫ్టినెంట్ జనరల్ కటియార్ మాట్లాడారు. 'ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు తగిన సమాధానం ఇచ్చామని అన్నారు. అయితే పాకిస్తాన్ తన దుష్ట మార్గాన్ని ఎప్పటికీ మార్చుకోలేదని చెప్పారు. అందుకే పహల్గాం తరహాలో మరో దాడికి పాకిస్థాన్ పాల్పడే ప్రమాదం ఉందని అన్నారు. ఈక్రమంలోనే పాక్ కదలికలన్నింటిపై మేము నిఘా పెట్టామని చెప్పారు. అంతటితో ఆగకుడా పాక్ సరిహద్దుల్లో మరోసారి దుస్సాహసానికి పాల్పడితే.. భారత్ నుంచి మరింత గట్టి సమాధానం ఎదుర్కోవాల్సి వస్తుందని లెఫ్టినెంట్ జనరల్ నొక్కి చెప్పారు. పాకిస్థాన్ తన స్వార్థ ప్రయోజనాల కోసం భారత దేశంతో ఘర్షణను కొనసాగించాలని కోరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. మరో దుశ్చర్యకు పాక్ పాల్పడకుండా ఉంటుందని తాను కచ్చితంగా చెప్పలేనని.. అందుకే భారత సైన్యం పూర్తి సన్నద్ధతతో ఉందని తెలిపారు. అంతేకాకుండా 'ఆపరేషన్ సిందూర్' ఇంకా ముగియలేదని కూడా స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ప్రారంభించిన ఈ ఆపరేషన్ సిందూర్ ప్రధాన లక్ష్యం నియంత్రణ రేఖ వెంబడి చొరబడే ఉగ్రవాద బృందాలను నిలువరించడం, అలాగే పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేయడం అని స్పష్టం చేశారు. ఈ నెల ప్రారంభంలోనే భారత వైమానిక దళాధిపతి, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ ఒక కీలక ప్రకటన చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత దాడుల్లో కనీసం పన్నెండు పాకిస్థానీ సైనిక విమానాలు ధ్వంసం అయ్యాయని చెప్పారు. భారత నష్టాలపై ఇస్లామాబాద్ చేస్తున్న వాదనలు 'కల్పిత కథలు' మాత్రమే అని కొట్టిపారేశారు. అలాగే భారత్ చేసిన వైమానిక దాడుల్లో పాకిస్థాన్‌కు చెందిన భారీ సంఖ్యలో సైనిక మౌలిక సదుపాయాలు నాశనం అయ్యాయని వివరించారు. వీటిలో మూడు ప్రాంతాలలో ఉన్న హ్యాంగర్లు, కనీసం నాలుగు ప్రాంతాలలో ఉన్న రాడార్లు, రెండు సైట్లలోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు, రెండు ఎయిర్ బేస్‌లలోని రన్‌వేలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆయన స్పష్టం చేశారు. మరోసారి భారత్‌పై దాడి చేస్తే ప్రపంచ పటంలో ఆ దేశమే లేకుండా చేస్తామని అన్నారు. ఇప్పుడు తాజాగా లెఫ్టినెంట్ జనరల్ వార్నింగ్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

## టికెట్ ఇచ్చే వరకు కదలను' సీఎం ఇంటి ముందు బైఠాయించిన సిట్టింగ్ ఎమ్మెల్యే

పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు అధికార, ప్రతిపక్ష కూటముల్లో టికెట్ల రచ్చ తారాస్థాయికి చేరింది. ముఖ్యంగా అధికార కూటమిలోని జేడీయూ పార్టీలో తీవ్ర అసంతృప్తి రాజుకుంది.సిట్టింగ్ స్థానం దక్కకపోవడంతో ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యే గోపాల్ మండల్ ఏకంగా ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నివాసం ఎదుటే బైఠాయించి నిరసన తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష కూటములు సీట్ల పంపకాలు, అభ్యర్థుల ఎంపికలతో బిజీగా ఉన్నాయి. మొదటి దశ పోలింగ్‌కు నామినేషన్ల దాఖలుకు మరో నాలుగు రోజులే గడువు ఉన్నప్పటికీ.. ఎన్డీయే, మహాఘట్ బంధన్ కూటములు ఇంకా తమ అభ్యర్థుల జాబితాలను పూర్తి స్థాయిలో ప్రకటించలేదు. ఈ క్రమంలోనే అధికార కూటమిలో భాగంగా జేడీయూ తన సిట్టింగ్ స్థానమైన గోపాల్‌పూర్‌ను మిత్రపక్షమైన బీజేపీకి కేటాయించింది. దీనితో ఆ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న జేడీయూ ఎమ్మెల్యే గోపాల్ మండల్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. తనకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని కోరుతూ గోపాల్ మండల్ మంగళవారం ఉదయం సీఎం నితీశ్ కుమార్ నివాసానికి వెళ్లారు. అయితే ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడంతో.. సెక్యూరిటీ సిబ్బంది ఆయన్ను లోపలికి అనుమతించలేదు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే గోపాల్ మండల్.. సీఎం నితీశ్ కుమార్ ఇంటి గేటు ముందు బైఠాయించి నిరసనకు దిగారు. ఉదయం 8.30 గంటల నుంచే తాను ఇక్కడ ఎదురు చూస్తున్నానని.. తనకు టికెట్ లభించే వరకు ఇక్కడ నుంచి కదిలేది లేదని తెగేసి చెప్పారు. నేను కచ్చితంగా ఎమ్మెల్యే టికెట్ పొంది తీరుతానని శపథం చేశారు. అది దక్కకుండా ఇక్కడ నుంచి అస్సలే వెళ్లనని ఆయన పట్టుబట్టారు. గోపాల్ మండల్ మాత్రమే కాకుండా.. వివిధ నియోజక వర్గాలకు చెందిన జేడీయూ కార్యకర్తలు కూడా సీఎం ఇంటి ముందు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొత్తులో భాగంగా బీజేపీ నేతలకు టికెట్లు ఇచ్చి.. తమ సొంత పార్టీ నేతలకు అన్యాయం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పోలీసులు సీఎం నివాసం చుట్టూ భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

## కొద్ది రోజుల్లో దేశమంతటా వీడ్కోలు పలకనున్న నైరుతిరుతుపవనాలు

దేశంలోని ఈశాన్య ప్రాంతం నుంచి నైరుతి రుతుపవనాలు మంగళవారం పూర్తిగా నిష్క్రమించినట్లు భారత వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. సరిగ్గా గతేడాది (2024) కూడా ఇదే తేదీన, అంటే అక్టోబర్ 14నే, రుతుపవనాలు ఈ ప్రాంతం నుంచి వెనుదిరగడం ఒక ఆసక్తికరమైన అంశం. ఈ నిష్క్రమణతో ఈశాన్య రాష్ట్రాల్లో వర్షాకాలం ముగిసి, శీతాకాలానికి అధికారికంగా తెరలేచినట్లయింది. వాతావరణ శాఖ అధికారి ఒకరు వెల్లడించిన వివరాల ప్రకారం, ఈశాన్యంలోని ఎనిమిది రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, అసోం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం, త్రిపురల నుంచి రుతుపవనాలు పూర్తిగా వెనుదిరిగాయి. దీని ప్రభావంతో ఆయా ప్రాంతాల్లో వాయువ్య దిశ నుంచి పొడి గాలులు వీయడం ప్రారంభమైందని, రానున్న రోజుల్లో గాలిలో తేమ తగ్గి, ఆకాశం చాలావరకు నిర్మలంగా ఉంటుందని తెలిపారు. ఈ మార్పులతో పర్వత ప్రాంతాలు రానున్న వారాల్లో చల్లటి, పొడి వాతావరణానికి సిద్ధమవుతున్నాయి.ఈ ఏడాది దేశంలోకి మే 24న కేరళ ద్వారా ప్రవేశించిన నైరుతి, రెండు రోజుల తర్వాత మే 26న ఈశాన్య ప్రాంతంలోకి అడుగుపెట్టింది. గత ఏడాదుల మాదిరిగానే ఈసారి కూడా ఈశాన్యంలో రుతుపవనాలు సాధారణంగానే ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. అయితే, అసోం, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ రాష్ట్రాల్లో మాత్రం రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది.

## గాజా శాంతి ప్రణాళిక ఒప్పందాన్ని ఉల్లంఘించిన ఇజ్రాయిల్



ఇజ్రాయిల్ గాజా శాంతి ప్రణాళిక ఒప్పందాన్ని ఉల్లంఘించి దాష్టీకానికి పాల్పడింది. ఇజ్రాయిల్ సైన్యం మంగళవారం జరిపిన కాల్పుల్లో ఆరుగురు పాలస్తీనియన్లు మరణించారు. ఉత్తర గాజాలోని తమ దళాలకు సమీపంగా వచ్చిన అనుమానితులపై కాల్పులు జరిపినట్లు ఇజ్రాయిల్ సైన్యం మంగళవారం తెలిపింది. అమెరికా మధ్యవర్తిత్వంలో కుదిరిన కాల్పుల విరమణ పథకం కింద ప్రారంభ ఉపసంహరణ సమయంలో.. ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ అనుమానితులు సరిహద్దును దాటారని ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది.ఈ ప్రాంతంలో ఇజ్రాయిల్ జరిపిన కాల్పుల్లో ఆరుగురు పాలస్తీనియన్లు మరణించినట్లు ఆరోగ్య అధికారులు తెలిపారు. మంగళవారం గాజా భూభాగంలో జరిగిన రెండు వేర్వేరు ఘటనల్లో ఇజ్రాయిల్ సైన్యం ఆరుగురు పాలస్తీనియన్లను చంపిందని గాజా స్థానిక ఆరోగ్య అధికారులు వెల్లడించారు. సోమవారం హమాస్ ఇజ్రాయిల్ బందీలను విడిచిపెట్టగా, ఇజ్రాయిల్ పాలస్తీనా ఖైదీలను పంపింది. పశ్చిమాసియా ప్రాంతాన్ని కుదిపేసిన రెండు సంవత్సరాల యుద్ధం ముగిసినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

## రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ సంచలన నిర్ణయం



పాట్నా: నా వ్యక్తిగత ఓటమితో నా రాజకీయ చాణక్య, విశ్వసనీయతకు దెబ్బతినొద్దు అనే భావనతో బీహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. హాజీపూర్ లేదా రఘోపూర్ లో పోటీ చెయ్యాలని మొదట నిర్ణయం. తన సంస్థ ఐప్యాక్ ద్వారా పలుమార్లు సర్వే చేసిన హాజీపూర్ లో మూడో స్థానం, తాను పుట్టి పెరిగిన గడ్డ రాఘోపూర్ అసెంబ్లీ నియోకవర్గంలో డిపాజిట్ గల్లంతు అయ్యే పరిస్థితి ఉంది అని నివేదిక రావడంతో తన ఓటమితో తన సంస్థకు, వ్యక్తిగత రాజకీయ విశ్వసనీయతకు మరింత నష్టం కలిగే అవకాశం ఉందని భావిస్తూ పోటీ చెయ్యడానికి దూరంగా ఉండాలని నిర్ణయం. 2026 ఎన్నికల కోసం తన ఐప్యాక్ సంస్థ పనిచేస్తున్న బెంగాల్, తమిళనాడు, తన ఓటమి ఆయా రాష్ట్రాలలో తాను పని చేస్తున్న రాజకీయ పార్టీల ప్రత్యర్థులకు అస్త్రంగా మారుతుందనే భావనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తాను సొంతంగా ఏర్పాటు చేసిన జన్ సురాజ్ పార్టీ బీహార్ లో 0 లేదా 1 స్థానం గెలిచే అవకాశం ఉన్నట్టు ఐప్యాక్ అంతర్గత సర్వేలో వెల్లడైంది. ప్రశాంత్ కిషోర్ బీహార్ రాష్ట్ర వ్యాప్తంగా తన పార్టీ తరుపున 665 రోజులలో 2,697 గ్రామాలలో ప్రశాంత్ కిషోర్ పాదయాత్ర చేశారు.

## ఎన్నికల ప్రచారంలో పారదర్శకతను పెంచే దిశగా కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ: ఎన్నికల ప్రచారంలో పారదర్శకతను పెంచే దిశగా కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సోషల్ మీడియా, వెబ్‌సైట్లు, ఎలక్ట్రానిక్ మీడియాలో ఇచ్చే ప్రతి ప్రకటనకు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఈసీ బుధవారం నూతన ఉత్తర్వులు జారీ చేసింది. బిహార్, జమ్మూ కశ్మీర్‌తో పాటు ఆరు రాష్ట్రాల్లోని ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు జరగనున్న ఉపఎన్నికల నేపథ్యంలో ఈ నిబంధనలను కఠినంగా అమలు చేయనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ప్రకటనల కంటెంట్‌ను పరిశీలించి, అనుమతులు ఇచ్చేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో 'మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీలు' ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. ఈ కమిటీల నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన తర్వాతే పార్టీలు, అభ్యర్థులు తమ ప్రకటనలను ప్రసారం చేయాల్సి ఉంటుంది.ఈ నిబంధన కేవలం ప్రకటనలకే పరిమితం కాదు. నామినేషన్ దాఖలు చేసే సమయంలోనే అభ్యర్థులు, పార్టీలు తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాలు, వెబ్ ప్లాట్‌ఫాంల వివరాలను ఎన్నికల సంఘానికి సమర్పించాలని ఆదేశించింది. అంతేకాకుండా, ప్రకటనల రూపకల్పన కోసం అయిన ఖర్చుతో సహా, ప్రచారానికి సంబంధించిన పూర్తి వ్యయ వివరాలను ఎన్నికలు ముగిసిన 75 రోజుల్లోగా సమర్పించాలని స్పష్టం చేసింది.వివిధ మీడియా మాధ్యమాలలో వచ్చే వార్తలను ఎంసీఎంసీ బృందాలు నిశితంగా గమనిస్తాయని, పెయిడ్ న్యూస్ అని అనుమానం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం హెచ్చరించింది. ఈ కొత్త నిబంధనలతో డిజిటల్ ప్రచారంపై పూర్తిస్థాయి నియంత్రణ తీసుకురావాలని ఈసీ లక్ష్యంగా పెట్టుకుంది.

# చక్కని ఆరోగ్యం

## బరువు తగ్గడం చాలా ఈజీ.. ఎప్పుడు తినాలో తెలుసా..?

త్వరగా బరువు తగ్గడానికి ఆహారంలో చేర్చుకోగల కొన్ని పదార్థాలు ఉన్నాయి. అదేవిధంగా దోసకాయ తినడం కూడా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అయితే బరువు తగ్గడానికి.. మీరు దోసకాయ తినడానికి సరైన సమయం, మార్గం తెలుసుకోవాలి. నేటి ఆధునిక జీవనశైలి, తప్పుడు ఆహారపు అలవాట్ల కారణంగా బరువు తగ్గడం, బెల్లీ ఫ్యాట్ తగ్గించడం చాలా మందికి పెద్ద సవాలుగా మారింది. అయితే నిపుణుల అభిప్రాయం ప్రకారం.. దోసకాయ బరువు తగ్గడానికి సహాయపడే అద్భుతమైన ఆహారం. దోసకాయను ఆహారంలో చేర్చుకోవడం చాలా సులభం. అంతేకాక ఇది బొద్దు కొవ్వును తగ్గించడంలో చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. అయితే చాలా మందికి దోసకాయను భోజనానికి ముందు తినాలా, తర్వాత తినాలా లేదా ఉదయం తినాలా అనే సందేహం ఉంది. దోసకాయల్లో 95శాతం వరకు నీరు ఉంటుంది. ఇది శరీరాన్ని హైడ్రేటెడ్ ఉంచుతుంది. దీంతో పాటు ఇందులో విటమిన్ కె, పొటాషియం, మెగ్నీషియం, అలాగే ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. కుకుర్బిటాసిన్ వంటి సమ్మేళనాలు ఇందులో ఉండి, శోథ నిరోధక లక్షణాలకు సహాయపడతాయి. బరువు తగ్గాలనుకునే వారికి పోషకాహార నిపుణులు తరచుగా దోసకాయను ఆహారంలో చేర్చుకోమని సిఫార్సు చేస్తారు. దోసకాయ తినడం వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. ఇందులో నీరు, ఫైబర్ అధికంగా ఉండటం వల్ల త్వరగా కడుపు నిండిన భావన కలుగుతుంది. దీనివల్ల భోజన సమయంలో తక్కువ కేలరీలను తీసుకుంటారు. బరువు నియంత్రణకు ఇది చాలా మంచి అలవాటు. భోజనం తర్వాత దోసకాయ తినడం ప్యాలెట్ క్లెన్సర్‌గా పనిచేస్తుంది. ఇది ఆమ్లతను తగ్గిస్తుంది. ఇందులో ఫైబర్ ఉండటం వల్ల ఉబ్బరం లేదా గ్యాస్‌కు కారణం కాదు. ఉదయం తినడం: రాత్రి నిద్ర తర్వాత శరీరం నీటిని కోల్పోతుంది. ఉదయం దోసకాయ తినడం వల్ల శరీరం వెంటనే హైడ్రేట్ అవుతుంది. ఇది రోజును శక్తివంతంగా ప్రారంభించడానికి సహాయపడుతుంది.రాత్రిపూట తినడం: రాత్రి దోసకాయ తినడం తేలికైన, తక్కువ కేలరీల చిరుతిండి. ఇందులో జీర్ణక్రియ సులభంగా ఉంటుంది. యాసిడ్ రిఫ్లక్స్‌తో బాధపడే వారికి ఇది కడుపుకు సున్నితంగా ఉండి, ఆమ్లత్వ సమస్యలను తగ్గిస్తుంది. దోసకాయ ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ అధికంగా తినడం మంచిది కాదు. రోజూ 1 నుండి 2 మీడియం సైజు దోసకాయలు తినడం సురక్షితమైనదిగా చెబుతారు. బరువు తగ్గడానికి పగటిపూట దీన్ని సలాడ్‌లు, స్మూతీలు లేదా స్నాక్‌గా తీసుకోవచ్చు. దోసకాయను సరైన సమయంలో ఆహారంలో చేర్చుకోవడం ద్వారా బరువు తగ్గడంలో మీరు మెరుగైన ఫలితాలు చూడవచ్చు.



## చేతులను ఎక్కువగా కడుగుతున్నారా..?

చేతులు కడుక్కోవడం మంచిదే, కానీ పదేపదే సబ్బు వాడితే ప్రమాదమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అతిగా కడగడం వల్ల మన చర్మంలోని మంచి నూనెలు పోయి, దురద, పొడిబారడం, తామర వంటి సమస్యలు వస్తాయి. చివరకు ఇన్ఫెక్షన్ రిస్క్ కూడా పెరుగుతుంది. కరోనా వచ్చిన తర్వాత పరిశుభ్రత పెరిగింది. ముఖ్యంగా చేతులు కడుక్కోవడంలో ఇక

అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే జరుపుకుంటారు. పరిశుభ్రత సందేశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి దీనిని నిర్వహిస్తారు. చేతులు కడుక్కోవడం అనేది అతి ముఖ్యమైన అలవాటు. ఇది విరేచనాలు, జలుబు, ఫ్లూ, కోవిడ్ వంటి అనేక వ్యాధుల నుండి మనల్ని రక్షిస్తుంది. తినడానికి ముందు, టాయిలెట్ తర్వాత, బయటి వస్తువులను తాకిన తర్వాత చేతులు కడుక్కోవడం ఎప్పుడూ మంచిదే. అయితే నిపుణులు దీనిపై ఒక హెచ్చరిక కూడా చేస్తున్నారు. తరచుగా చేతులు కడుక్కోవడం వల్ల కూడా మనకు హాని కలుగుతుంది. మనం సబ్బులు, హ్యాండ్ వాష్‌లను ఎక్కువగా ఉపయోగించినప్పుడు.. చర్మం యొక్క సహజ రక్షణ వ్యవస్థ దెబ్బ తింటుంది. చర్మంలోని సహజ నూనెలు, మంచి బ్యాక్టీరియా తొలగిపోతాయి. దీని వల్ల ఈ సమస్యలు వస్తాయి..చర్మం దురద: సబ్బుతో తరచుగా చేతులు కడగడం వల్ల చర్మం పై పొర తొలగిపోతుంది. దీనివల్ల చర్మం పొరలుగా మారుతుంది. దురదగా ఉంటుంది. కొన్ని సార్లు పగుళ్లు కూడా వస్తాయి. సహజ నూనె కోల్పోవడం: చర్మంలోని సహజ నూనెలు చేతులను సాఫ్ట్‌గా ఉంచుతాయి. తరచుగా కడగడం వల్ల ఈ నూనె తొలగిపోయి.. చర్మం పొడిగా, నిర్జీవంగా మారుతుంది. తామర సమస్య: ఇప్పటికే తామర సమస్య ఉన్నవారికి, తరచుగా చేతులు కడుక్కోవడం వల్ల సమస్య మరింత తీవ్రమవుతుంది. దీనివల్ల చేతులు చికాకుగా, ఎర్రగా మారతాయి. చర్మశోథ : చేతులను అతిగా కడుక్కోవడం వల్ల కాంటాక్ట్ చర్మశోథ వస్తుంది. దీని వలన చర్మం వాపు వస్తుంది. దురద, ఎరుపు రంగులోకి మారుతుంది.ఇన్ఫెక్షన్ ప్రమాదం : చర్మం పగిలి పోయినప్పుడు లేదా పగుళ్లు ఏర్పడినప్పుడు.. బ్యాక్టీరియా సులభంగా లోపలికి ప్రవేశిస్తుంది. ఇది నిజానికి ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదాన్ని మరింత పెంచుతుంది. చేతులు కడుక్కోవడం చాలా అవసరం. అయితే అవసరమైనప్పుడు మాత్రమే కడుక్కోవడం మేలు.ఎప్పుడు కడగాలి: టాయిలెట్ ఉపయోగించిన తర్వాత, తినడానికి ముందు, బయటి నుండి ఇంటికి వచ్చిన తర్వాత, అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని తాకిన తర్వాత, తుమ్మిన లేదా దగ్గిన తర్వాత. ఎలా కడగాలి: కనీసం 20 సెకన్ల పాటు సబ్బుతో, నీటితో శుభ్రం చేయాలి. వేళ్ల మధ్య, గోళ్ల కింద, చేతుల వెనుక భాగంలో బాగా శుభ్రం చేసుకోవాలి. మీరు మీ చేతి పరిశుభ్రతను పాటించాలి, కానీ అదే సమయంలో మీ చర్మాన్ని రక్షించుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యం.



## మిరియాలతో ఈ రోగాలన్నింటికి చెక్..



నల్ల మిరియాలు మన వంటగదిలో కేవలం రుచిని పెంచే మసాలా దినుసు మాత్రమే కాదు.. ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఔషధం కూడా. ఆ మీ దినచర్యలో ప్రతిరోజూ కేవలం 2 నల్ల మిరియాలను చేర్చుకోవడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. నల్ల మిరియాలలో మెగ్నీషియం, రాగి, ఐరన్, కాల్షియం, పాస్పరస్, పొటాషియం వంటి ముఖ్యమైన ఖనిజాలు, ఎ, కె, ఇ, బి గ్రూప్ విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంలో తోడ్పడతాయి. జీర్ణవ్యవస్థ – మలబద్ధకం: ప్రతిరోజూ రెండు నల్ల మిరియాలు తీసుకోవడం వల్ల మీ జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. ఇది పేగులను శుభ్రపరచడంలో, శరీరం నుండి విషాన్ని తొలగించడంలో సహాయ పడుతుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కడుపు మృదువుగా ఉండి, మలబద్ధకం, గ్యాస్ లేదా ఉబ్బరం వంటి సమస్యలు తగ్గి ఆకలి కూడా మెరుగుపడుతుంది. బరువు తగ్గడంలో: మీరు బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్నట్లయితే నల్ల మిరియాలు అద్భుతంగా పనిచేస్తాయి. వీటిలో ఉండే పైపెరిన్ అనే పదార్థం శరీర కొవ్వును తగ్గించి, జీవక్రియను వేగవంతం చేయడానికి సహాయపడుతుంది. జీవక్రియ పెరిగినప్పుడు, బరువు క్రమంగా తగ్గుతుంది.జలుబు, దగ్గుకు : జలుబు, దగ్గుకు నల్ల మిరియాలు ఒక శక్తివంతమైన సహజ నివారణ. పైపెరిన్ భాగం శరీరంలో వేడిని ఉత్పత్తి చేస్తుంది. ఇది దగ్గు ద్వారా ఉత్పత్తి అయ్యే కఫాన్ని మృదువుగా చేసి శరీరం నుండి బయటకు పంపడంలో సహాయ పడుతుంది. ఇది గొంతులో దురద, ముక్కు దిబ్బడ వంటి సమస్యల నుండి ఉపశమనం ఇస్తుంది. రక్తపోటు నియంత్రణ: రక్తపోటు సమస్య ఉన్నవారికి నల్ల మిరియాలు ప్రయోజన కరం. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు, పైపెరిన్ రక్త ప్రవాహాన్ని మెరుగుపరిచి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇది శరీరంలో సోడియం, కొలెస్ట్రాల్ స్థాయిలను సమతుల్యం చేయడానికి తోడ్పడుతుంది. తద్వారా రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. చర్మాన్ని మెరుగుపరుస్తుంది: నల్ల మిరియాలలో ఉండే సహజ పదార్థాలు చర్మానికి మేలు చేస్తాయి. ఇది చర్మంలోని అదనపు బ్యాక్టీరియాను, మెలనిన్‌ను నియంత్రిస్తుంది. తద్వారా చర్మంపై మచ్చలు, సంబంధిత సమస్యలు తగ్గుతాయి. యాంటీ–ఆక్సిడెంట్ లక్షణాలు చర్మాన్ని సూక్ష్మక్రిముల నుండి రక్షించి, ప్రకాశవంతంగా మరియు మృదువుగా ఉంచుతాయి. రోగనిరోధక శక్తి: మీ రోగనిరోధక శక్తి బలహీనంగా ఉంటే నల్ల మిరియాలను ఆహారంలో చేర్చుకోవడం మంచిది. పైపెరిన్, యాంటీ–ఆక్సిడెంట్ భాగాలు శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. ఇది బ్యాక్టీరియా, వైరస్‌లతో పోరాడి, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. కేవలం రెండు మిరియాలు మీ దినచర్యలో ఒక చిన్న భాగం అయినప్పటికీ, అవి మీ ఆరోగ్యానికి పెద్ద మేలు చేస్తాయని గుర్తుంచుకోండి.

## ఈ ఒక్క మ్యాజిక్ జ్యూస్ తాగితే చాలు!

కొన్ని కూరగాయలు కొన్ని తీవ్ర మైన వ్యాధులను నివారిస్తాయి. వాటిలో బీట్‌రూట్ ఒకటి. దీని నుండి తయారుచేసిన రసం ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఈ రసాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె సంబంధిత వ్యాధులు, ఆర్థరైటిస్, రుమాటిజం, కీళ్ల నొప్పుల వంటి ఎన్నో సమస్యలు తగ్గుతాయి. నేటి ఆధునిక జీవనశైలిలో జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండటం కష్టమే. అయితే ఆరోగ్యం దెబ్బతినకుండా ఉండాలంటే కూరగాయలు, పండ్ల వినియోగాన్ని పెంచడం చాలా ముఖ్యం. అలాంటి ఆరోగ్యకరమైన వాటిలో బీట్‌రూట్ రసం ఒకటి. తాగడానికి రుచికరంగా ఉండే ఈ జ్యూస్‌కు ఎన్నో వ్యాధులను నయం చేసే శక్తి ఉంది. బీట్‌రూట్ తినడానికి వెనుకాడే వారు కూడా ఈ జ్యూస్‌ను సులభంగా తయారు చేసుకుని, ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు.బీట్‌రూట్ రసం వివిధ రకాలుగా ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రక్తపోటు నియంత్రణ: గర్భధారణ సమయంలో అధిక రక్తపోటు ఉన్న మహిళలకు బీట్‌రూట్ రసం చాలా సహాయపడుతుంది. రోజుకు రెండు సార్లు 100 మి.లీ రసం తీసుకోవడం వల్ల తల్లికి, బిడ్డకు మంచి ఆరోగ్యం లభిస్తుంది. ఈ రసం రక్త ప్రసరణ, సరఫరాకు అత్యంత మంచిది. వారం పాటు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా గుండె జబ్బుల ప్రమాదం కూడా తగ్గుతుంది. క్రీడాకారులు కూడా దీనిని తీసుకోవడం ఉత్తమం. కాలేయ శుద్ధి: బీట్‌రూట్ రసం కాలేయాన్ని శుభ్రపరు స్తుంది. కాలేయం ఓవర్‌లోడ్ అయినప్పుడు శరీరం లేదా నోటి నుండి దుర్వాసన వస్తుంది. అలాంటి వారు ఒక నెల పాటు ఈ రసాన్ని తాగడం వల్ల కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది. కీళ్ల నొప్పుల ఉపశమనం: ఆర్థరైటిస్, రుమాటిజం, కీళ్ల నొప్పులతో బాధపడేవారు వారం పాటు క్రమం తప్పకుండా ఈ రసం తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.



## తాటికల్లు ఆరోగ్యమేనా?

తాటి కల్లు.. పల్లెటూర్లలో చాలా మంది తాగుతూ ఉంటారు. చాలా మంది ఇప్పటికీ తాటి కల్లు తాగుతూ ఉంటారు. వివిధ అనారోగ్య సమస్యలను తగ్గించడానికి కూడా ఈ కల్లు తాగుతారు. తాటి కల్లు తాగడం వల్ల ఆరోగ్యానికి కూడా చాలా మంచిదని చెబుతూ ఉంటారు. మరి తాటి కల్లు తాగడం మంచిదేనా? తాటి చెట్టు నుంచి కుండలోకి వచ్చిన ద్రావణాన్ని కల్లు అంటారు. ఈ నీరా చాలా టేస్టీగా ఉంటుంది. పలు రకాల ఆరోగ్య సమస్యల్ని కూడా తగ్గిస్తుంది. కల్లు తాటి చెట్టు నుంచి తీసిన 12 గంట ల్లోనే తీసుకోవాలి. ఆ తర్వాత ఇది విషంగా మారు తుంది. ఇలా సేకరించిన 100 ఎమ్ఎల్ కల్లులో 75 క్యాలరీలు ఉంటాయి. ఇందులో ఉండే కార్బోహైడ్రేట్స్ కూడా సుక్రోజ్ రూపంలో ఉంటాయి. కాబట్టి దీన్ని షుగర్ ఉన్న వారు తీసుకుంటే.. చాలా మంచిది. రక్తంలో చక్కెర స్థాయిలు కూడా పెరగవు.పలువురు పోషకాహార నిపుణులు సైతం కల్లు తాగడం చాలా మంచిదని చెబుతున్నారు. ఈ నీరాను వెంటనే తీసుకుంటే మత్తు లేకుండా ఉంటుంది. సమయం గడిచే కొద్దీ ఆల్కహాల్ శాతం పెరుగుతుంది. అయితే ఈ కల్లు పులవకుండా ఉండటానికి కొంతమంది ఇందులో క్యాల్షియం హైడ్రా క్సైడ్ అనే రసాయన్ని కలుపుతారు. దీంతో కల్లులో ఆల్కహాల్ శాతం మరింత పెరుగుతుంది. ఇలా రసాయనాలు కలిపిన కల్లు తాగడం వల్ల శరీరంపై చెడు ప్రభావం కలుగుతుంది. ఇలా ఆల్కహాల్ శాతం పెరిగి, మత్తు ఇచ్చే కల్లును తాగడం వల్ల ఎన్నో రకాల దుష్ప్రభావాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇది శరీరంలోని ఊపిరి తిత్తులు, కాలేయాన్ని, గుండెపై తీవ్ర ప్రభావం చూపించి.. పాడయ్యేందుకు తోడ్పడుతుంది.



## పాదాలలో ఆరోగ్య గుట్టు..

మన శరీరం ఇచ్చే చిన్న చిన్న సంకేతాలను మనం తేలిగ్గా తీసుకోకూడదు. మీ పాదాలు వాపుగా, బరువుగా అనిపించినా, నొప్పి, తిమ్మిరి వచ్చినా లేదా రంగు, ఉష్ణోగ్రత మారినా.. వాటిని తేలిగ్గా తీసుకోవద్దు. ఈ లక్షణాలు ఎందుకు వస్తాయి..? వీటిని నిర్లక్ష్యం చేస్తే గుండె, స్ట్రోక్ వంటి ప్రాణాంతక సమస్యలకు ఎలా దారితీస్తుంది..? మన శరీరం ఇచ్చే చిన్న చిన్న సంకేతాలను మనం పెద్దగా పట్టించు కోం. కానీ కొన్ని లక్షణాలు పదే పదే కనిపిస్తే మాత్రం వాటిని విస్మరించ డం చాలా ప్రమాదకరం. ముఖ్యంగా రక్త ప్రసరణ సరిగా లేకపోవడం అనేది ప్రాణాంతక సమస్యలకు దారి తీయవచ్చు. రక్త ప్రసరణ లోపం యొక్క ముఖ్య మైన సంకేతాలు మన పాదాలలో కనిపిస్తాయి. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో లేదా ఎక్కువసేపు నిలబడిన తర్వాత మీ పాదాలు, చీలమండలలో వాపు వస్తే, అది రక్త ప్రసరణ సరిగా లేకపోవడానికి సంకేతం. వైద్య పరిభాషలో దీనిని ఎడెమా అంటారు. రక్త ప్రసరణ మందగించడం వల్ల రక్తం, ఇతర ద్రవాలు పాదాలలో పేరుకుపోయి.. అవి బరువుగా, వాపుగా అనిపిస్తాయి. కొన్నిసార్లు గట్టి బూట్లు ధరించడం కూడా రక్త ప్రసరణను అడ్డుకుంటుంది. మీరు రోజూ నడుస్తున్న పుడు లేదా రాత్రి నిద్రలో మీ కాళ్ళలో తరచుగా నొప్పి, తిమ్మిరి లేదా జలదరింపు వస్తుంటే ఇది రక్త ప్రసరణ లోపమే కావచ్చు. రక్త నాళాలలో రక్త ప్రవాహం సరిగా లేక పోవడం వల్ల, కండరాలకు తగినంత ఆక్సిజన్, పోషకాలు అందవు. దీనివల్ల నొప్పి, తిమ్మిరి వస్తాయి. మీరు నడుస్తు న్నప్పుడు కాళ్ళలో నొప్పి వచ్చి, ఆగిన వెంటనే నొప్పి తగ్గితే, దానిని క్లాడికేషన్ అంటారు. ఇది రక్త ప్రసరణ సరిగా లేకపోవడానికి అత్యంత సాధారణ లక్షణం. మీ పాదాలు, ముఖ్యంగా కాలి వేళ్లు చల్లగా అనిపించడం లేదా పాదాల రంగు నీలం, ఊదా లేదా ఎరుపు రంగు లోకి మారడం వంటివి రక్త ప్రసరణ లోపానికి సంకేతాలు. రక్త ప్రసరణ సరిగా లేకపోతే పాదా లకు తగినంత వేడి అందదు, అందుకే చల్లగా ఉంటాయి. పాదంలో గాయం అయినప్పుడు అది మానడానికి ఎక్కువ సమయం తీసుకుంటే అప్రమ త్తంగా ఉండాలి. గాయం నయం కావడా నికి అవసర మైన ఆక్సిజన్, పోష కాలు అందకపోవడమే దీనికి కారణం. మీరు ఈ లక్షణాలలో దేనినైనా నిరంతరం అనుభవిస్తే, వాటిని విస్మరించకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి. రక్త ప్రసరణ సరిగా లేకపోవ డం అనేది గుండె జబ్బులు, స్ట్రోక్ లేదా కణజాలం చని పోయే గ్యాంగ్రీన్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారి తీయవచ్చు. సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా తీవ్ర పరిణామాల నుండి మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.






# బిజినెస్



## మళ్లీ దిగొచ్చిన టోకు ద్రవ్యోల్బణం..



టోకు ద్రవ్యోల్బణం గత నెలలో మరింత దిగొచ్చింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ మంగళవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, సెప్టెంబర్ నెలకు సంబంధించి టోకు ధరల సూచీ ఆధారిత (డబ్ల్యూపీఐ) ద్రవ్యోల్బణం 0.13 శాతానికి తగ్గించింది. అంతకుముందు ఆగస్టులో డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం 0.52 శాతంగా నమోదైన సంగతి తెలిసిందే. సమీక్షించిన నెలలో టోకు ద్రవ్యోల్బణం సానుకూలంగా నమోదవడానికి ప్రధానంగా ఆహార పదార్థాలు, ఉత్పత్తులు, తయారీ, ఆహారేతర వస్తువులు, రవాణా పరికరాల ధరలు పెరగడమే కారణం. ఆహార పదార్థాల ధరలు 1.38 శాతం, ఆహారేటర వస్తువుల ధరలు 1.06 శాతం క్షీణించాయి. ముడి పెట్రోలియం, సహజ వాయువు 0.64 శాతం పెరిగాయి. కూరగాయల ధరలు ఆగస్టులో 14.18 శాతం ఉండగా, అక్కడి నుంచి సెప్టెంబర్‌లో 24.41 శాతం తగ్గాయి. ఇంధన, విద్యుత్ ద్రవ్యోల్బణం 0.14 శాతంతో స్వల్పంగా తగ్గాయని గణాంకాలు వెల్లడించాయి. ఆహార, ఆహారేతర ఉత్పత్తులు, రవాణా పరికరాలు, దుస్తుల తయారీ ధరల పెరుగుదల కారణంగా గత నెలలో టోకు ద్రవ్యోల్బణంలో సానుకూల ఉందని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## ఫేస్ బుక్ యూజర్లకు గుడ్ న్యూస్..

ఫేస్ బుక్ ఒకప్పుడు ప్రపంచంలోనే ఎక్కువ మంది ఉపయోగించిన సోషల్ మీడియా ప్లాట్ ఫామ్. ప్రస్తుతం యూజర్లు తగ్గినా 40 ప్లస్ వాళ్లు చాలా మంది ఈ యాప్ ప్రతిరోజు వినియోగిస్తుంటారు. అయితే యూత్ మాత్రం దీని తరవాత వచ్చిన ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ ఎక్కువగా వినియోగిస్తూ ఫేస్ బుక్‌లో అసలు అకౌంట్ కూడా ఓపెన్ చేయడం లేదు. అయితే అలాంటి వారిని ఆకర్షించేందుకు ఒకప్పుడు ఉన్న లోకల్ జాబ్స్ ఫీచర్‌ని మళ్లీ తీసుకువచ్చింది. ఫేస్ బుక్ మాతృసంస్థ మెటా ప్రకారం ఈ ఫీచర్ ఉద్యోగం కోసం వెతికే వారికి, యజమానులకు ముఖ్యంగా స్థానికంగా ఉద్యోగాలను వెతికేందుకు ఉపయోగపడుతుంది. ఫేస్ బుక్ మెసెంజర్ ద్వారా ఉద్యోగ ఖాళీలు సెర్చ్ చేయడం, ఆయా కంపెనీలు మరియు సంస్థలకు సందేశాలు పంపడం లాంటివి చేయవచ్చు. మెసెంజర్‌లోని మార్కెట్ ప్లేస్ ట్యాబ్‌కు వెళ్లి ఉద్యోగాలను ఎంచుకోవచ్చు. ఎలాంటి ఉద్యోగం కావాలి, ఎంత దూరంలో ఉండాలి అనేది కూడా ఫిల్టర్ చేసుకోవచ్చు. అంతేకాకుండా ఇందులో ఉద్యోగాలు ఓపెన్‌గా ఉంటాయని, పబ్లిక్‌గా కనిపిస్తాయని మెటా వెల్లడించింది. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికీ ఉద్యోగాలకు సంబంధించిన వివరాలు కనిపిస్తాయని పేర్కొంది. సాధారణంగా ఉద్యోగాలు వెతుక్కునేందుకు లింక్డ్ ఇన్ అనే యాప్ ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఇందులో ఎక్కువగా కార్పొరేట్ రేంజ్ ఉద్యోగాలు కనిపిస్తుంటాయి. కానీ స్థానికంగా ఉండే చిన్న చిన్న ఉద్యోగాలను వెతికేందుకు సరైన ప్లాట్ ఫామ్ అందుబాటులో లేదు. దీంతో ఫేస్ బుక్ ఈ ఫీచర్ పై దృష్టిపెట్టింది. అయితే గతంలోనూ ఈ ఫీచర్ ఉండగా తరవాత తొలగించి ఇప్పుడు మళ్లీ తీసుకువచ్చింది.



## యూకే ప్రభుత్వ ఆరోగ్య సంస్థ నుంచి ఇన్ఫోసిస్‌కు భారీ కాంట్రాక్టు

భారత ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ అంతర్జాతీయంగా మరో భారీ విజయాన్ని అందుకుంది. యునైటెడ్ కింగ్‌డమ్ప్రభుత్వానికి చెందిన నేషనల్ హెల్త్ సర్వీస్ నుంచి ఏకంగా 1.2 బిలియన్ పౌండ్ల విలువైన మెగా కాంట్రాక్టును దక్కించుకుంది. ఈ ఒప్పందం 15 సంవత్సరాల పాటు కొనసాగనుందని ఇన్ఫోసిస్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ కాంట్రాక్టులో భాగంగా ఇన్ఫోసిస్.. ఇంగ్లండ్, వేల్స్‌లోని ఎన్ హెచ్ ఎస్ ఉద్యోగుల కోసం 'ఫ్యూచర్ ఎన్ హెచ్ ఎస్ వర్క్‌ఫోర్స్ సొల్యూషన్' పేరుతో ఒక అత్యాధునిక, డేటా ఆధారిత మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేయనుంది. ప్రస్తుతం వాడుకలో ఉన్న పాత ఎలక్ట్రానిక్ స్టాఫ్ రికార్డ్ సిస్టమ్ స్థానంలో ఈ కొత్త వ్యవస్థను ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా ఎన్ హెచ్ ఎస్‌లో పని చేస్తున్న సుమారు 19 లక్షల మంది ఉద్యోగులకు సంబంధించిన నియామకాలు, జీత భత్యాలు, కెరీర్ అభివృద్ధి, పదవీ విరమణ వంటి అన్ని అంశాలను ఇన్ఫోసిస్ నిర్వహించనుంది. ఏటా 55 బిలియన్ పౌండ్ల విలువైన పేరోల్ చెల్లింపుల బాధ్యతను ఈ కొత్త ప్లాట్‌ఫామ్ చూసుకుంటుంది. ఈ ఒప్పందంపై ఎన్ హెచ్ ఎస్ బిజినెస్ సర్వీసెస్ అథారిటీ సీఈఓ మైఖేల్ బ్రాడీ స్పందిస్తూ, "ఇది కేవలం పాత సిస్టమ్‌ను మార్చడం మాత్రమే కాదు. ఆరోగ్య రంగంలో పదేళ్ల ప్రణాళికను విజయవంతం చేసేందుకు, భవిష్యత్ అవసరాలకు తగ్గ సిబ్బందిని తయారు చేయడంలో ఈప్రాజెక్టు ఒక కీలక ముందడుగు" అని వివరించారు. ఇన్ఫోసిస్‌తో కలిసి పనిచేయడం ద్వారా తమ ఉద్యోగులను ఆకర్షించడానికి, వారిని ప్రోత్సహించడానికి ఒక ఆధునిక పరిష్కారాన్ని రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు.



## నిరాశపర్చిన టెక్ మహీంద్రా.. క్యూ2లో తగ్గిన లాభం

ప్రముఖ ఐటీ సేవల సంస్థల్లో ఒకటైన టెక్ మహీంద్రా నిరాశపరిచింది. ఈ ఆర్థిక సంవత్సరం 2025-26 రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో అంచనాలను అందుకోలేక పోయింది. మంగళవారం స్టాక్ మార్కెట్లు ముగిసిన తర్వాత ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ఇయర్ ఆన్ ఇయర్ ప్రాతిపదికన రెండో త్రైమాసికంలో టెక్ మహీంద్రా నికర లాభం రూ.1194 కోట్లుగా నమోదు చేసింది. అయితే, గత ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన కంపెనీ నికర లాభం రూ.1250 కోట్లతో పోలిస్తే 4.4 శాతం మేర పడిపోయింది. ప్రాఫిట్ ఆఫ్టర్ ట్యాక్సును కంపెనీ ఓనర్లకు ఆపాదించింది. ఇక జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో కంపెనీ ఆపరేషన్స్ రెవెన్యూ రూ.13,995 కోట్లుగా నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లోని రెండో త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.13,313 కోట్లతో పోలిస్తే ఈ సారి ఆదాయం 5.1 శాతం మేర పెరిగినట్లు తెలిపింది. ఆర్థిక ఫలితాల క్రమంలోనే తమ షేర్ హోల్డర్లకు శుభవార్త అందించింది. ఈ ఆర్థిక సంవత్సరం 2025-26కు గానూ మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఒక్కో షేరుకు రూ.15 చొప్పున డివిడెండ్ చెల్లిస్తామని వెల్లడించింది. ఇందుకు సంబంధించిన రికార్డ్ తేదీని అక్టోబర్ 21, 2025గా నిర్ణయించినట్లు తెలిపింది. ఆలోపు షేర్లు కొనుగోలు చేసి ఉన్న వారికి డివిడెండ్ పొందేందుకు అర్హత లభిస్తుంది. ఇక త్రైమాసికాల ప్రాదిపదికన చూసుకుంటే టెక్ మహీంద్రా నికర లాభం ఈ ఏడాది తొలి త్రైమాసికం (ఏప్రిల్- జూన్)లోని రూ.1141 కోట్లతో పోలిస్తే 4.7 శాతం పెరిగింది. ఇక కంపెనీ ఆదాయం 4.8 శాతం పెరిగింది. ఇక కంపెనీ ఎర్నింగ్స్ బిఫోర్ ఇంట్రెస్ట్ అండ్ ట్యాక్సెస్ రూ.1699 కోట్ల వద్ద ఉంది.



## మళ్లీ పెరిగిన బంగారం, వెండి ధరలు..

మన ఇంట్లో ఏ చిన్న శుభకార్యం జరిగినా బంగారం కొనుగోలు చేస్తుంటాము. ఇక అందులోనూ మన దేశంలో గోల్డ్‌కి మరింత పాపులారిటీ ఎక్కువ. ఇక ఈ మధ్య కాలంలో బంగారం ధరల్లో హెచ్చు తగ్గులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఒకరోజు రేట్లు తగ్గి కాస్త ఊరటనిస్తుంటే మరోరోజు పెరిగి అమ్మో అనిపిస్తున్నాయి. అయితే గత ఇరవై రోజులుగా పెరుగుతూ వస్తున్న గోల్డ్ రేట్స్ నేడు కూడా భారీగా పెరిగి బిగ్ షాకిచ్చాయి. ఇక ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడలో నిన్న రూ.1,17,650 ఉన్న 22 క్యారెట్ల బంగారం ధరపై నేడు రూ.500 పెరిగి రూ.1,18,150గా ఉంది. అలాగే నిన్న రూ.1,28,350 ఉన్న 24 క్యారెట్ల బంగారం ధరపై నేడు రూ.540 పెరిగి రూ.1,28,890కు చేరుకుంది. ఇక అటు వెండి ధర రూ.1000 పెరిగి కిలో రూ.2,07,000గా ఉంది. కాగా దాదాపు రెండు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలు ఇవే ఉన్నాయి.



## ధోనీ పరువు నష్టం దావాలో కీలక మలుపు



భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ దాఖలు చేసిన రూ.100 కోట్ల పరువు నష్టం దావా కేసులో మద్రాసు హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జి. సంపత్ కుమార్ దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణ పూర్తి చేసిన న్యాయస్థానం, మంగళవారం తన తీర్పును రిజర్వులో ఉంచింది. దీంతో ఈ వివాదంలో త్వరలోనే ఒక కొలిక్కి వచ్చే అవకాశం కనిపిస్తోంది. 2014లో ఐపీఎల్ బెట్టింగ్, స్పాట్ ఫిక్సింగ్ కుంభకోణంలో తన పేరును అనవసరంగా ప్రస్తావించారని ఆరోపిస్తూ ధోనీ మద్రాసు హైకోర్టును ఆశ్రయించాడు. అప్పటి ఐపీఎస్ అధికారి సంపత్ కుమార్ పైనా, జీ మీడియా కార్పొరేషన్, జర్నలిస్ట్ సుధీర్ చౌదరి, న్యూస్ నేషన్ నెట్‌వర్క్‌లపైనా రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేశాడు. అయితే, ఈ దావాను కొట్టివేయాలని కోరుతూ సంపత్ కుమార్ 2021లో ఒక పిటిషన్ దాఖలు చేశారు. దావా వేసిన ఏడేళ్ల తర్వాత, విచారణ ప్రారంభమయ్యే ముందు ఈ పిటిషన్ వేయడాన్ని తప్పుబట్టిన సింగిల్ జడ్జి జస్టిస్ ఎన్. శేషసాయి, 2021 డిసెంబర్ 9న దానిని కొట్టివేశారు. న్యాయ ప్రక్రియను ఆలస్యం చేసేందుకే ఇలాంటి పిటిషన్లు దాఖలు చేస్తున్నారని ఆనాడు న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. శాఖాపరమైన విచారణలో తనకు క్లీన్‌చిట్ లభించిందన్న వాదన, కేసు విచారణలో ఒక రక్షణగా ఉపయోగపడుతుందే తప్ప, దావాను పూర్తిగా కొట్టివేయడానికి అది కారణం కాదని స్పష్టం చేశారు. అయితే, సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సంపత్ కుమార్ తాజాగా డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ ఏడాది ఆగస్టు 11న ఈ కేసు విచారణ ప్రారంభం కావడంతో, ఆయన ఈ అప్పీల్‌ను దాఖలు చేశారు. మంగళవారం జస్టిస్ ఎస్.ఎం. సుబ్రమణియం, జస్టిస్ ఎం. జోతిరామన్లతో కూడిన ధర్మాసనం ఇరుపక్షాల వాదనలను విన్నది. ధోనీ తరఫున సీనియర్ న్యాయవాది పి.ఆర్. రామన్, సంపత్ కుమార్ తరఫున న్యాయవాది ఆర్.సి. పాల్ కనగరాజ్ తమ వాదనలు వినిపించారు. వాదనలు ముగియడంతో, ధర్మాసనం ఈ అప్పీల్‌పై తుది తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

## రెండో టెస్టులో ఫీల్డర్‌గా మిగిలిపోయిన నితీష్ కుమార్ రెడ్డి..

ఇంగ్లండ్ టూర్ నుంచి అర్ధంతరంగా డ్రాప్ అయిన నితీష్ కుమార్ రెడ్డి వెస్టిండీస్ టెస్టు సిరీస్‌లో చోటు దక్కించుకున్నాడు. అహ్మదాబాద్ వేదికగా జరిగిన మొదటి టెస్టులో ఆడిన రెడ్డి అంతగా ప్రభావం చూపలేకపోయాడు. అయితే, ఢిల్లీలో జరిగిన రెండో టెస్టులో బ్యాటింగ్‌లో రాణించినప్పటికీ.. బౌలింగ్ విషయంలో టీమిండియా తీసుకున్న నిర్ణయం ఇప్పుడు అందర్నీ షాక్‌కు గురి చేస్తోంది. వెస్టిండీస్‌తో ఢిల్లీలో జరిగిన రెండో టెస్టులో భారత జట్టులో చోటు దక్కించుకున్న ఆల్‌రౌండర్ నితీష్ రెడ్డి ఒక్క ఓవర్ కూడా వేయకపోవడం అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. ఇదే విషయమై మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా కూడా ప్రశ్నలు లేవనెత్తాడు. రెండు ఇన్నింగ్స్‌లలో భారత బౌలర్లు మొత్తం 200 ఓవర్లు విసరగా, ఆల్‌రౌండర్‌గా ఎంపికైన నితీష్‌కి మాత్రం ఒక్క బంతి కూడా ఇవ్వలేదు. ఆఖరికి జైస్వాల్ కూడా బౌలింగ్ చేయగా, నితీష్ కుమార్ రెడ్డికి మాత్రం అవకాశం ఇవ్వలేదు. ఈ నిర్ణయం వెనుక ఉన్న ఉద్దేశం ఏంటో ఎవరూ అర్థం చేసుకోలేక పోతున్నారు. వెస్టిండీస్ మొదటి ఇన్నింగ్స్‌లో 248 పరుగులకే ఆలౌట్ అవ్వడంతో భారత్ ఫాలో ఆన్ విధించింది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ బ్యాటర్లు అద్భుతంగా రాణించి భారత బౌలర్లను తీవ్రంగా ఇబ్బంది పెట్టారు. జాన్ క్యాంప్‌బెల్ (115), షై హోప్ (103) సెంచరీలతో అద్భుత ప్రతిఘటన కనబరిచారు. దాంతో కెప్టెన్ శుభమన్ గిల్ తరచూ బౌలింగ్ మార్పులు చేసినా ఫలితం కనిపించలేదు. విండీస్ చివరకు 390 పరుగులు చేసి భారత్‌కు 121 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.



## మళ్లీ మైదానంలోకి మహమ్మద్ షమీ

2023 వన్డే ప్రపంచకప్ తర్వాత టీమిండియాకు దూరమైన సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ, ఎట్టకేలకు తిరిగి మైదానంలో అడుగుపెడుతున్నాడు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా పర్యటనకు తన ఎంపిక చేయకపోవడంపై అతను చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. తాను పూర్తి ఫిట్‌గా ఉన్నానని, అయితే జట్టులోకి తీసుకోవడం తన చేతుల్లో లేదని షమీ స్పష్టం చేశాడు. బుధవారం నుంచి ఉత్తరాఖండ్‌తో ఈడెన్ గార్డెన్స్‌లో ప్రారంభం కానున్న రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో బెంగాల్ తరఫున షమీ బరిలోకి దిగుతున్నాడు. మ్యాచ్‌కు ముందు మీడియాతో మాట్లాడిన అతను, "నాలో ఫిట్‌నెస్ సమస్యలు ఉంటే ఇక్కడ ఉండేవాడిని కాదు. నాలుగు రోజుల మ్యాచ్ ఆడగలిగినప్పుడు, 50 ఓవర్ల మ్యాచ్ కూడా ఆడగలను" అని ధీమా వ్యక్తం చేశాడు. టీమిండియాకు తనను ఎంపిక చేయకపోవడంపై షమీ సూటిగా స్పందించాడు. "జట్టులో చోటు దక్కకపోవడం నా తప్పు కాదు. నా పని సిద్ధమవడం, మ్యాచ్‌లు ఆడటం మాత్రమే. అవకాశాలు వచ్చినప్పుడల్లా నేను బెంగాల్ తరఫున ఆడాను. నన్ను ఎంపిక చేస్తే ఆడటానికి సిద్ధంగా ఉన్నాను. ఇందులో ఎలాంటి సమస్య లేదు" అని అన్నాడు. అంతేకాకుండా, తన ఫిట్‌నెస్ గురించి సెలక్టర్లకు లేదా జట్టు యాజమాన్యానికి సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత తనపై లేదని షమీ తేల్చిచెప్పాడు. "నా ఫిట్‌నెస్‌పై ఎవరికీ అప్‌డేట్ ఇవ్వాల్సిన అవసరం నాకు లేదు. అది నా బాధ్యత కాదు. నా పని నేను చేస్తాను. అప్‌డేట్స్ ఎప్పుడు ఇవ్వాలనేది యాజమాన్యం లేదా సెలక్టర్లు నిర్ణయిస్తారు" అని ఘాటుగా వ్యాఖ్యానించాడు. గాయం కారణంగా చాలా కాలం ఆటకు దూరమైనా, ఈ విరామాన్ని పూర్తిగా కోలుకోవడానికి ఉపయోగించుకున్నానని షమీ తెలిపాడు. "గాయంతో బాధపడుతూ జట్టును ఇబ్బంది పెట్టడం నాకు ఇష్టం లేదు. సర్జరీ తర్వాత బలంగా తిరిగి రావాలనుకున్నాను. గత రెండున్నర నెలలుగా కఠినంగా ప్రాక్టీస్ చేస్తున్నాను. సుదీర్ఘ స్పెల్స్ వేశాను. ప్రస్తుతం పూర్తి ఫిట్‌గా ఉన్నాను" అని వివరించాడు. దేశం గెలవడమే ముఖ్యమని, జట్టు కోసం అత్యుత్తమ బౌలర్లనే ఎంపిక చేయాలని అతను అభిప్రాయపడ్డాడు.



# ఆట

## గిల్, గంభీర్‌లకు క్లాస్ తీసిన ఆల్‌రౌండర్

వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో భారత్ 2-0 తేడాతో విజయం సాధించింది. ఈ సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేసిన రవీంద్ర జడేజా సిరీస్ హీరోగా నిలిచాడు. ఇది జడేజా కెరీర్‌లో మూడోసారి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు గెలుచుకున్న సందర్భం. అయితే ఈ అవార్డు అందుకున్న తర్వాత జడేజా కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ముఖ్యంగా టీం ఇండియా కాంబినేషన్, తన పాత్రపై పరోక్షంగా అసంతృప్తిని వ్యక్తం చేశాడు. శుభ్‌మన్ గిల్ ఎంపికపై కూడా జడేజా సూచనాత్మక వ్యాఖ్యలు చేశాడు. జడేజా మాట్లాడుతూ, 'నాకు బౌలింగ్ చేసే అవకాశాలు కొంచెం ఎక్కువగా రావాలి. కానీ మేం ఒక జట్టుగా బాగా రాణిస్తున్నాం. గత ఐదు-ఆరు నెలలుగా మా బ్యాటింగ్, బౌలింగ్ రెండూ మెరుగుపడ్డాయి. జట్టు ప్రదర్శన చూసి సంతోషంగా ఉంది. ఇది మంచి సంకేతం' అని అన్నాడు. అలాగే గౌతమ్ గంభీర్ తనకు 6వ స్థానంలో బ్యాటింగ్ చేసే బాధ్యత ఇచ్చాడని, అందుకే తాను ఇప్పుడు ప్రధానంగా బ్యాట్స్‌మన్‌గా ఆలోచిస్తున్నానని జడేజా వివరించాడు. 'ఇప్పుడే నేను 6వ స్థానంలో బ్యాటింగ్ చేస్తున్నాను. అందుకే నా ఆలోచనా విధానం కొంచెం మారింది. గతంలో 7వ లేదా 8వ స్థానాల్లో ఆడే వాడిని. ఇప్పుడు క్రీజులో ఎక్కువ సమయం గడపడానికి ప్రయత్నిస్తున్నాను. నిజాయితీగా చెప్పాలంటే, నేను రికార్డుల గురించి కాకుండా జట్టుకు ఎంత బాగా ఉపయోగపడగలనో ఆలోచిస్తాను' అని ఆయన స్పష్టం చేశాడు. జడేజా తన కెరీర్‌లో మూడవసారి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు గెలుచుకోవడం విశేషం. 2017లో ఆస్ట్రేలియాపై, 2023లో మళ్లీ ఆస్ట్రేలియాపై, ఇప్పుడు 2025లో వెస్టిండీస్‌పై ఈ ఘనత సాధించాడు.



## ఆటగాళ్లు సెలక్టర్లకు భయపడకూడదు

సెలక్టర్ల నియామకంలో, ముఖ్యంగా దేశవాళీ స్థాయిలో సమూల మార్పులు చేయాల్సిన అవసరముందని భారత బ్యాటర్ అజింక్య రహానె అభిప్రాయపడ్డాడు. ఇటీవలే రిటైర్ అయిన ఫస్ట్ క్లాస్ ఆటగాళ్లకు మాత్రమే జట్లను ఎంపిక చేసే బాధ్యతను అప్పగించాలన్నాడు. ఆట తీరులో వస్తున్న మార్పులకు అనుగుణంగా వారు నిర్ణయాలు తీసుకునే అవకాశముందన్నాడు. ప్రస్తుతం కనీసం 10ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన అనుభవంఉండి, రిటైర్ అయి ఐదు సంవత్సరాలు దాటిన ఏ క్రికెటర్ అయినా స్టేట్ సెలక్టర్‌గా దరఖాస్తు చేసుకోవడానికి వీలుంది. 'ఆటగాళ్లు సెలక్టర్లకు భయపడకూడదు. నేను వారి గురించి మాట్లాడాలనుకుంటున్నాను. ముఖ్యంగా దేశవాళీ క్రికెట్‌లో సెలక్షన్ కమిటీ నియామకంలో మార్పులు జరగాలి. ఇటీవల అత్యుత్తమ స్థాయిలో క్రికెట్ ఆడి రిటైర్ అయిన వారిని సెలక్టర్లుగా నియమించాలి. అంతేకాని ఎప్పుడో రిటైర్ అయిన వారిని ఎంపిక చేయొద్దు. ఎందుకంటే క్రికెట్‌లో చాలా మార్పులు వస్తున్నాయి. దానికి అనుగుణంగా సెలక్టర్ల మైండ్‌సెట్ మారాల్సిన అవసరముంది.



# సినిమా

# అలాంటి సీన్స్ చేయడానికి భయపడ్డాను



బాలీవుడ్ యంగ్ హీరోయిన్ సోనమ్ బజ్వా వరుస సినిమాలతో బ్లాక్ బస్టర్ హిట్స్‌ను తన ఖాతాలో వేసుకుంటుంది. ఇటీవల 'హౌస్‌ఫుల్-5' మూవీతో సూపర్ హిట్ అందుకుంది.ప్రస్తుతం 'ఏక్ దివానేకి దివానీయత్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. హర్షవర్ధన్ హీరోగా నటిస్తున్న ఈ మూవీ అక్టోబర్ 21న విడుదల కానుంది. ఈ క్రమంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సోనమ్ ఆసక్తికర కామెంట్స్ చేసింది. "పంజాబ్‌లో అందరూ ఒకే అంటారా అని ఆలోచించి.. నేను బాలీవుడ్‌లో కొన్ని ఆఫర్లను వదులుకున్నాను.మా ఇంట్లో వాళ్ళు కూడా చూస్తారు కదా అనే మనస్తత్వం నాకు ఉంది. ఆ సమయంలో కిస్సింగ్ సీన్స్ చేయడానికి నేను చాలా భయపడ్డాను. ప్రజలు దానికి ఎలా స్పందిస్తారు? నన్ను మార్చిన నా కుటుంబం ఎలా స్పందిస్తారు? ఇది కేవలం సినిమా కోసమే అని నా కుటుంబం అర్థం చేసుకుంటుందా? అనే ప్రశ్నలు నా మనసులో చాలా మెదిలాయి. చాలా రోజులు అలాంటి ఆలోచనలతోనే సతమతమయ్యాను. రెండు సంవత్సరాల క్రితం నేను చివరికి మా అమ్మానాన్నలతో దీని గురించి మాట్లాడాను. దానికి వారు 'అవును, అది సినిమా కోసమే అయితే పర్వాలేదు' అని అన్నారు. అది విన్న తర్వాత నేను చాలా షాక్ అయ్యాను. ఆ తర్వాత నేను ఆలోచిస్తూనే ఉన్నాను. నేను వారితో ఎందుకు ముందుగా మాట్లాడలేదా? అని ఫీల్ అయ్యాను. చాలా ఆలోచనలు పెట్టుకొని దాని గురించి ప్రస్తావించడానికి కూడా నేను సిగ్గుపడ్డాను. కానీ వారు మాత్రం ఇది సినిమా కోసం కాబట్టి మాకు ఎటువంటి సమస్య లేదు నటించమని చెప్పారు. అందుకే అప్పటినుంచి ఎలాంటి పాత్రలైనా చేయాలని డిసైడ్ అయ్యాను. విభిన్న పాత్రలో నటించాలని ఉంది" అని చెప్పుకొచ్చింది.

## మైక్ ఉంది కదా అని ఎలా పడితే అలా మాట్లాడకూడదు

ఈ మధ్య కాలంలో సినిమా ప్రెస్ మీట్స్‌లో రిపోర్టర్స్ ప్రశ్నలు ఎక్కువగా వివాదాలకు దారితీస్తున్నాయి. రీసెంట్‌గా ప్రదీప్ రంగనాథన్, కిరణ్ అబ్బవరం కామెంట్స్ వైరల్ కాగా.. తాజాగా సిద్ధు జొన్నలగడ్డ కూడా మీడియాపై ఫైర్ అయ్యాడు. ఆయన నటిస్తున్న 'తెలుసు కదా' చిత్రం అక్టోబర్ 17న రిలీజ్ కావాల్సి ఉండగా.. ఇటీవల ఓ ప్రెస్ మీట్‌లో పాల్గొన్న సిద్ధుకు 'మీరు రియల్ లైఫ్‌లో ఉమనైజరా?' అంటూ ఓ ప్రశ్న ఎదురైంది. దీనిపై తాజాగా స్పందించిన సిద్ధు జొన్నలగడ్డ.. 'నాకు మీ ప్రశ్నలకు ఎలా స్పందించాలో కూడా అర్థం కాలేదు. అలా మాట్లాడటం చాలా డిస్‌రెస్పెక్ట్‌ఫుల్. మైక్ ఉంది కదా అని అలా ప్రశ్నలు అడిగి మళ్లీ నవ్వుతున్నారు. అసలు ఆ రిపోర్టర్ లాస్ట్ మినిట్‌లో కాల్ చేసి అడిగితే రమ్మని చెప్పాము. మైక్ ఉంది కదా అని అలాంటి ప్రశ్నలు అడగటం కరెక్ట్ కాదు. ఇక నేను దీని మీద ఏమని స్పందించాలి.. నేను ఇలాంటి విషయంలో డిస్కషన్ చేయాలి అనుకోను. నిజానికి అసలు రేసులో ఉందా లేదా అనుకున్న పరిస్థితి నుంచి, నిన్న ట్రైలర్‌కి వచ్చిన పాజిటివ్ రెస్పాన్స్ తర్వాత అంతా పాజిటివ్‌గా మారిపోయింది. అయినా సినిమాలో పోలీస్‌లా కనిపిస్తే నిజజీవితంలో పోలీస్‌లా ఉంటారా.. అలాగే క్రిమినల్ అయితే క్రిమినల్ అవుతారా.. ఏదైనా సినిమా వరకే ఉంటుంది.. మీ దగ్గర మైక్ ఉందని, మేము ఆన్సర్ ఇచ్చే పోజిషన్‌లో ఉన్నామని ఏది పడితే అది అడిగితే ఎలా' అంటూ ఫైర్ అయ్యాడు సిద్ధు.



# వంశీ పైడిపల్లి... తగ్గేదేలే



కొందరు దర్శకులు స్టార్ ఇమేజ్ సంపాదించినా సరే.. ప్రతిసారీ సినిమా స్థాయిని చూసుకోకుండా అందుబాటులో ఉన్న హీరోతో సినిమా చేసుకుంటూ వెళ్లిపోతుంటారు. ఫలానా హీరోనే కావాలి, సినిమా అంటే ఒక రేంజ్ ఉండాలి అని ఆలోచించరు. కానీ కొందరు దర్శకులు మాత్రం ఈ విషయంలో పర్టికులర్‌గా ఉంటారు. కెరీర్లో గ్యాప్ వచ్చినా పర్వాలేదు.. టైం వేస్టయినా ఓకే.. చేస్తే భారీ చిత్రమే చేయాలి, టాప్ హీరోలతోనే జట్టు కట్టాలి అని ఫిక్సయిపోయి ఉంటారు. వంశీ పైడిపల్లి ఆ కోవకే చెందుతాడు. తొలి సినిమా 'మున్నా' ఫ్లాప్ అయినా సరే.. అతను అగ్రశ్రేణి కథానాయకులతోనే సినిమాలు చేస్తున్నాడు. టాలీవుడ్లో టాప్ స్టార్స్ అందుబాటులో లేదంటే ఇంకో ఇండస్ట్రీకి వెళ్తున్నాడు తప్ప.. మిడ్ రేంజ్ సినిమాలే చేయట్లేదు. 'మహర్షి' తర్వాత మహేష్‌తో చేయాల్సిన మరో సినిమా క్యాన్సిల్ అయినా నిరాశ చెందకుండా వెయిట్ చేసి తమిళ నంబర్ వన్ హీరో విజయ్‌తో 'వారిసు' తీశాడు వంశీ. ఆ సినిమా ఓ మోస్తరుగా ఆడగా.. తర్వాతి సినిమాకు మళ్లీ గ్యాప్ వచ్చింది. తర్వాత అతడి చూపు బాలీవుడ్ మీద పడ్డట్లు తెలుస్తోంది. ఆమిర్ ఖాన్‌తో సినిమా అన్నారు. కానీ అది కార్యరూపం దాల్చలేదు. అలా అని అతను ముంబయి వదిలి వచ్చేయలేదు. ఇంకో అగ్ర కథానాయకుడు సల్మాన్ తలుపు తట్టాడు. కొంత కాలంగా ఆయనతో కథా చర్చలు జరుగుతున్నాయి. ఎట్టకేలకు సినిమా ఓకే అయినట్లు వార్తలు వస్తున్నాయి. వంశీ అంటే దిల్ రాజు ఆస్థాన దర్శకుడన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని కూడా రాజే ప్రొడ్యూస్ చేయబోతున్నాడట. 'వారిసు' మిక్స్ టాక్ తెచ్చుకున్నా సరే.. రాజుకు లాభాలే వచ్చాయి. దీంతో వంశీ తర్వాతి సినిమాను ప్రొడ్యూస్ చేయడానికి కూడా ఆయన రెడీగా ఉన్నాడు. సల్మాన్ మార్కెట్ కొంత దెబ్బ తిన్నా సరే అంత పెద్ద స్టార్‌తో సినిమా చేసే అవకాశాన్ని దిల్ రాజు వదులుకునే అవకాశం లేదు. మరి ఈ సినిమా అయినా పక్కాగా ఉంటుందా.. దీని గురించి ప్రకటన వస్తుందా అన్నది తెలియాలంటే కొన్ని రోజులు వెయిట్ చేయాల్సిందే.

# రష్మిక మందన్న మీదే భారమంతా



వచ్చే వారం అక్టోబర్ 21 బాలీవుడ్ మూవీ థామా విడుదల కానుంది. హిందీతో పాటు తెలుగు డబ్బింగ్ వెర్షన్ ని సమాంతరంగా రిలీజ్ చేస్తున్నారు. కారణం రష్మిక మందన్న. గతంలో ఇదే నిర్మాణ సంస్థ మాడాక్ ఫిలిమ్స్ తీసిన స్త్రీ 2ని అనువదించలేదు. కానీ శ్రీవల్లి క్రేజ్ ని దృష్టిలో పెట్టుకుని థామాని ఇతర భాషల్లో తీసుకొస్తున్నారు. హారర్ బ్యాక్ డ్రాప్ లో దెయ్యాల సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా రూపొందించిన ఈ హారర్ డ్రామాలో ఆయుష్మాన్ ఖురానా హీరోగా నటించాడు. ట్రైలర్ లో చాలా కంటెంట్ చూపించారు కానీ ఆశించిన హైప్ సోషల్ మీడియాలో కనిపించడం లేదు. ఆడియన్స్ ఎగ్జైట్ మెంట్ తక్కువగానే ఉంది.ఈ నేపథ్యంలో భారమంతా రష్మిక మందన్న మీదే పడుతోంది. కేవలం తన వల్లే ఓపెనింగ్స్ వస్తాయని కాదు కానీ ఆయుష్మాన్ ఇమేజ్ మరీ పెద్ద స్థాయిలో లేకపోవడం వల్ల జానర్ అడ్వాంటేజ్ పనికి వస్తుందని మేకర్స్ భావిస్తున్నారు. అయితే హిందీ ప్రేక్షకుల్లో ఈ దెయ్యాల సినిమాల మీద క్రమంగా ఇంటరెస్ట్ తగ్గుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. అందుకే హైప్ అంతగా ఏర్పడలేదని అభిప్రాయపడుతున్నారు. అక్కడేమో కానీ మన దగ్గర స్ట్రెయిట్ సినిమాల హడావిడి చాలా ఉంది. దీపావళికి ఏకంగా నాలుగు రిలీజులు అవి కూడా యూత్ ఫుల్ మూవీస్ కావడంతో వారం పది రోజులు థియేటర్లలో సందడి ఉంటుంది. సో థామా ఖచ్చితంగా స్త్రీ 2లాగా ఎక్స్ ట్రాడినరి టాక్ తెచ్చుకోవాల్సిందే. గత మూడేళ్లుగా రష్మిక మందన్నకు ఒక్క సల్మాన్ ఖాన్ సికందర్ తప్ప అన్నీ బ్లాక్ బస్టర్లే పడ్డాయి. పుష్ప 2, యానిమల్, చావా ఒకదాన్ని మించి మరొకటి రికార్డుల బూజు దులిపాయి. కుబేర కూడా హిట్టు క్యాటగిరీలో పడింది.

## అక్టోబర్ 19న అసలు సీక్రెట్ బయటపడుతుంది..



సక్సెస్, ఫ్లాప్స్‌లతో సంబంధం లేకుండా ప్రజెంట్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్న యంగ్ బ్యూటీ శ్రీలీల.. తాజాగా తన ఇన్‌స్టా వేదికగా ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టింది. ఓ స్టైలిష్ పోస్టర్ షేర్ చేస్తూ.. 'రెడీ.. స్టడీ.. ఫైర్.. ఏజెంట్ మిర్చిగా శ్రీలీల' అనే కోట్స్ పెట్టింది. ఇందులో బ్లాక్ కాస్ట్యూమ్, గాగుల్స్‌తో కనిపించిన శ్రీలీల లుక్ చూసి ఒక్కసారిగా షాక్ అవుతున్నారు ఫ్యాన్స్. అంతే కాకుండా.. ఈ పోస్ట్‌కు 'అక్టోబర్ 19న అసలు సీక్రెట్ బయటపడుతుంది' అనే క్యాప్షన్ జత చేయడంతో ఇది సినిమాకి సంబంధించిన పోస్టరా? లేక వెబ్ సిరీస్ ప్రమోషనా? అంటూ చర్చలు స్టార్ట్ చేశారు ప్రేక్షకులు. అయితే.. ఇండస్ట్రీ నుంచి అందుకున్న సమాచారం మేరకు ఇది ఓ హిందీ ప్రాజెక్ట్ అయ్యే అవకాశం ఉందట. ఈ ప్రాజెక్ట్‌తో శ్రీలీల పాన్ ఇండియా స్థాయిలో అడుగుపెట్టనున్నట్లు తెలుస్తుండగా.. ఇది ఆమె కెరీర్‌కు కీలక మలుపు కావచ్చని టాక్. ప్రజెంట్ ఈ పోస్ట్ వైరల్ అవుతుండగా.. శ్రీలీల లుక్‌కు ఫిదా అవుతున్నారు ఫ్యాన్స్. కాగా.. అసలు ఏజెంట్ మిర్చి రహస్యం ఏంటీ.. అక్టోబర్ 19న ఏం జరగబోతున్నది అనేది త్వరలో తెలియనుంది.

# వివాదంలో చిక్కుకున్న కాజోల్..



ఇటీవల సెలబ్రిటీ టాక్ షోలో పాల్గొన్న బాలీవుడ్ బ్యూటీ కాజోల్ నటీనటుల పనితీరును.. కార్పొరేట్ ఉద్యోగస్థులతో పోల్చగా ప్రస్తుతం అవి చర్చుకు దారి తీశాయి.ఈ క్రమంలోనే మరోసారి వీటిపై క్లారిటీ ఇచ్చింది కాజోల్. 'ఉద్యోగాలు వేరు.. నటన వేరు. ఎందుకంటే షూటింగ్ సమయంలో నటీనటులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి..మేము ది ట్రయిల్ రెండో సీజన్ కోసం ఒక ప్రాంతానికి వెళ్లాం. 40 రోజులు బ్రేక్ లేకుండా షూటింగ్‌లో పాల్గొన్నాము. ఆ రోజుల్లో మేం ఎప్పుడూ అందుబాటులో ఉండేవాళ్లం. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి, అలాగే సరిగ్గా మేంటేన్ చేస్తూ ఎప్పుడూ ఒకే లుక్‌లో కనిపించాలి. అలా ఉండడం చాలా ఒత్తిడిగా ఉంటుంది.

# కాంతారను కాపాడిన కోర్టు తీర్పు



బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తున్న కాంతార చాప్టర్ 1 ఏ లెజెండ్ ఇంకా థియేటర్ రన్ బలంగా కొనసాగిస్తూనే ఉంది. తెలుగులో నెమ్మదించినప్పటికీ మళ్లీ దీపావళికి పికప్ అవుతుందన్న నమ్మకం బయ్యర్లలో కనిపిస్తోంది. ఇదిలా ఉండగా ఈ సినిమా విడుదలకు ముందు కర్ణాటక ప్రభుత్వం తీసుకొచ్చిన ధరల నియంత్రణ జిఓ మీద హొంబాలే ఫిలిమ్స్ తో పాటు మల్టీప్లెక్స్ అసోసియేషన్ కోర్టుకు వెళ్లడం, వాళ్లకు అనుకూలంగా వాయిదా తీర్పు రావడం చేసిన మేలు అంతా ఇంతా కాదు. ఇప్పటిదాకా శాండల్ వుడ్ లో కాంతారా చాప్టర్ 1 వసూలు చేసిన గ్రాస్ సుమారు 160 కోట్లకు పైనే ఉంటుందని అక్కడి ట్రేడ్ రిపోర్ట్. ఒకవేళ జిఓ యథాతథంగా అమలైపోయి టికెట్ రేట్ 200, 236 రూపాయలు మించకపోయి ఉంటే ఇప్పుడొచ్చిన మొత్తంలో కనీసం 50 కోట్లకు పైగా చిల్లు పడేదని ఓపెన్ గా చెప్పేస్తున్నారు. అంటే ఒక పెద్ద ఏరియాకు పాడుకున్నంత సొమ్ము ఇది. ఈ రకంగా చూసుకుంటే న్యాయస్థానం జడ్జ్ మెంట్ వల్ల కాంతారా చాలా పెద్ద ప్రయోజనం పొందింది. ఎందుకంటే బెంగళూరు మల్టీప్లెక్సుల్లో స్క్రీన్లు, వసతులను బట్టి 500 నుంచి 2000 రూపాయల దాకా టికెట్ రేట్లు ఉన్నాయి. అవన్నీ తగ్గించుకోవాల్సి వచ్చేది. తీర్పుకు ముందు దాన్ని పాటించారు కూడా. ఆ కొంత టైంలోనే జనాలు తక్కువ ధరల్లో ఎంజాయ్ చేశారు. అయితే కోర్టు ఇచ్చింది తాత్కాలిక ఉపశమనం మాత్రమే. త్వరలో జరగబోయే వాయిదాలో సిద్దరామయ్య సర్కార్ తమవైపు వాదనలతో సిద్ధంగా ఉంది. ఒకవేళ అవి బలంగా ఉంటే జీవో మళ్లీ తిరగదోడే అవకాశాలు లేకపోలేదు.

# రాష్ట్ర బంద్ కు బిఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటన**

**కేటీఆర్ కు విజ్ఞాపన పత్రం అందజేసిన బిసి జేఏసీ నేతలు**

**హాజరైన చైర్మన్ ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ విజిఆర్ నారగోని, కో చైర్మన్ రాజారామ్ యాదవ్**

హైదరాబాద్,అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి): ఈనెల 18న బీసీ జేఏసీ తలపెట్టిన బంద్ ఫర్ జస్టిస్ కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. అలవి కాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ బీసీలను నయవంచన చేస్తుందని ఆయన ఆరోపించారు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో అనేక సందర్భాల్లో మద్దతు ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు అయితే కాంగ్రెస్ పార్టీకి 42% రిజర్వేషన్లు బీసీలకు ఇచ్చే చిత్తశుద్ధి లేదని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర బంద్ కు వివిధ పార్టీల మద్దతు కూడగడుతున్న బీసీ జేఏసీ నేతలు, మంగళవారం ఉదయం టిఆర్ఎస్ పార్టీ మద్దతు కోరారు అందులో భాగంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజారామ్ యాదవ్ మాట్లాడుతూ.. 42 శాతం రిజర్వేషన్ సాధన కోసమే బందుకు పిలుపునిచ్చామని ఏ పార్టీకి ఏ వర్గానికి తాము వ్యతిరేకం కాదని అన్నారు. దశాబ్దాలుగా తీవ్రమైన అన్యాయానికి గురైతున్న బీసీలుగా తమకు రావలసిన న్యాయమైన వాటా కోసం బందుకు పిలుపునిచ్చామని ఈ సందర్భంగా గుర్తు చేశారు.



రాజ్యాంగాన్ని సవరించడము ఒకటే ఏకైక మార్గమని దానికోసం ఇటు రాష్ట్రము అటు కేంద్రము జోక్యం చేసుకొని రాజ్యాంగపరమైన రక్షణలు బీసీలకు కల్పించాల్సిన అవసరం ఉందని రాజారామ్ యాదవ్ అన్నారు. న్యాయమైన ఈ డిమాండ్ ను సాధించేందుకు కులాలు, సంఘాలు, పార్టీలకతీతంగా ఏకం కావలసిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, బీసీ జేఏసీ చైర్మన్ ఆర్ కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్,
వైస్ చైర్మన్ వీజీఆర్ నారగోని, కో చైర్మన్ రాజారామ్, బీసీ జేఏసీ కోఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు పిట్ల శ్రీధర్, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం జనరల్ సెక్రెటరీ మేకల కృష్ణ, వివిధ కుల సంఘాలు బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం

**ఆష్ బయోటిక్ 2025" కాన్ఫరెన్స్ లో కీలకోపన్యాసం చేసే అవకాశం**



హైదరాబాద్,అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి): రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం దక్కింది. లైఫ్ సైన్సెస్ రంగంలో 'ఆసియా–పసిఫిక్' ప్రాంతంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పరిగణించే "%ూబందీఅశీవఎష్ట్ర% ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 2025"లో కీలకోపన్యాసం చేసే అవకాశం లభించింది. ఈ నెల 21 నుంచి 24 వరకు ఆస్ట్రేలియా లైఫ్ సైన్సెస్ అత్యున్నత నిర్ణాయక సంస్థ "%ూబందీఅశీవఎష్ట్ర%", విక్టోరియా రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త నిర్వహణలో మెల్ బోర్న్ లో జరగనున్న ఈ ప్రతిష్ఠాత్మక సదస్సులో భారత్ నుంచి ప్రసంగించే అవకాశం ఆయనకు మాత్రమే దక్కింది. రెండేళ్లలో తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగం సాధించిన పురోగతి, భవిష్యత్తు ప్రణాళికలు, అవకాశాలు, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అనుకూలతలపై ఆయన ప్రసంగించనున్నారు. ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ బుధవారం మంత్రి శ్రీధర్ బాబును ప్రత్యేకంగా కలిసి ఆహ్వానించారు. సీఎం రేవంత్ రెడ్డి మార్గ నిర్దేశంలో "గ్లోబల్ ఫార్మా, బయో టెక్నాలజీ, మెడ్‌టెక్" ఆవిష్కరణ హబ్ గా తెలంగాణ ను తీర్చి దిద్దేందుకు మంత్రి శ్రీధర్ బాబు చేస్తున్న కృషిని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. "ఆస్ట్రేలియా – తెలంగాణ" మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు చొరవ చూపాలని కోరారు. "ఈ ఆహ్వానం లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ సాధించిన పురోగతికి అంతర్జాతీయ స్థాయిలో దక్కిన గౌరవం. ప్రపంచవ్యాప్తంగా ఏడు అగ్రశ్రేణి లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో హైదరాబాద్ ఒకటిగా నిలిచింది. ఈ జాబితాలో స్థానం దక్కించుకున్న ఏకైక భారతీయ నగరం మనదే. ఈ రంగంలో కొత్తగా రూ. 63వేల కోట్ల పెట్టుబడులను తీసుకొచ్చాం. మరిన్ని తీసుకొచ్చేందుకు ఈ వేదికను మరింత సమర్థవంతంగా వినియోగించుకుంటాం. ఆస్ట్రేలియా తెలంగాణ మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది" అని మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు సిపిఆర్ శిక్షణ కార్యక్రమం

**– జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్**






సిద్దిపేట: 15 అక్టోబర్ (వుదయం ప్రతినిధి): అకస్మాత్తుగా గుండెపోటుతో ప్రాణాపాస్థితి నుండి కాపాడేందుకు వీలుగా కలెక్టర్ హైమావతి ఆదేశాల మేరకు జిల్లా కార్యాలయ సముదాయంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ అధ్యక్షతన సిపిఆర్ పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించరూ. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ శిక్షణలో శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ ఆపదలో ఉన్న వ్యక్తులను శిక్షణ ద్వారా నేర్చుకున్న ప్రక్రియను ఉపయోగించి ప్రాణాలను కాపాడాలని, జిల్లాలో ప్రతి వ్యక్తికి సిపిఆర్ పై అవగాహన కలిగి ఉండాలని, జిల్లాలో ఇతర లైన్ డిపార్ట్మెంట్ ఉద్యోగులకు, పాఠశాలలో, కళాశాల లో ఉద్యోగులకు సిబ్బందికి, బస్టాండ్ లో సిపిఆర్ పై పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పౌరుడు తన జీవన విధానాన్ని జీవన శైలిని మార్చుకోవాలని, తీసుకుని ఆహారంలో విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతిరోజు వ్యాయామ చేయాలని, పని ఒత్తిడిని తగ్గించుకోవాలని, ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, డాక్టర్ని సంప్రదించాలని అత్యవసర సమయంలో సిపిఆర్ పై నిర్వహిస్తూనే 108 నంబర్కు కాల్ చేసి పేషంట్ ని పంపించాలని తద్వారా పూర్తిగా ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. అనంతరం ఉద్యోగులను గ్రూపులుగా విడదీసి, వైద్య అధికారుల చేత ఉద్యోగులందరికీ చేత సిపిఆర్ పక్రియను ఏ విధంగా చేయాలో నేర్పించడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ డిప్యూటీ కలెక్టర్ భవ్య, సి పి ఆర్, డిస్ట్రిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వినోద్ బాబ్జి, డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, వైద్య అధికారులు, జిల్లా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులు పాడి పరిశ్రమపై దృష్టి సారించాలి

వేములవాడ, అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి): రైతులు పాడి పరిశ్రమ అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కోనరావుపేట మండలం పల్లిమక్తలో బుధవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన, కలెక్టర్ ఎం. హరిత కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాడి పరిశ్రమ ప్రాముఖ్యతను, దాని ద్వారా రైతులు ఆర్థికంగా ఎలా అభివృద్ధి చెందవచ్చో వివరించారు.

## బెస్ట్ అవైలబుల్ బకాయిలు వెంటనే చెల్లించాలి

మెదక్, అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి): బెస్ట్ అవైలబుల్ పాఠశాలల బకాయిలను వెంటనే చెల్లించాలని స్టూడెంట్ వాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ అతిథి గృహంలో బుధవారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. బకాయిలు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులను పాఠశాలల్లోకి అనుమతించడం లేదని, దీనివల్ల పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాయికిరణ్ కూడా పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పై తప్పుడు ప్రచారం చేస్తే సహించం

దుబ్బాక, అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి): బీఆర్ఎస్ కంది మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పై తప్పుడు ప్రచారం చేస్తే సహించబోమని హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఇలాంటి ప్రచారాలు సరికాదని ఆయన పేర్కొన్నారు. ఆరోగ్యం సహకరించుకోకపోయినా ఎమ్మెల్యే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు.

## మహ్మదాబాద్‌లో ఘనంగా నివాళులర్పించిన నాయకులు

జడ్చర్ల, అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి): మహబూబ్ నగర్ జిల్లా మహ్మదాబాద్ మండల కేంద్రంలో భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. మండల కేంద్రంలోని గాంధీ విగ్రహ వద్ద అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గండేడు మాజీ ఎంపీపీ శాంతి, మాజీ ఎంపీటీసీ చెన్నయ్య, మాజీ సర్పంచ్ రాజేశ్వర్, రాంలాల్, అనంతయ్య, గుప్త, నరసింహులు గుప్త తదితరులు పాల్గొన్నారు.

## మహిళపై దాడి చేసి.. బంగారం ఎత్తుకెళ్లిన దుండగుడు

మునుగోడు, అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి): నకిరేకల్ మండలంలోని ఓగోడు మాదారం రహదారిలో గుర్తుతెలియని వ్యక్తి ఒక మహిళపై దాడి చేసి, ఆమె వద్ద ఉన్న ఐదు తులాల బంగారు గొలుసును దోచుకెళ్లిన సంఘటన చోటుచేసుకుంది. ఓగోడు గ్రామానికి చెందిన ఆవుల సావిత్రమ్మ(60) తన భూమికి సంబంధించిన పని నిమిత్తం మాదారం గ్రామానికి వెళుతుండగా, స్కూటీపై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఆమెను తన వాహనంపై ఎక్కించుకొని మార్గమధ్యలో ఆపి, దాడి చేసి, బంగారు గొలుసును దోచుకెళ్లాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వర్షం ముప్పుతో సర్వే పనులు తాత్కాలిక నిలిపివేత

ఎల్లారెడ్డి, అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి): ఆదిలాబాద్ జిల్లాలో సర్వే కార్యక్రమం నిర్వహణలో భాగంగా గ్రామాల్లో సర్వే చేయడానికి వెళ్లిన ట్రైనర్లు వర్షం ముప్పు కారణంగా కొంతసేపు ఆగి, తాత్కాలికంగా తమ పనులను నిలిపివేశారు. వాతావరణం అనుకూలించకపోవడంతో బయటకు వెళ్లడం సాధ్యంకాకపోవడంతో, అందరూ కలసి సరదాగా ఫోటోలు దిగారు. వర్షం తగ్గిన వెంటనే సర్వే కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన - జిల్లా కలెక్టర్ హైమావతి



సిద్దిపేట, 15 అక్టోబర్ (వుదయం ప్రతినిధి):సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలోని బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంలో వరి ధాన్య కొనుగోలు పక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. క్రితం సీజన్ లో 12 వేల క్వింటాల పైగా వరి ధాన్యం కొన్నామని ఏఎంసి ప్రాంతంలో వరి కోతలు మొదలయ్యాయని సిబ్బంది కలెక్టర్ కి తెలిపారు. ఏఎంసి మొత్తం కలియ తిరిగారు. ప్రభుత్వం నిర్దేశించిన తేమశాతం రాగానే గన్ని ల్లో నింపాలని ఆదేశించారు. తేమశాతం చెక్ చేశారు తేమశాతం వచ్చిన కూడా గన్ని లలో నింపట్లేదని అడగ్గా ధాన్యం అన్లోడింగ్ మిల్లు కేటాయించలేదని సెంటర్ సిబ్బంది తెలపగా వెంటనే అన్ని వరిధాన్య కొనుగోలు కేంద్రాలకు ఆయా దగ్గరలోని రైస్ మిల్లను కేటాయించే ప్రక్రియను త్వరగా పూర్తి చెయ్యాలని డీసీఎస్ఓ నీ ఫోన్ ద్వారా ఆదేశించారు. ఏఎంసి లోపల శుభ్రంగా ఉంచాలనీ తాగునీటి వసతి, టార్పలిన్ కవర్లు, పాడి క్లీనర్ లు, గన్ని బ్యాగులు ఇతర అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ సీజన్ లో జిల్లా మొత్తం 6లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నామని రైతులు ఎవ్వరు దళారుల వద్దకు వెళ్లి నష్టపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యం అమ్ముకోవాలని, బ్యాంక్ అకౌంట్, ఫోన్ నెంబర్ లింక్, ఆధార్ అప్డేట్ చేసుకుంటే పేమెంట్ లో ఎలాంటి సాంకేతిక సమస్యలు రావని రైతులకు పిలుపునిచ్చారు. అనంతరం బెజ్జంకీ మండల కేంద్రంలోని పలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
కలెక్టర్ వెంట తహసిల్దార్ శ్రీకాంత్, ఎంపిడిఓ తదితరులు ఉన్నారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

నల్లగొండ, అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి): సూర్యాపేట జిల్లా నియోజకవర్గంలో, మద్దిరాల గ్రామానికి చెందిన జక్కుల సైదమ్మ (50) అనారోగ్యంతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, జిల్లా బిఆర్ఎస్ నాయకులు గండూరి కృపాకర్ తన స్నేహితుడు కందగట్ల అనిల్ నుండి సేకరించిన బీ పాజిటివ్ రక్తాన్ని ఆమెకు అందించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మిర్యాలగూడ, అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి): సూర్యాపేట జిల్లా చివ్వేంల మండలంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. పిఎసిఎస్ సొసైటీ ద్వారా పిఎస్ఎస్ వైస్ చైర్మన్ కుర్ర సైదులు, సీఈవో వాసు సంయుక్తంగా చివ్వేంల, వీక్ పహాడ్, గుంపుల తిరుమలగిరి, బండమీది చందుపట్ల సెంటర్లను ప్రారంభించారు.

## ఘనంగా శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

**ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి**






బొల్లారం ,అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి): మున్సిపల్ పరిధిలో నూతనంగా శ్రీ రామ మందిరం నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం బొల్లారం మున్సిపల్ పరిధిలో నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీ హనుమాన్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో దైవభక్తిని పెంపొందించడంలో దేవాలయాల నిర్మాణాలు ఎంతగానో ఉపకరిస్తాయని తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా సొంత నిధులతో 200 దేవాలయాలు నిర్మించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## జగిత్యాల పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు...

**ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్**







జగిత్యాల అక్టోబర్ 15 (వుదయం ప్రతినిధి) జగిత్యాల పట్టణంలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ విచ్చేసి మాట్లాడుతూ పట్టణంలో ప్రజలు లేఔట్ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని పట్టణ అభివృద్ధికి ప్రజల సహకారం ఉండాలన్నారు తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక నిధులు జగిత్యాలకు మంజూరు అయ్యాయని టెండర్లు పూర్తయిన పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు టెండర్ అయినా పనులు ఏమైనా సమస్యలు ఉంటే వేరే చోటకు మార్చి పనులను అధికారులు పూర్తి చేయాలన్నారు కాంగ్రెస్ ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి హయాంలో రాష్ట్రంలో ఉచిత విద్యుత్ సన్న బియ్యం నూతన రేషన్ కార్డుల మంజూరి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం విధులు మంజూరు చేశారన్నారు అలాగే ఇండ్ల నుండి విలువడే తడి పొడి చెత్త సేకరణ వేరు చేయడం ద్వారా పట్టణ పారిశుధ్యం మెరుగుపరచడం మన అందరి బాధ్యత అన్నారు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా సైన్స్ లాబ్ ను ప్రారంభించడం ఆనందదాయకమన్నారు కళాస్ఫూర్తితో ప్రతి విద్యార్థి కలలు కని వాటిని సహకారం చేసుకోవాలన్నారు పాఠశాలలో నిర్మిస్తున్న సైన్స్ ల్యాబ్ లు విద్యార్థుల పాలిట విజ్ఞాన కేంద్రాలు అన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్యానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు గురువులు విద్యతో పాటు సాంస్కృతి సాంప్రదాయాలను బోధన చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ తో పాటు జిల్లా విద్యాధికారి రాము జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ మాజీ మున్సిపల్ చైర్మన్ లు గిరి నాగభూషణం అడువాల జ్యోతి లక్ష్మణ్ ఏఈ ధనుంజయ్ పిఆర్టియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆనంద్ రావు అమర్నాథ్ రెడ్డి శేఖర్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వీరబత్తిని శ్రీనివాస్ మాజీ కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాస్ ప్రిన్సిపాల్ తిరుపతి బాలే శంకర్ మాజీ కౌన్సిలర్ లు నాయకులు యూత్ నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## స్వర్ణ భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో కలాం జయంతి వేడుకలు

దేవరకొండ, అక్టోబర్ 15(ఎ.ఎం.ఎస్): కోదాడ పట్టణంలో స్వర్ణ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం స్వర్గీయ అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోదాడ కేఆర్ఆర్ కళాశాల విశ్రాంత అధ్యాపకులు శ్రీరామ కవచం వెంకటేశ్వర్లు, మంత్రిప్రగడ భరతా రావు, రిటైర్డ్ ప్రిన్సిపల్ పోతుగంటి నాగేశ్వరావులను అబ్దుల్ కలాం అవార్డులతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు బాధ్యులు, కిట్స్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020, Telangana. **Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail :** voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.